Published from
Telangana and Andhra Pradesh

PRGI NO.TELTEL/2010/33275

ఎడిటర్- కలకొండ రామకృష్ణ

ప్రజా కాలం

PRAJA KALAM Telugu Daily జాతీయ దినపత్రిక

Digital Editions : www.prajakalam.in., epaper.prajakalam.in , www.magzter.com, www.paperboy.com

శనివారం | 07-11- 2026 | సంపుటి: 17, సంచిక: 217, పేజీలు: 12, వెల: 3/-




వ్యవసాయాన్ని
లాభసాటిగా మార్చడమే
ప్రజా ప్రభుత్వ లక్ష్యం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో
వ్యవసాయ రంగాన్ని బలోపేతం
చేసేందుకు అనేక చర్యలు: మంత్రి తుమ్మల

2

కలం కౌంటర్



పెట్టుబడులకు గ్లోబల్ హబ్‌గా తెలంగాణను తీర్చిదిద్దడమే

ప్రభుత్వ లక్ష్యం

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే మా పాధాన్యత : మంత్రి శ్రీధర్ బాబు

పెట్టుబడులకు అత్యంత అనుకూల ప్రాంతం మన హైదరాబాద్

గ్లోబల్ సమ్మిట్‌కు ప్రీ-సమ్మిట్ కార్యక్రమంగా ఇండియన్ రోడ్ కాంగ్రెస్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఐటీశాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో పెట్టుబడులు, నూతన ఆవిష్కరణలు,అత్యాధునిక సాంకేతికతకు తెలంగాణ కేంద్రంగా మారనుంది : మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో పికో టెక్నాలజీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రులు



హైద్రాబాద్ నవంబర్ 6(ప్రజాకలం ప్రతినిధి)

పికో టెక్నాలజీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రధాన కార్యాలయాన్ని PICO ఫౌండర్ సీఈఓ జారోడ్ యస్టర్,AICO జి.సీతారాం,రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తో కలిసి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ

తరువాయి 2వ పేజీలో...




కబ్జాల పర్వం

కళ్ళముందే బఫర్ జోన్‌లో యదేచ్ఛగా జి

- చర్యలకు జంకుతున్న అంబర్‌పేట్ తాసిల్దార్
- ప్రభుత్వం ఓ పక్క మూసి ప్రక్షాళన చేపడుతుంటే మరోపక్క కబ్జాలు
- ఇరిగేషన్ శాఖ అధికారులు చొరవ చూపినా....కదలని రెవెన్యూశాఖ యంత్రాంగం
- అవి పట్టా భూములు మీకెందుకు అని జర్నలిస్టుపై ఎమ్మార్వో గుస్సా
- తాసిల్దార్ తీరుపై స్థానికులు ఆగ్రహం
- కబ్జాల వెనుక రాజకీయ పెద్దల ఒత్తిళ్లు ఉన్నట్లు పలు అనుమానాలు ?
- క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి బపర్ జోన్ భూములను కాపాడాలని స్థానికుల డిమాండ్

హైద్రాబాద్ నవంబర్ 6(ప్రజాకలం ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మూసి నది ప్రక్షాళన చేపడుతుంటే, అంబర్‌పేట నియోజకవర్గ పరిధిలోని మూసి రివర్ ఫ్రంట్ బఫర్ జోన్‌లో ఆక్రమణలు మాత్రం యథేచ్ఛగా కొనసాగుతున్నప్పటికి రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులు అందగానే ఇరిగేషన్ శాఖ అధికారులు జేసీబీ,ఇటాచీ, మట్టిని తీసుకొస్తున్న వాహనాలను నిలువరించి చొరవ చూపినప్పటికీ, అంబర్‌పేట



తాసిల్దార్ చర్యలు తీసుకోకపోగా దీనిపై ప్రశ్నించిన జర్నలిస్టును ఎదురు ప్రశ్నించడం విస్మయానికి గురిచేస్తుందని పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తరువాయి 2వ పేజీలో...

హైదరాబాద్‌కు రాహుల్!

ఈ నెల 12, 13, 14 తేదీల్లో ఒక రోజు వచ్చే చాన్స్

'భారత్ సమ్మిట్'లో పాల్గొనేందుకే..!

హైద్రాబాద్ నవంబర్ 6(ప్రజాకలం ప్రతినిధి)

హెచ్ఐసీసీలో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు జరగనున్న భారత్ సమ్మిట్‌లో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ పాల్గొనే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. సదస్సు జరిగే మూడు రోజుల్లో



ఏదో ఒక రోజు ఆయన హాజరై కీలక ఉపన్యాసం చేస్తారని వెల్లడించాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంలో జరగనున్న ఈ సదస్సుకు వంద దేశాలకు చెందిన 450 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ ప్రతినిధుల్లో పారిశ్రామిక వేత్తలతో పాటుగా పలు ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన అగ్ర నాయకులు ఉన్నారు. ఏఐ, డిజిటల్ టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ, ఆర్థికాభివృద్ధి, ద్వైపాక్షిక సంబంధాలు, గ్లోబల్ పార్ట్‌నర్‌షిప్ అనే అంశాలపైన ఈ సదస్సులో ప్రధానంగా చర్చించనున్నారు.

'గ్లోబల్ సమ్మిట్' ఏర్పాట్లను పరిశీలించిన ఫ్యూచర్‌సిటీ సీపీ తరుణ్‌జోషి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను వేగవంతం చేయాలని ఫ్యూచర్‌సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్‌జోషి ఆదేశించారు. శుక్రవారం ఫ్యూచర్‌సిటీ అథారిటీ కమిషనర్ శశాంకతో కలిసి రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్ఖాన్‌పేట రెవెన్యూ పరిధిలోని స్కిల్ యూనివర్సిటీ, రేడియల్ రోడ్డు పనులు, భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ తరుణ్‌జోషి మాట్లాడుతూ.. సమ్మిట్ ప్రాంగణంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది కాకుండా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లో ఉన్న రహదారి పనులను త్వరితగతిన చేపట్టాలని అధికారులకు సూచించారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి
చిత్తశుద్ధి లేదు

రైతులకు రూ. 5వేల తక్షణ సాయం అందించాలి

మెదక్ జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించకపోవడం దారుణం: హరీశ్



హైద్రాబాద్ నవంబర్ 6(ప్రజాకలం ప్రతినిధి)

కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల పట్ల కనీన చిత్తశుద్ధి లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో రైతుల సమస్యలపై కనీనం చర్చించకపోవడమే ఇందుకు నిదర్శనమని మండిపడ్డారు. మహారాష్ట్ర, కర్ణాటక తరహాలో తెలంగాణలోనూ రూ. 5 వేల తక్షణ ఆర్థిక సాయం అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

తరువాయి 2వ పేజీలో...

పుష్కర పనుల్లో జాప్యానికి తావొద్దు!

భక్తులకు అన్ని వసతులు కల్పించాలి

నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేయాలి

అధికారులకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశం



హైద్రాబాద్ నవంబర్ 6(ప్రజాకలం ప్రతినిధి)

2027లో జరగనున్న గోదావరి పుష్కరాలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు అధికారులను ఆదేశించారు. పుష్కరాల సందర్భంగా చేపట్టిన అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయడంతోపాటు, పూర్తయిన పనుల నాణ్యతను పరిశీలించి, మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని స్పష్టం చేశారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో జగిత్యాల జిల్లా ధర్మపురి తదితర ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతి, ఇప్పటికే పూర్తయిన పనులు, ఇంకా ప్రారంభం కావాల్సినవి, వివిధ దశల్లో కొనసాగుతున్న పనులపై శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో

తరువాయి 2వ పేజీలో...

కమలంలో పోస్టర్ల కలకలం!

బీజేపీ రాష్ట్ర కార్యాలయం సహా నగరంలోని పలుచోట్ల 'మోస్ట్ వాంటెడ్' పోస్టర్లు



అత్యాచారం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న పి.ఎం. సాయిప్రసాద్ లక్ష్యంగా ప్రచారం

ఆచూకీ తెలిపిన వారికి రూ.లక్ష బహుమతి అంటూ పోస్టర్లు

వ్యవహారంపై ముగ్గురు మహిళలతో ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ

సాయి ప్రసాద్‌ను పార్టీ నుంచి తొలగించాలని కమిటీ సిఫారసు చేసినట్లు ప్రచారం

నివేదికపై రాష్ట్ర నాయకత్వం కసరత్తు - త్వరలో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం!

హైదరాబాద్, నవంబర్ 6 (ప్రజాకలం):

బీజేపీలో పి.ఎం. సాయిప్రసాద్ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. మాజీ బీజేవైఎం జాతీయ కోశాధికారిగా పనిచేసిన సాయిప్రసాద్ అలియాస్ 'టీమ్ సాయి'పై అత్యాచారం కేసు నమోదైన నేపథ్యంలో నగరంలో వెలిసిన 'మోస్ట్ వాంటెడ్' పోస్టర్లు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం, బర్కత్‌పురలోని నగర కార్యాలయంతో పాటు పలు ప్రాంతాల్లో ఈ పోస్టర్లు దర్శనమిచ్చాయి. సాయిప్రసాద్ ఆచూకీ తెలిపిన వారికి రూ.లక్ష బహుమతి అందజేస్తామని అందులో పేర్కొనడం చర్చకు దారితీసింది. కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా హైదరాబాద్‌లో పాదయాత్ర నిర్వహించిన రోజే ఈ పోస్టర్లు వెలవడం మరింత ఆసక్తికరంగా మారింది.

ముగ్గురు మహిళలతో కమిటీ

సాయిప్రసాద్‌పై నమోదైన కేసు వ్యవహారాన్ని రాష్ట్ర బీజేపీ నాయకత్వం తీవ్రంగా పరిగణించినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో వాస్తవాలను తెలుసుకునేందుకు ముగ్గురు మహిళలతో ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు సమాచారం. కమిటీ విచారణ పూర్తి చేసి రాష్ట్ర నాయకత్వానికి నివేదిక సమర్పించినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారం ఓ మహిళ జీవితానికి సంబంధించినది కావడంతో కమిటీ అన్ని కోణాల్లో విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. నివేదికలో సాయిప్రసాద్‌ను పార్టీ నుంచి తొలగించాలని సిఫారసు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై రాష్ట్ర నాయకత్వం సమాలోచనలు చేస్తున్నట్లు సమాచారం.

పార్టీ నుంచి ఉద్వాసన తప్పదా?

కమిటీ నివేదిక నేపథ్యంలో సాయిప్రసాద్‌పై పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

తరువాయి 2వ పేజీలో...

రాష్ట్ర ఆదాయ వనరుల బలోపేతానికి
సమగ్ర కార్యాచరణ ప్రణాళిక



- రాష్ట్ర ఆదాయ సమీకరణ వేగవంతంపై ప్రత్యేక దృష్టి
- నిర్ణీత గడువుల్లో ప్రభుత్వ ఆదాయ లక్ష్యాలను సాధించాలి
- ల్యాండ్ పూలింగ్, పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణ, ప్రభుత్వ ఆస్తుల సమర్థ వినియోగంపై ప్రత్యేక దృష్టి
- దరఖాస్తుల సత్వర పరిష్కారానికి వారాలవారీగా లక్ష్యాలు
- పారదర్శక విధానాలు, వనరుల సమర్థ వినియోగంతో భవిష్యత్ ఆదాయాన్ని పెంచాలి: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క


హైదరాబాద్, నవంబర్ 6 (ప్రజాకలం):

రాష్ట్ర ఆర్థిక వనరులను బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన ఆదాయ లక్ష్యాలను నిర్ణీత గడువుల్లో సాధించేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రభుత్వ భూములు, పారిశ్రామిక లేఅవుట్లు, ల్యాండ్ పూలింగ్, భూముల వేలం ద్వారా ఆదాయ సమీకరణకు ఉన్న అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, ఈ ప్రక్రియలో పారదర్శకత, సమర్థతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఆదాయ వనరుల సమీకరణపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం జరిగింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉపసంఘం సభ్యులు, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. వివిధ శాఖల ఉన్నతాధికారులతో రాష్ట్ర ఆదాయ వనరుల సమీకరణపై

తరువాయి 2వ పేజీలో...

కళ్ళముందే బఫర్ జోన్‌లో యదేచ్ఛగా కబ్జాల పర్వం





మొదటి పేజీ తరువాయి...

మూసి పరివాహక ప్రాంతంలోని బఫర్‌జోన్‌లో జరుగుతున్న ఈ కబ్జాలను అంబర్పేట్ తహసిల్దార్ ఆపకపోవడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని బలంగా వినిపిస్తుంది.

ఇరిగేషన్ శాఖ అధికారులు చొరవ చూపినా.... కదలని రెవెన్యూశాఖ యంత్రాంగం

బఫర్ జోన్ లో భూములు కబ్జాకు గురవుతు న్నాయని పలు ఫిర్యాదులు అందినప్పటికీ తాసిల్దార్,రెవెన్యూ యంత్రాంగం అటుపక్క చూడకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

కబ్జాకోరులకు రెవెన్యూ శాఖ అధికారులు సహకరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు కబ్జాను అడ్డుకొని జిహెచ్ఎంసి,తాసిల్దార్ కార్యాలయానికి నోటీసులు అందజేసినప్పటికి కబ్జాలను అడ్డుకోకపోవడం వెనుక మతలబు ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మూసి బఫర్ జోన్ భూములు కబ్జాలకు గురవుతున్న విషయం తెలుసుకొని అంబర్పేట్ తాసిల్దార్ ను ప్రజాకలం ప్రతినిధి వివరణ కోరగా అవి పట్టా భూములు మీరెందుకు ఇష్యూ చేస్తున్నారని ఎదురు ప్రశ్నించడం వెనుక ఉద్దేశం ఏమిటో ప్రజలు గమనించాలి.

కబ్జాల వెనుక రాజకీయ పెద్దల ఒత్తిళ్లు ఉన్నట్లు పలు అనుమానాలు ?

దాదాపు గత నెల రోజులుగా మూసి పరివాహక ప్రాంతంలో వాహనాలతో మట్టి నింపుతూ యదేచ్ఛగా కబ్జాలు జరుగుతున్నా స్థానిక ఎమ్మార్వో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు స్థానికులు. ఈ కబ్జాల బాగోతం వెనుక రాజకీయ పెద్దల ఒత్తిళ్లు ఉన్నట్లు స్థానికుల నుంచి బలంగా వినిపిస్తుంది.

అధికారులు స్పందించి బఫర్ జోన్ భూములను కాపాడాలని కోరుతున్న స్థానికులు...

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసి ప్రక్షాళనలో భాగంగా పారదర్శకంగా సర్వే నిర్వహించి మూసి పరివాహక ప్రాంతంలోని బఫర్ జోన్ భూములను కబ్జాకోరుల కబంధహస్తాల నుంచి పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

పుష్కర పనుల్లో జాప్యానికి తావొద్దు!

మొదటి పేజీ తరువాయి...

మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. దేవాదాయ శాఖ డైరెక్టర్ ఉ కమిషనర్ దేవాదాయ శాఖ శ్రీ ఎం .హనుమంతరావు, జగిత్యాల జిల్లా కలెక్టర్ శ్రీ.బి. సత్య ప్రసాద్ లతో పాటు,ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ , ఇరిగేషన్ శాఖల అధికారులు, వివిధ విభాగాలకు చెందిన అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు మాట్లాడుతూ.. గోదావరి పుష్కరాలు రాష్ట్రానికి ఆధ్యాత్మికంగా, సాంస్కృతికంగా ఎంతో ప్రాధాన్యమైనవని, ధర్మపురి వంటి పుణ్యక్షేత్రాలకు రాష్ట్రంతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పెద్దఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉ ఒదన్నారు. ఈ నేపథ్యంలో భక్తుల రాకపోకలకు అనుగుణంగా రహదారులు, పుష్కర ఘాట్లు, పార్కింగ్ స్థలాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్తు, వైద్య సదుపాయాలు, మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు తదితర మౌలిక వసతులను సమగ్రంగా కల్పించాలని సూచించారు. పుష్కరాల పనుల్లో ఇరిగేషన్, పంచాయతీరాజ్, రోడ్లు–భవనాలు (ఆర్‌అండ్‌బీ), దేవాదాయ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. ఒక శాఖ పనుల వల్ల మరో శాఖ పనులకు ఆటంకం కలగకుండా ముందస్తు కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని దిశానిర్దేశం చేశారు.

పనుల నాణ్యతలో రాజీ వద్దు

పుష్కరాల కోసం చేపడుతున్న ప్రతి పనికి సంబంధించి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని మంత్రి సూచించారు. పూర్తయిన పనుల వివరాలు, ప్రస్తుతం కొనసాగుతున్న పనుల పురోగతి, ఇంకా ప్రారంభం కావాల్సిన పనులు, వాటి అంచనా వ్యయం, పూర్తి చేయాల్సిన గడువులతో కూడిన నివేదికను సిద్ధం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు తరచూ పర్యటిస్తూ పనుల నాణ్యతను పరిశీలించాలని, కాంట్రాక్టర్లు నిర్దేశిత ప్రమాణాలు పాటించేలా చూడాలని ఆదేశించారు. ప్రత్యేకించి పుష్కర ఘాట్ల వద్ద భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని సురక్షితంగా పుణ్యస్నానాలు ఆచరించేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, చిన్నపిల్లలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని, అత్యవసర వైద్య సేవలు, అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, భక్తుల రాకపోకలకు ప్రత్యేక మార్గాల రూపకల్పనపై దృష్టి సారించాలని సూచించారు. పుష్కరాల సమయంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని, గోదావరి నది పరిశుభ్రతను కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. భక్తులకు తాగునీరు, ఆహారం, విశ్రాంతి కేంద్రాలు అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖలు సమగ్ర ప్రణాళిక రూపొందించాలన్నారు. స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, వారి అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు.

ధర్మపురి అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం

గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉ ంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ధర్మపురి, కోటిలింగాల ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోంది. పుష్కరాల కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ. 1,000 కోట్ల నిధులు కేటాయించినట్లు ప్రభుత్వం ప్రకటించి ంది. ధర్మపురి ప్రాంతంలో సుమారు రూ. 226 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టే ప్రణాళికలో భాగంగా పుష్కర ఘాట్లు, రహదారులు, పార్కింగ్ తదితర సదుపాయాల కల్పనకు చర్యలు కొనసాగుతున్నాయి. ధర్మపురిలో సుమారు 470 మీటర్ల మేర కొత్త స్నాన ఘాట్ల అభివృద్ధి కూడా ప్రతిపాదిత పనుల్లో ఉంది. జూన్ 26 నుంచి జూలై 7, 2027 వరకు గోదా వరి పుష్కరాలు నిర్వహించనున్న నేపథ్యంలో, అప్పటిలోగా అన్ని శాశ్వత, తాత్కాలిక పనులు పూర్తి చేసి భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని మంత్రి స్పష్టం చేశారు.

పెట్టుబడులకు గ్లోబల్ హబ్‌గా తెలంగాణను

తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

మొదటి పేజీ తరువాయి...

మంత్రి శ్రీధర్ బాబు శుక్రవారం హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూతెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడులకు గమ్యస్థానంగా, ప్రపంచ స్థాయి పారిశ్రామిక సంస్థలకు ఆకర్షణీయమైన కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులను తీసుకురావడంతో పాటు స్థానిక యువతకు నైపుణ్యానికి తగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు తెలంగాణ వైపు చూసేలా రాష్ట్రంలో అనుకూలమైన పారిశ్రామిక వాతావరణాన్ని కల్పిస్తున్నామని పేర్కొన్నారు. పెట్టుబడిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ సహకారం అందిస్తూ పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం కల్పిస్తున్నామని తెలిపారు. కొత్త సంస్థల రాకతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడమే కాకుండా యువతకు మెరుగైన భవిష్యత్తు అందుతుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా గ్లోబల్ సమ్మిట్ పాలసీని తీసుకొచ్చామని, రాష్ట్ర పెట్టుబడుల సామర్థ్యాన్ని అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పేందుకు ఈ కార్యక్రమం కీలక వేదికగా నిలచిందని తెలిపారు. ఈ సారి డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్ వేదికగా ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సమ్మిట్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులు,పారిశ్రామిక దిగ్గజాలను తెలంగాణకు ఆహ్వానించి,రాష్ట్రంలో ఉన్న అపారమైన పెట్టుబడి అవకాశాలను పరిచయం చేసి పెట్టుబడులను ఆహ్వానించనున్నట్టు తెలిపారు.

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణను పెట్టుబడుల,నూతన ఆవిష్కరణలకు,అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానానికి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. హైదరాబాద్ ఇప్పటికే అంతర్జాతీయ స్థాయి ఐటీ,సాంకేతిక సంస్థలకు ప్రధాన కేంద్రంగా ఎదుగుతోందని, ప్రపంచస్థాయి కంపెనీలు రాష్ట్రంలో తమ కార్యకలాపాలను విస్తరించేందుకు ముందుకు రావడం తెలంగాణ అభివృద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. వికో టెక్నాలజీ ఇండియా వంటి సంస్థలు హైదరాబాద్‌లో తమ ప్రధాన కార్యాలయాలను ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమన్నారు. ఇలాంటి సంస్థల రాకతో తెలంగాణకు అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభించడంతో పాటు సాంకేతిక రంగంలో కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలు, సంస్థలకు ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహం అందిస్తుందని స్పష్టం చేశారు. పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, పెట్టుబడుల ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు పెరగడంతో పాటు రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి బాటలు పడతాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో తెలంగాణను పెట్టుబడుల గమ్యస్థానంగా,నూతన ఆవిష్కరణలు, పరిశోధనలు,అత్యాధునిక సాంకేతికతకు అంతర్జాతీయ కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నదే మా ప్రభుత్వ అని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్‌కు ప్రీ–సమ్మిట్ కార్యక్రమంగా ఈ నెల 19 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సమావేశాలు నిర్వహించనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా రహదారుల రంగానికి చెందిన నిపుణులు,ఇంజినీర్లు ఈ సమావేశాల్లో పాల్గొననున్నారని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

మొదటి పేజీ తరువాయి...

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని భీమ్లా తండా, దేవునిగుట్ట తండా, సిరిపురం, నస్తీపూర్ గ్రామాల్లో శుక్రవారం హరీశ్‌రావు పర్యటించారు. పంట నష్టపోయిన రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి మెదక్ జిల్లాపై వివక్ష చూపుతున్నార ని ఆరోపించారు. జిల్లాలోని 21 మండలాలకు గాను మనోహరాబాద్ మండలాన్నే కరువు మండలంగా ప్రకటించి.. మిగతా రైతులకు అన్యాయం చేశారని అన్నారు. ఏడుపాయల వనదుర్గాదేవి, కొమురవెల్లి మల్లన్న, మెదక్ చర్చి సాక్షిగా ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి విస్మరించారని విమర్శించారు. పరిశ్రమలకు లక్షలాది లీటర్ల నీటిని విక్రయిస్తున్న ప్రభుత్వం, ప్రజలకు తాగునీరు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తోందని దుయ్యబట్టారు. సింగూరు ప్రాజెక్టులో గతంలో 20 టీఎంసీల నీరు ఉ ండేదని, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రస్తుతం రెండు టీఎంసీలకు పడిపోయిందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఢిల్లీకి మూటలు మోసేందుకు నిధులు ఉంటాయి కానీ, కష్టాల్లో రైతులను ఆదుకోవడానికి మాత్రం మనసు రావడం లేదని ఎద్దేవా చేశారు. రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ కాకపోవడంతో బంగారం తాకట్టు పెట్టి అప్పులు తెచ్చుకునే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సుమారు 30 శాతం వరి కోతలు పూర్తయినా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు కల్పించలేదని విమర్శించారు.

నేలచూపు చూస్తున్న ఆర్టీసీ ఆత్మగౌరవం

ఆర్టీసీ సంస్థలో పనిచేస్తున్న కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా అధికారులు వ్యవహరిస్తున్నారంటూ హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు.

సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ కార్మికులతో వ్యవహరించిన తీరుపై ఆయన శుక్రవారం ఎక్స్ వేదికగా ధ్వజమెత్తారు. డిపోలోని కార్మికుల సమస్యలపై మాట్లాడానికి వెళ్లిన జేఏసీ నాయకులను, కార్మికులను సిద్దిపేట డిపో మేనేజర్ కింద కూర్చోబెట్టి మాట్లాడుతున్న ఫొటోను పోస్ట్ చేసిన ఆయన.. 'కార్మికులంటే ఇంత చిన్నచూపా?' అంటూ అధికారుల తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు.

కమలంలో పోస్టర్ల కలకలం!

మొదటి పేజీ తరువాయి...

ఆయనను పార్టీ బాధ్యతల నుంచి తప్పించే అంశంపై నాయకత్వం కసరత్తు చేస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. అయితే ఇప్పటివరకు పార్టీ నాయకత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు.

పోలీసులకు చిక్కని సాయిప్రసాద్?

మరోవైపు అత్యాచారం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సాయిప్రసాద్ ఆచూకీ ఇంకా తెలియరాలేదని సమాచారం. కేసు నమోదైనప్పటి నుంచి ఆయన అందుబాటులో లేరని, పోలీసులు ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో నగరంలో మోస్ట్ వాంటెడ్ పోస్టర్లు వెలవడం, రూ.లక్ష రివార్డు ప్రకటన చేయడం చర్చనీయాంశమైంది. ఒకవైపు పోలీసుల దర్యాప్తు.. మరోవైపు పార్టీ ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక.. ఇంకోవైపు బీజేపీ కార్యాలయాల వద్ద వెలిసిన పోస్టర్లు.. ఇలా సాయిప్రసాద్ వ్యవహారం పార్టీ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది. ఈ పరిణామాలపై రాష్ట్ర బీజేపీ నాయకత్వం తీసుకోబోయే నిర్ణయం ఏమిటన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

రాష్ట్ర ఆదాయ వనరుల బలోపేతానికి

సమగ్ర కార్యాచరణ ప్రణాళిక

మొదటి పేజీ తరువాయి...

సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు స్పష్టమైన లక్ష్యాలు, శాఖల మధ్య సమన్వయం, సకాలంలో నిర్ణయాలు తీసుకోవడం అత్యంత అవసరమని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రతి శాఖ వారాలవారీగా కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకోవాలని, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షించాలని ఆదేశించారు.

పారిశ్రామిక లేఅవుట్లు, పాత పారిశ్రామికవాడల్లో భూముల వినియోగం, క్రమబద్ధీకరణ ద్వారా ఆదాయ సమీకరణకు ఉన్న అవకాశాలను ఉప ముఖ్యమంత్రి సమీక్షించారు. ఇప్పటికే సమకూరిన ఆదాయం, వివిధ దశల్లో ఉన్న ప్రతిపాదనల వివరాలను అధికారులు ఆయనకు వివరించారు.

ఈ కార్యక్రమాల ద్వారా నిర్దేశిత ఆదాయ లక్ష్యాన్ని సాధించేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని భట్టి విక్రమార్క సూచించారు.

పారిశ్రామిక భూములకు సంబంధించిన ప్రక్రియలను వేగవంతం చేసి, అందుబాటులో ఉన్న అవకాశాలను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా నిర్దేశిత ఆదాయ లక్ష్యాన్ని చేరుకోవాలని అధికారులను ఆదేశించారు. అజామాబాద్, బాలానగర్, హఫీజ్‌పేట వంటి పారిశ్రామిక ప్రాంతాల్లో యూనిట్లవారీగా భూముల క్రమబద్ధీకరణ, అనుమతుల ప్రక్రియలను వేగవంతం చేయాలని సూచించారు. బీ–కేటగిరీ, సూక్ష్మ పారిశ్రామిక యూనిట్లకు సంబంధించిన ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించాలని, పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం కలిగించడంతో పాటు ప్రభుత్వానికి అదనపు ఆదాయం సమకూరేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన వ్యాపార వాతావరణాన్ని కల్పించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు.

పారిశ్రామిక యూనిట్లకు సంబంధించిన దరఖాస్తులను నిర్ణీత గడువుల్లో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల పరిష్కారానికి వారాలవారీగా లక్ష్యాలను నిర్ణయించి, సంబంధిత అధికారులకు స్పష్టమైన బాధ్యతలను అప్పగించాలని సూచించారు. రోజువారీ పురోగతిని పర్యవేక్షించడం ద్వారా పారిశ్రామికవేత్తలకు వేగవంతమైన, సులభతరమైన సేవలు అందేలా చూడాలన్నారు. పారిశ్రామిక ప్రాంతాల్లో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడం ద్వారా పారిశ్రామిక కార్యకలాపాలు విస్తరిస్తాయని, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ప్రభుత్వ ఆదాయ వృద్ధికి దోహదపడుతుందని ఉప ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ పరిసరాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలు, ముఖ్యంగా మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో ల్యాండ్ పూలింగ్, భవిష్యత్ అవసరాలకు భూముల లభ్యత, భూ వనరుల సమీకరణపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. భవిష్యత్తులో ప్రభుత్వ ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన భూములను ముందుగానే గుర్తించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. ల్యాండ్ పూలింగ్ ప్రక్రియలో పాల్గొనే అన్ని వర్గాలకు స్పష్టతతో పాటు ప్రయోజనం కలిగేలా ప్రణాళికాబద్ధమైన, పారదర్శకమైన విధానాన్ని రూపొందించాలన్నారు.

ల్యాండ్ పూలింగ్ ద్వారా ప్రభుత్వానికి సమకూరే భూ వనరులను అభివృద్ధి ప్రాధాన్యతలకు అనుగుణంగా వినియోగించుకునే అవకాశాలను పరిశీలించాలని, అదనపు ఆదాయం సమకూర్చే మార్గాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూముల వినియోగంలో ప్రజా ప్రయోజనాలు, రాష్ట్ర అభివృద్ధి అవసరాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

రోడ్లు, పార్కులు, పాఠశాలలు, ఆసుపత్రులు వంటి అత్యవసర మౌలిక సదుపాయాల అభివృద్ధికి, వివిధ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన భూముల కేటాయింపునకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ల్యాండ్ పూలింగ్ ద్వారా ప్రభుత్వ వాటాగా లభించే భూములను నిర్దిష్ట ప్రజా అవసరాలకు వినియోగించేందుకు స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని ఆదేశించారు. అసైన్డ్ భూములకు సంబంధించిన అంశాలను చట్టపరమైన నిబంధనలు, ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా సమగ్రంగా పరిశీలించి, తగిన ప్రతిపాదనలను మంత్రివర్గ పరిశీలనకు సమర్పించాలని సూచించారు.

హెచ్ఎండీఏ, టీజీఐఐసీ పరిధిలోని భూముల అభివృద్ధి, వేలం ద్వారా ఆదాయ సమీకరణకు ఉన్న అవకాశాలను కూడా ఉప ముఖ్యమంత్రి సమీక్షించారు.

వేలానికి అనువైన లేఅవుట్లను గుర్తించాలని, ప్రధాన రహదారులకు మెరుగైన అనుసంధానం, అభివృద్ధికి అవకాశాలు ఉన్న ప్రాంతాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. భూముల వేలం ప్రక్రియను దశలవారీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

భూముల వివరాలు, లేఅవుట్ల ప్రస్తుత స్థితి, వేలానికి సిద్ధంగా ఉన్న ప్లాట్లు, ముందస్తు ఏర్పాట్ల పురోగతి తదితర అంశాలతో కూడిన స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను వచ్చే వారంలోగా సిద్ధం చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు.

సాంకేతిక పరిజ్ఞాన ఆధారిత పరిపాలనకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని ఉప ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రభుత్వ భూములు, లేఅవుట్ల అభివృద్ధి, వేలం సంబంధిత కార్యకలాపాలను సమర్థంగా పర్యవేక్షించేందుకు ప్రత్యేక డిజిటల్ డ్యాష్‌బోర్డ్ రూపొందించాలని సూచించారు.

భూముల వివరాలు, లేఅవుట్ల స్థితి, వేలానికి సిద్ధంగా ఉన్న ప్లాట్లు, వివిధ కార్యక్రమాల పురోగతి వంటి సమగ్ర సమాచారాన్ని ఒకే డిజిటల్ వేదికపై అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.

ఈ డ్యాష్‌బోర్డ్ ద్వారా శాఖల మధ్య సమన్వయం మెరుగుపడటంతో పాటు నిర్ణయాలను వేగంగా తీసుకునేందుకు అవకాశం ఉంటుందని, భూముల వేలం ప్రక్రియలో పారదర్శకత మరింత పెరుగుతుందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

రైతుల ఆదాయం పెంచి.. వ్యవసాయాన్ని

లాభసాటిగా మార్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు అనేక చర్యలు

నవంబర్ 7 నుంచి 9 వరకు హాకీంపేటలో మెగా రైతు మేళా

150 ప్రదర్శన స్టాళ్లు.. 10 జిల్లాల నుంచి 50 వేల మంది రైతుల హాజరు

లగచర్లలో ఎకో పామ్ ఆయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీకి ముఖ్యమంత్రి శంకుస్థాపన

రైతులు, శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలను ఒకే వేదికపైకి తీసుకువచ్చేలా మెగా రైతు మేళా: మంత్రి తుమ్మల

హైదరాబాద్, నవంబర్ 6 (ప్రజాకలం):

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత మరియు జౌళి శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తెలంగాణ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసి, రైతుల ఆదాయాన్ని పెంచి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలం హాకీంపేటలో మూడు రోజుల పాటు మెగా రైతు మేళా నిర్వహిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. నవంబర్ 7న ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి చేతుల మీదుగా ఈ మేళా ప్రారంభం కానుందని తెలిపారు. ప్రారంభోత్సవం అనంతరం ముఖ్యమంత్రిగారు రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రగతిశీల రైతులతో ముఖాముఖి చర్చలు జరపడమే కాకుండా పారిశ్రామికవేత్తలతోనూ సమావేశమవుతారని వివరించారు. నవంబర్ 8న ముఖ్యమంత్రి హాకీంపేటలో స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమవుతారని, అనంతరం వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహిస్తారని మంత్రి తెలిపారు. నవంబర్ 9న పది జిల్లాల నుంచి సుమారు 50 వేల మంది



రైతులు పాల్గొనే భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రైతులను ఉద్దేశించి ప్రసంగిస్తారని తెలిపారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడం, వ్యవసాయంలో వస్తున్న నూతన ఆవిష్కరణలను పరిచయం చేయడమే మెగా రైతు మేళా ప్రధాన ఉద్దేశమని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు, పరిశ్రమల ప్రతినిధులను ఒకే వేదికపైకి తీసుకువస్తున్నామని తెలిపారు. మెగా రైతు మేళాలో ఏర్పాటు చేస్తున్న 150 ప్రదర్శన స్టాళ్ల ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ యంత్రాలు, డ్రోన్లు, నూతన సాగు పద్ధతులు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలపై ప్రత్యక్ష అవగాహన కలుగుతుందని మంత్రి తెలిపారు. శాస్త్రవేత్తలతో ముఖాముఖి చర్చలు, ప్రగతిశీల రైతుల అనుభవాలు, విజయగాథలు ఇతర రైతులకు స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. రైతుల ఆదాయం పెరగాలి.. వ్యవసాయం లాభసాటిగా మారాలి.. రైతు కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం కావాలన్నదే ముఖ్యమంత్రి గారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. సాగు ఖర్చులు తగ్గించి, రైతులు పండించిన పంటలకు మంచి ధర, విస్తృత మార్కెట్ అవకాశాలు కల్పించినప్పుడే నిజమైన రైతు అభ్యున్నతి సాధ్యమవుతుందని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా మార్కెట్ డిమాండ్‌ను గుర్తించి పంటల వైవిధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని కోరారు. ఇప్పటికే ప్రభుత్వం వేరుశనగ, పెసళ్లు, పొద్దుతిరుగుడు, మినుములు, శనగ వంటి విత్తనాలను సబ్సిడీపై అందచేస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం ఎల్‌నినో వాతావరణ పరిస్థితులు వ్యవసాయ రంగానికి సవాళ్లు విసురుతున్నాయని, వర్షపాతం, నీటి లభ్యతలో వచ్చే మార్పులను దృష్టిలో పెట్టుకుని రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేయాలని మంత్రి సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవడం, సాగు విధానాల్లో మార్పులు చేసుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని, ఈ విషయంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు పాటించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను

పకడ్బందీగా అమలు చేయాలి



రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

మంచిర్యాల జిల్లా//ప్రజాకలం జిల్లా ప్రతినిధి నవంబర్ 6, 2026:

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత జిల్లా అధికారులతో ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రధానమంత్రి శ్రీ పథకం క్రింద రాష్ట్ర వ్యాప్తంగా 1 వేయి 734 పనులు చేపట్టగా 1 వేయి 175 పనులు పూర్తి కాగా 475 పనులు పురోగతిలో ఉన్నాయని, సమగ్ర శిక్ష పరిధిలో 4 వేల 266 పనులు చేపట్టగా 3 వేల 78 పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను వేగవంతం చేయాలని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో 25 పాఠశాలలకు 2 కోట్ల 49 లక్షల రూపాయల నిధులు విడుదల కాగా, ఇప్పటి వరకు 79.48 లక్షల రూపాయలు ఖర్చు చేసి 32 శాతం నిధుల వినియోగం జరిగిందని తెలిపారు. ప్రధానమంత్రి శ్రీ పథకం క్రింద జిల్లాలో చేపట్టిన 52 పనులలో 29 పూర్తి కాగా, మిగిలిన 23 పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. మిగిలిన నిధులను పూర్తి స్థాయిలో వినియోగించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పాఠశాలలను సందర్శించి త్రాగునీరు, మరుగుదొడ్లు, అదనపు తరగతి గదులు, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లు, గ్రంథాలయాలు తదితర సదుపాయాలను పరిశీలించాలని, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతాలలో త్రాగునీటి కొరత ఏర్పడకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. మిషన్ భగీరథ ద్వారా శుద్ధి చేసిన నీటిని పారదర్శకంగా ఎంపిక చేయాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. దీపావళి పండుగను పురస్కరించుకొని ప్రభుత్వం చేపట్టిన మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమంలో భాగంగా పూర్తి అయిన ఇందిరమ్మ ఇండ్లకు నూతన లోగోతో కూడిన స్టిక్కర్లు అతికించాలని, నూతన ఇందిరమ్మ ఇండ్లలో జరిగే వేడుకలను సోషల్ మీడియా ఖాతాలలో విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం క్రింద అర్హులైన పేదలకు ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని, గుడిసెలలో నివసిస్తున్న నిరుపేదలకు ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. 2వ విడతలో భాగంగా మొత్తం 2 లక్షల ఇళ్ల కేటాయింపు లక్ష్యంలో 43 వేల 730 ఇండ్లకు మంజూరు ఇచ్చిన నేపథ్యంలో మిగిలిన అర్హుల గుర్తింపు, మంజూరు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. 2 పడక గదుల ఇండ్ల పథకం క్రింద పూర్తయిన, పూర్తికి చేరువలో ఉన్న 41 వేల 840 ఇళ్లను ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం లబ్ధిదారులకు కేటాయించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని, సీనరేజ్ ఛార్జీలు వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. 'మన ఇసుక వాహనం' యాప్ వినియోగంపై అవగాహన కల్పించాలని, సిమెంట్ డేటా ఇంటిగ్రేషన్ ద్వారా పరిశీలించడంతో పాటు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా బస్తాను 230 రూపాయలకే అందించే నదుపాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ద్వారా దాదాపు 10 మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. నిర్మాణ సామగ్రి సరఫరాలో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. రాష్ట్రంలో వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ పనులను వేగవంతం చేయాలని, నవంబర్ 4, 2026 నాటికి నివేదిక ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాలలో 441 ప్రాజెక్టులకు సంబంధించి 4.05 లక్షల ఎకరాల సేకరణకు ప్రతిపాదించగా 3 లక్షల 30 వేల ఎకరాలకు అవార్డు జారీ జరిగిందని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, పారిశ్రామిక పార్కులు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, అవార్డుల జారీ, పరిహారం చెల్లింపులు, భూముల స్వాధీనం, భూభారతిలో నమోదు ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పెండింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి, ప్రజలకు సంక్షేమ వథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతుల కల్పన, త్రాగునీటి సరఫరా, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, చేయూత పింఛన్లు, భూ సేకరణ పనులను అధికారుల సమన్వయంతో పకడ్బందీగా చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన కూన గోవర్ధన్



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి నవంబర్ 6(ప్రజా కలం): మెట్‌పల్లి మండలంలోని రైతుల సౌకర్యార్థం నూతన వరి కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. మెట్ల చిట్టాపూర్, ఆత్మకూర్, ఆత్మనగర్, ఏఎస్ఆర్ తండా గ్రామాల్లో మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ ఆయా గ్రామాల సర్పంచులతో కలిసి వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సకాలంలో విక్రయించుకునే అవకాశం కల్పించడంతో పాటు, కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, సర్పంచులు, ఉపసర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

చెకుముకి గోడ పత్రిక ఆవిష్కరణ



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి నవంబర్ 6(ప్రజా కలం): విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, పరిశోధనాత్మక దృక్పథాన్ని పెంపొందించే లక్ష్యంతో మెట్‌పల్లి మండలం మేడిపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో గురువారం చెకుముకి గోడ పత్రికను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో విజ్ఞానంపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు శాస్త్రీయ అంశాలను సులభంగా అర్థం చేసుకునేందుకు చెకుముకి గోడ పత్రిక ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. గోడ పత్రికలోని అంశాలను విద్యార్థులు ఆసక్తిగా చదివి, శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. చెకుముకి గోడ పత్రిక ప్రాముఖ్యత, ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకోవడంతో పాటు ప్రతి అంశాన్ని శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించాలని సూచించారు.కార్యక్రమంలో హెచ్ఎం నాగమణి,ఉపాధ్యాయులు పుప్పాల నాగన్న, భీమన్న, సొప్పరి శ్రీనివాస్,లక్ష్మీబాయితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

రాజారాంపల్లి గ్రామం లో విద్యుత్ షాక్ తో పది నెలల చిన్నారి మృతి

ఎండపల్లి, నవంబర్ 06 : (ప్రజా కలం ప్రతినిధి) మండలంలోని రాజారాంపల్లి గ్రామం లో కరెంట్ షాక్ తో 10 నెలల చిన్నారి మృతి రాజారాంపల్లి



గ్రామానికి చెందిన విభూది తిరుపతి తండ్రి నడిపి పోశెట్టి వయస్సు 28 నంవ త్సరాలు అను అతడు ఆటోలో తిరుగుతూ పాత ఇనుప సామాన్ల కు ఉల్లి గడ్డలు బేరం చేసుకుంటూ జీవిస్తాడు అయితే శుక్రవారం రోజున ఉదయం 3 : 00 గంటలకు తన యొక్క పనుల నిమిత్తం వేయింగ్ మిషన్ చార్జింగ్ పెట్టి ఇంటి ముందు పనులు చేసుకుంటూ ఉండగా అతని చిన్న కూతురైన విభూది అమ్ములు (10 నెలలు) చిన్నారి పాప పాక్కుంటూ అట్టి చార్జింగ్ పెట్టిన వేయింగ్ మిషన్ ను తాకగా ప్రమాదవశాత్తు (కరెంట్) విద్యుత్ షాక్ తగిలి చిన్నారి పాప మరణించినది అని అతను ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెల్గటూర్ పోలీసు వారు కేసు నమోదు చేసి, అట్టి పాప మృతదేహానికి శవపంచనామా నిర్వహించి, పోస్టుమార్టం అనంతరం చిన్నారి పాప మృతదేహాన్ని బంధువులకు అప్ప గించినట్లు వెల్గటూర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ తెలిపారు.

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం



ఎండపల్లి, నవంబర్ 06 : (ప్రజా కలం ప్రతినిధి) మండలంలోని చర్లపల్లి గ్రామం లో శుక్రవారం రోజున మండల వ్యవ సాయ శాఖ ఆధ్వర్యం లో ఖేత్ బచావో అభియాన్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్య క్రమానికి మండల వ్యవ సాయ అధికారి కామల్ల మహేష్, ఏఈఓ సూత్రపు లావణ్య, సర్పంచ్ పడిదం లావణ్య-మొగిలి, గ్రామ పంచాయతీ కార్యదర్శి వి నవీన్ కుమార్, రైతులు హాజరయ్యారు. ఈ సంద ర్భంగా మండల వ్యవ సాయ అధికారి కామాల్ల మహేష్ మాట్లాడుతూ భూసార పరిరక్షణకు సేంద్రియ వ్యవసాయం, మట్టి పరీక్షలు ఎంతో అవసరమని, రసాయనాల వాడకాన్ని తగ్గించాలని ఏవో సూచించారు. అలాగే వరి కొయ్యలు కాల్చడం వల్ల కలిగే అనర్థాల గురించి రైతులకు వివరించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు వాతావరణ మార్పులకు అనుగుణంగా ఆరుతడి పంటలు మరియు పంటల వైవిధ్యీకరణ పాటించాలని మండల వ్యవసాయ అధికారి కామాల్ల మహేష్ కోరారు.

మెట్‌పల్లిలో బంగారు ఆభరణాల చోరీ కేసు ఛేదన

స్నేహితుడి ఇంట్లోనే చోరీ.. - రూ.లక్షల విలువైన బంగారం స్వాధీనం




మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి నవంబర్ 6(ప్రజా కలం): మెట్‌పల్లి పట్టణంలోని రెడ్డి కాలనీలో జరిగిన బంగారు ఆభరణాల చోరీ కేసును పోలీసులు ఛేదించారు. బాధితురాలి కుమారుడి స్నేహితుడే చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు మెట్పల్లి ఎస్సై కిరణ్ కుమార్ వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం... రెడ్డి కాలనీకి చెందిన తలారి లావణ్య ఏ ప్రేమలత తన ఇంటి బీరువాలోని లాకర్‌లో సుమారు 4.5 తులాల బంగారు గొలుసు, 2 తులాల నెక్లెస్, అర తులం బంగారు కమ్మలు, బుట్టలు, అర తులం ఉంగరం, అర తులం మాటీలు ఉంచారని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అక్టోబర్ 14న గుర్తు తెలియని వ్యక్తులు వీటిని చోరీ చేసినట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. దర్యాప్తులో భాగంగా లావణ్య తన కుమారుడు అభినవ్ స్నేహితుడైన చైతన్యనగర్‌కు చెందిన ఇందూరి నవీన్ (26)పై అనుమానం వ్యక్తం చేసింది. దీంతో పోలీసులు నవీన్‌ను నవంబర్ 6న ఉదయం అతని ఇంటి వద్ద అదుపులోకి తీసుకుని విచారించగా, చోరీ చేసినట్లు అంగీకరించినట్లు ఆయన తెలిపారు. నవీన్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడని, తన సంపాదన సరిపోక సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో చోరీకి పాల్పడినట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. తరచూ అభినవ్ ఇంటికి వెళ్లే క్రమంలో లావణ్య బంగారు ఆభరణాలను బీరువాలో ఉంచడం, బీరువాకు తాళం లేకపోవడాన్ని గమనించిన నవీన్ చోరీకి పథకం వేసినట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 3న అభినవ్ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో బీరువాలోని బంగారు ఆభరణాలను తీసుకుని వెళ్లినట్లు నవీన్ విచారణలో వెల్లడించినట్లు వివరించారు. అనంతరం మెట్‌పల్లిలోని మణప్పురం గోల్డ్ లోన్స్‌లో ఒకేసారి బంగారం తాకట్టు పెడితే అనుమానం వస్తుందనే ఉద్దేశంతో మూడు విడతల్లో కొంతకొంతగా బంగారం తాకట్టు పెట్టి డబ్బులు తీసుకున్నట్లు చెప్పారు. ఆ డబ్బులో కొంత అప్పులు తీర్చగా, మిగతా మొత్తాన్ని హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లి ఖర్చు చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైందన్నారు. నిందితుడి నుంచి బంగారం తాకట్టు పెట్టేందుకు ఉపయోగించిన సెల్‌ఫోన్‌తో పాటు మణప్పురం గోల్డ్ లోన్స్‌కు సంబంధించిన రసీదులు, స్టేట్‌మెంట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.అనంతరం నిందితుడిని, స్వాధీనం చేసుకున్న వస్తువులను తదుపరి విచారణ నిమిత్తం మెట్‌పల్లి జేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచినట్లు మెట్‌పల్లి ఎస్సై పి. కిరణ్‌కుమార్ తెలిపారు.

వ్యసనాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దు
మెట్పల్లి ఎస్సై కిరణ్ కుమార్

వ్యసనాలకు అలవాటు పడి, సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో నేరాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని మెట్‌పల్లి ఎస్సై కిరణ్‌కుమార్ సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ కష్టపడి సంపాదించిన డబ్బుతో కుటుంబంతో సంతోషంగా జీవించాలని ఆయన అన్నారు. నేరాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోగుల ప్రాణాలతో చెలగాటమాడితే తాళాలే

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై.పవిత్ర -ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ



పెద్దపల్లి,నవంబర్ 06:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రుల తీరుపై వైద్య ఆరోగ్యశాఖ దృష్టి సారించింది.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై.పవిత్ర,డిప్యూటీ డీఎంహెచ్ఓ అనిల్ కుమార్‌తో కలిసి శుక్రవారం పలు ప్రైవేట్ క్లినిక్‌లు, ఆసుపత్రుల్లో మెరుపు తనిఖీలు చేవట్టారు.అనుమతులు లేకుండా కార్యకలాపాలు సాగించినా,నిబంధనలు ఉల్లంఘించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.ఈ ఆకస్మిక తనిఖీల్లో భాగంగా అధికారులు ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, డాక్టర్లు,సిబ్బంది అర్హత వివరాలు,రోగుల కేస్ షీట్లు,రికార్డుల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు.చికిత్స నాణ్యతతో పాటు ఆసుపత్రుల ఆవరణలో పారిశుద్ధ్యం,బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ పద్ధతులను స్వయంగా సమీక్షించారు.ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ వై.పవిత్ర మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రులు కేవలం లాభాపేక్షతో కాకుండా ప్రభుత్వ చట్టాలు,నిబంధనలకు కట్టుబడి పనిచేయాలని స్పష్టం చేశారు.సరైన అనుమతులు లేని దవాఖానాలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లా ప్రజలకు నాణ్యమైన,సురక్షితమైన వైద్య సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమని,జిల్లావ్యాప్తంగా ప్రైవేట్ ఆసుపత్రులపై ఈ ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆమె స్పష్టం చేశారు.

ఆపరేషన్ కోసం రూ.2.50 లక్షల ఎల్ఓసీ అందజేత



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి నవంబర్ 6 (ప్రజా కలం)

మండలంలోని మెట్ల చిట్టాపూర్ గ్రామానికి చెందిన కోణం గంగుకు నిమ్స్‌లో ఆపరేషన్ కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.2.50 లక్షల ఎల్ఓసీని టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావు గురువారం బాధిత కుటుంబానికి అందజేశారు. గంగు చికిత్సకు ఆర్థిక సాయం అందించాలని సుజిత్‌రావును కోరగా, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.2.50 లక్షల ఎల్ఓసీ మంజూరైనట్లు తెలిపారు. ఈ మేరకు మెట్‌పల్లిలోని సుజిత్‌రావు నివాసంలో బాధిత కుటుంబానికి ఎల్ఓసీ చెక్కును అందజేశారు. ఆపద సమయంలో ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచిన మంత్రి శ్రీధర్‌బాబు, టీపీసీసీ డెలిగేట్ సుజిత్‌రావుకు కోణం గంగు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, టీపీసీసీ ఫిషర్మన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ,మొగిలిపేట మాజీ వీఓసీ చైర్మన్ మహబూబ్ ఖాన్, దాసరి మోహన్, మొగిలి రాజేందర్, బస ఉపేంద్ర, రంజిత్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు

మెట్‌పల్లి 3వ వార్డులో మిషన్ భగీరథ, బోర్ పైప్‌లైన్లకు మరమ్మతులు
పనులను స్వయంగా పర్యవేక్షించిన కౌన్సిలర్ బత్తుల నరేశ్



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి నవంబర్ 06 (ప్రజాకలం): – రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో 3వ వార్డులో ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు కౌన్సిలర్ బత్తుల నరేశ్ తెలిపారు. శుక్రవారం వార్డు పరిధిలోని బీసీ హాస్టల్ వద్ద ఉన్న బోర్ పైప్‌లైన్‌తో పాటు పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న మిషన్ భగీరథ పైప్‌లైన్లకు మరమ్మతులు చేపట్టారు. నీటి లీకేజీలను అరికట్టి వృథాను నివారించడంతో పాటు వార్డులోని ప్రజలకు తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. మరమ్మతు పనులను కౌన్సిలర్ బత్తుల నరేశ్ స్వయంగా దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే వేసవిలో వార్డులో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనులు చేపడుతున్నామని తెలిపారు. నీటి సరఫరాకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే ప్రజలు తన దృష్టికి తీసుకురావాలని, అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.


ప్రజా కలం
శనివారం, నవంబర్ 7, 2026

ఐడీబీఐ వాటాలపై అనుమానాలు

బిజెపి ప్రభుత్వం మరో ప్రభుత్వ రంగ సంస్థను ప్రైవేటుకు అప్పగించేందుకు రంగం సిద్ధం చేసింది. 1964లో పారిశ్రామిక అభివృద్ధి రుణాల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పరచిన ప్రభుత్వ రంగ బ్యాంకు ఐడిబిఐ ని కెనడాకు చెందిన ఫెయిర్ ఫ్యాక్స్ హోల్డింగ్స్‌కి కేంద్రం అప్పగిస్తోంది. అక్టోబర్ 14న కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ దీనికి ఆమోద ముద్రవేసింది. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా ఈ బ్యాంకుపై అధికారం చేతులు మారిపోతుంది. బ్యాంకుల విస్తరణ కారణంగా ఐడిబిఐ 2015లో పబ్లిక్ సెక్టర్ బ్యాంకుగా మారిపోయింది. ప్రస్తుతం అది మిగతా వాణిజ్య బ్యాంకుల మాదిరిగానే శాఖల ఏర్పాటుతోపాటు సేవలు అందిస్తోంది. దేశవ్యాప్తంగా ఉన్న 2100 శాఖలు ఉన్న ఈ బ్యాంకులో 20వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. 2015-16 లో ఈ బ్యాంకును మూల ధన కొరత, నిరర్థక ఆస్తుల పెరుగుదల లాంటి చిక్కులను ఎదుర్కొని రూ. 3వేల కోట్ల నష్టాలను మూట కట్టుకుంది. ఈ విపత్తు నుండి బ్యాంకును బయటపడేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసినీ వాడుకుంది. రూ. 22వేల కోట్లు వెచ్చించి ఎల్ఐసి ఈ బ్యాంకులో సుమారు సగం వాటాను సొంతం చేసుకుంది. అలా బలపడిన ఐడిబిఐ ఇప్పటికీ లాభాల బాటలోనే నడుస్తోంది. ఆనాటి వాటా అమ్మకంవల్ల ఈ బ్యాంకుపై హక్కులు 45.48% కేంద్ర ప్రభుత్వానికి, 49.24% ఎల్ఐసికి చెందుతాయి. ఇందులోంచి ఇప్పుడు కేంద్రం 30.48%, ఎల్ఐసి 30.24% వాటాను ఫెయిర్ ఫ్యాక్స్ హోల్డింగ్‌కి అమ్మేస్తున్నాయి. వాటి మొత్తం విలువ రూ. 53 వేల కోట్లు. జులైలో జరిగిన వేలం పాటలో ఆ ఒక్క సంస్థే పాల్గొనడంతో ఈ ఒప్పందం కుదిరింది. ఇందువల్ల రూ. 81 ఉన్న బ్యాంకు షేర్ విలువను రూ. 76కు తగ్గించవలసి వచ్చింది. ఎల్ఐసికి మిగలబోయే 19% వాటాను కూడా త్వరలోనే బహిరంగ మార్కెట్ ద్వారా అమ్మేసేందుకు ప్రభుత్వం పావులు కదుపుతోంది. ఐడిబిఐలో ఈ వాటాను కొనుగోలు చేసి బ్యాంకుపై పెత్తనం పొందుతున్న ఫెయిర్ ఫ్యాక్స్ హోల్డింగ్ సంస్థ యజమాని వివియన్ ప్రేమ్ వత్స. అతను ప్రవాస భారతీయుడు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, ఐఐటి మద్రాస్‌లో చదివాడు. కెనడా వెళ్లి ఒక దివాళా తీసిన బీమా కంపెనీని కొని ఫెయిర్ ఫ్యాక్స్ హోల్డింగ్‌గా పేరు మార్చి లాభాలు గడిస్తూ ప్రముఖ వ్యాపారవేత్తగా ఎదిగారు. తన వ్యాపార విస్తరణలో భాగంగా ఇప్పుడు ఐడిబిఐని కొనుగోలు చేస్తున్నారు. బలమైన పునాదులున్నప్పటికీ సంక్షోభంలో ఉన్న కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడమే ప్రేమ్ వత్సా విజయానికి ప్రధాన సూత్రం.అలాంటి కంపెనీలను గుర్తించడంలో ఆయనకు అసాధారణమైన సామర్థ్యం ఉంది. అంతేకాదు, వాటిలో దీర్ఘకాలం పెట్టుబడులను కొనసాగించే సహనం కూడా ఉంది.కాలగమనాన్ని అంచనా వేయడంలోనూ వత్సా దిట్ట. సంక్షోభం రాబోతోందన్న సంకేతాలను ముందుగానే పసిగట్టగలరు.ఈ సామర్థ్యంతోనే 1987లో అంతర్జాతీయ స్టాక్ మార్కెట్ల పతనాన్ని, బ్లాక్ మండేగా ప్రసిద్ధి చెందిన పరిణామాన్ని, 1990లో జపాన్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలడాన్ని, 2008లో సబ్‌ప్రైమ్ సంక్షోభంగా పిలిచే అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభాన్ని ఆయన ముందుగానే గుర్తించారు.ఆ సమయంలో అమెరికా ఆర్థిక మందగమనాన్ని అవకాశంగా మలుచుకున్న ప్రేమ్ వత్సా, భవిష్యత్తులో మంచి పనితీరు కనబరిచే అవకాశమున్న కంపెనీల షేర్లను అతి తక్కువ ధరలకు కొనుగోలు చేశారు.అయితే, ఫెయిర్‌ఫాక్స్ కూడా ఎదురుదెబ్బలు చవిచూసింది. హార్వీ, ఇర్మా, మారియా తుపానులతో పాటు కాలిఫోర్నియాలో చెలరేగిన కార్చిచ్చుల వల్ల సంస్థకు గణనీయమైన నష్టాలు వచ్చాయి.కోవిడ్-19 మహమ్మారి కూడా సంస్థకు పెద్ద సవాలుగా మారింది. ఆ సమయంలో దాని బీమా వ్యాపారం భారీ నష్టాలను చవిచూసింది.అయితే, ప్రేమ్ వత్సా సామర్థ్యం ఫెయిర్‌ఫాక్స్‌ను మళ్లీ పుంజుకునేలా చేసింది.2022 అక్టోబర్‌తో పోలిస్తే 2025లో ఫెయిర్‌ఫాక్స్ విలువ నాలుగు రెట్లు పెరిగింది.ఫెయిర్‌ఫాక్స్ వ్యాపార వ్యూహం విజయవంతమైంది.బీమా క్లెయిమ్‌లు చెల్లించాల్సిన సమయం రాకముందే భారీ మొత్తంలో ప్రీమియంలను వసూలు చేసి, బలమైన పునాదులున్నప్పటికీ తక్కువ ధరకు లభించే షేర్లలో పెట్టుబడులు పెట్టడం ద్వారా సంస్థ విజయాన్ని సాధించింది.వ్యాపార, పారిశ్రామిక రంగాలకు చేసిన అసాధారణ సేవలకు గుర్తింపుగా ప్రేమ్ వత్సాకు పద్మశ్రీ పురస్కారం లభించింది.ఇప్పటికే ఆయన 2016 లో రూ. 1180 కోట్లతో కేరళంలోని సిఎస్‌బి బ్యాంకులో 51% వాటా సొంతం చేసుకున్నారు. 2020 లో భారత కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించడం విశేషం. రిజర్వ్ బ్యాంక్ నిబంధనల ప్రకారం ఒక విదేశీయుడు దేశంలోని రెండు బ్యాంకులను హస్తగతం చేసుకోరాదు. ఈ లెక్కన ఫెయిర్ ఫ్యాక్స్ సంస్థ ఒక బ్యాంకు నుంచి వైదొలగాలి లేదా రెండు బ్యాంకులను కలిపేసి ఒక్క బ్యాంకుగా మార్చాలి. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకుల వాటాలను బహిరంగంగా అమ్మేస్తూ, వాటిలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని పెంచుతూ దేశ బ్యాంకింగ్ రంగాన్ని బలహీనపరుస్తోంది. బ్యాంకులను జాతీయం చేసిన లక్ష్యాలకు అవి దూరమవుతున్నాయి. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ బ్యాంకు ఉద్యోగులు సమ్మెలు, ఆందోళనలు చేపట్టినా వాటి ప్రభావం ప్రభుత్వ చర్యలపై పెద్దగా ఉండడం లేదు. ఐడిబిఐని బాహాటంగా అమ్మేయడమే దీనికి తార్కాణం. దేశంలోని రెండు బ్యాంకులను ఒకే విదేశీ సంస్థ కొనుగోలు చేయడం వల్ల ఆ రెండు బ్యాంకుల ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. ఒక బ్యాంకులోంచి వాటా వెనక్కి తీసుకొనే బదులు రెండింటిని కలిపి వేయడానికే యాజమాన్యం మొగ్గు చూపుతుంది. ప్రైవేటు చేతుల్లోకి వెళ్లి తమ అస్తిత్వాన్ని కోల్పోవడానికి ఐడిబిఐ ఉద్యోగులు సిద్ధంగా లేరు. ఇప్పటికే ఫెయిర్ ఫాక్స్ సొంతమైన సిఎస్‌బి ప్రైవేటు బ్యాంకు, ఐడిబిఐ ప్రభుత్వ రంగ బ్యాంకు. ప్రభుత్వ రంగ సంస్థ ప్రైవేటు చేతుల్లోని వెళితే దాని ప్రభావం ఉద్యోగుల పని భారం, వేతనాలపై అధికంగా పడుతుంది. ఇక నుంచి ఐడిబిఐ ఉద్యోగుల వేతన సవరణ మిగతా జాతీయ బ్యాంకుల ఉద్యోగుల మాదిరిగా ఉండదు. జరగబోయే ఉద్యోగ నియామకాల్లో, ప్రమోషన్లలో రాజ్యాంగబద్ధ రిజర్వేషన్లు ఉండవు. ఉద్యోగ భద్రత విషయంలో ఐడిబిఐ సిబ్బంది ఎంతో ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ వారు ఇప్పటికే ఉద్యమం బాటపట్టారు. ఈ నెల 2, 3 తేదీల్లో బ్యాంకులు మూసేసి సమ్మెలో పాల్గొన్నారు. దీపావళి తర్వాత పూర్తి స్థాయి కార్యాచరణ ఉంటుందని వారి నేతలు అంటున్నారు. ప్రభుత్వం తగిన హామీలు ఇవ్వకుంటే తమ ప్రతిఘటనను తీవ్రతరం చేస్తామని, దేశంలోని అన్ని బ్యాంకు ఉద్యోగ సంఘాలను సంప్రదించి, వారి ఐక్యతతో దేశవ్యాప్త నిరసనలు చేపడతామని అంటున్నారు. సాంకేతికత పైచేయి వల్ల ఉద్యోగ శక్తి బలహీనపడి ప్రభుత్వాలకు ఎదురు లేకుండాపోయింది. బ్యాంకుల కంప్యూటరీకరణ ఉద్యోగుల ప్రమేయాన్ని తగ్గించింది. ఏ ప్రభుత్వ రంగ సంస్థనైనా కేంద్రంలో ఉన్న బిజెపి కూటమి తన ఇష్టారాజ్యంగా అంగట్లో పెడుతోంది.

కార్మిక ఉద్యమానికి ఎండి మౌలానా మృతి తీరని లోటు

- బీడీ కార్మికుల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన నాయకుడు - సీపీఐ జాతీయ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి ఘన నివాళి





మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి నవంబర్ 6 (ప్రజా కలం) బీడీ కార్మికుల హక్కుల సాధన కోసం జీవితాంతం అంకితభావంతో పోరాడిన సీపీఐ సీనియర్ నాయకుడు, తెలంగాణ బీడీ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు మహమ్మద్ మౌలానా మృతి కమ్యూనిస్టు పార్టీకి, కార్మిక ఉద్యమానికి తీరని లోటని సీపీఐ జాతీయ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి అన్నారు. నవంబర్ 6న అనారోగ్యంతో ఎండి మౌలానా తుదిశ్వాస విడవడం పట్ల ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ ప్రగాఢ సంతాపం తెలిపారు.బీడీ కార్మికుల హక్కులు, సంక్షేమం, జీవనోపాధి భద్రత కోసం ఎండి మౌలానా చేసిన పోరాటాలు చిరస్మరణీయమని చాడ వెంకట్ రెడ్డి కొనియాడారు. కార్మికులకు న్యాయమైన వేతనాలు, జీవనభృతి, పీఎఫ్ సౌకర్యం, పెన్షన్ పెంపు వంటి సమస్యల పరిష్కారం కోసం గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు, అవసరమైన సందర్భాల్లో ఢిల్లీ వరకు వెళ్లి అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించారని గుర్తుచేశారు.ముఖ్యంగా బీడీ కార్మికులు, కమిషన్ ఏజెంట్లకు జీవనభృతి అమలు చేయాలనే డిమాండ్‌పై ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తీసుకొచ్చి, పోరాటాల ఫలితంగా కార్మికులకు జీవనభృతి అందేలా కృషి చేశారని పేర్కొన్నారు. కార్మిక సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి బీడీ కార్మిక సంఘం చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని తెలిపారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ అభివృద్ధికి కౌన్సిల్ సభ్యుడిగా, బీడీ కార్మిక సంఘం అధ్యక్షుడిగా మౌలానా విశేష సేవలందించారని అన్నారు. 2000 సంవత్సరంలో మున్సిపల్ కౌన్సిలర్‌గా ఎన్నికై తన వార్డు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని గుర్తుచేశారు.తెలంగాణ రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్, ఆల్ ఇండియా బీడీ ఫెడరేషన్‌తో పాటు ఏఐటీయూసీ నిర్మాణ బలోపేతంలోనూ మౌలానా కీలక పాత్ర పోషించారని తెలిపారు. గతంలో కార్మిక ఉద్యమానికి విశేష సేవలందించిన ప్రభాకర్, కడకుంట్ల గంగారం, మహబూబ్ అలీ, సామల మల్లేశం వంటి నాయకుల అనంతరం బీడీ కార్మిక సంఘాన్ని బలోపేతం చేయడంలో తనవంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించారని అన్నారు. వ్యక్తిగత జీవితంలోనూ ఎన్నో విషాదాలను ఎదుర్కొన్నప్పటికీ, గత ఏడాది భార్య అమీనా మరణించినా, కొంతకాలంగా అనారోగ్యంతోబాధపడుతున్నప్పటికి కార్మికుల సమస్యలపై నిరంతరం స్పందిస్తూ ఉద్యమాల్లో పాల్గొనడం ఆయన నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.

వదవులు, వ్యక్తిగత ప్రయోజనాల కంటే కార్మికుల సంక్షేమానికే ప్రాధాన్యతనిచ్చిన మౌలానా సేవలు పార్టీకి, కార్మిక సంఘాలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని చాడ వెంకట్ రెడ్డి అన్నారు.

ఆయన మరణం కార్మిక ఉద్యమానికి తీరని లోటని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ మౌలానాకు ఘన నివాళులర్పించారు.అనంతరం నాయకులు కామ్రేడ్ మహమ్మద్ మౌలానా పార్థివ దేహానికి పూలమాలలు వేసి, జోహార్లు అర్పించారు.

ఈ సంతాప సభలో సీపీఐ జగిత్యాల జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య,ఏఐటీయూసీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఏశమేని గణేశ్, రాజన్న సిరిసిల్ల జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కడారి రాములు, బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు, జిల్లా అధ్యక్షురాలు కొక్కుల శాంత, ఎండీ ముక్రం, ఇరుగురాల భూమేశ్వర్, ఎన్నం రాధా, ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు మునుగురి హనుమంతు, ఎద్దండి భూమన్న, మహమ్మద్ ఉస్మాన్, రామిల్ల రాంబాబు, అందె వంశీకృష్ణ, గాదె దేవదాస్, అశోక్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు చింత భూమేశ్వర్, వెన్న మహేశ్, వెన్న సురేశ్, కిరణ్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

రెండు రైస్ షాపులపై కేసులు

బియ్యం దుకాణాలు, రైస్‌మిల్లుల్లో పౌరసరఫరాల శాఖ ఆకస్మిక తనిఖీలు



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి నవంబర్ 6(ప్రజా కలం) బియ్యం మార్కెట్‌లో కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడాన్ని అరికట్టేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. శుక్రవారం కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల పరిధిలోని రెండు హోల్‌సేల్ దుకాణాలు, ఆరు రిటైల్ దుకాణాలు, ఒక రైస్‌మిల్లులో జిల్లా పౌరసరఫరాల అధికారి, తూనికలు-కొలతల అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో బియ్యం బస్తాలపై ఉన్న అసలు ధరల లేబుళ్లను మార్చి అధిక ధరలకు విక్రయిస్తున్న రెండు వ్యాపార సంస్థలను అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంపై తూనికలు-కొలతల అధికారులు కేసులు నమోదు చేశారు. డిప్యూటీ తహశీల్దార్లు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, రెవెన్యూ సిబ్బంది దుకాణాలు, గోదాముల్లోని బియ్యం నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించి లెక్కించారు. ధరల పట్టికలు, తూకాలు, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు.నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ప్రతి దుకాణం, రైస్‌మిల్లు ఎదుట రోజువారీ నిల్వ వివరాలు, ప్రభుత్వం నిర్ణయించిన విక్రయ ధరలను వినియోగదారులకు స్పష్టంగా కనిపించేలా బోర్డుపై ప్రదర్శించాలని సూచించారు. ట్రేడ్ లైసెన్స్, జీఎస్టీ, ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్‌లను తనిఖీ అధికారులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రోజువారీ కొనుగోళ్లు, అమ్మకాల వివరాలను స్టాక్ రిజిస్టర్లలో నమోదు చేయాలని స్పష్టం చేశారు. 26 కిలోల బస్తా పేరుతో 24 లేదా 25 కిలోల బియ్యం విక్రయిస్తే మోసపూరిత కొలతల చట్టం కింద కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు. అక్రమ నిల్వలు, ధరల ట్యాంపరింగ్, తూకాల్లో తేడాలు, రికార్డుల నిర్వహణలో లోపాలు గుర్తించిన పక్షంలో నిత్యావసర సరుకుల చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా బియ్యం దుకాణాలు, గోదాములు, రైస్‌మిల్లులపై తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పౌరసరఫరాల శాఖ అధికారులు వెల్లడించారు.

ట్రాన్స్‌జెండర్ల హక్కులకు పూర్తి భరోసా

- సమాజంలో ట్రాన్స్‌జెండర్లు ఆత్మగౌరవంతో జీవించండి

- పెద్దపల్లి మహిళా పోలీస్ స్టేషన్ సీఐ రమేష్ బాబు



పెద్దపల్లి,నవంబర్ 06:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) ట్రాన్స్‌జెండర్ల ప్రాథమిక హక్కుల పరిరక్షణతో పాటు వారి భద్రతకు పోలీస్ శాఖ అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని పెద్దపల్లి మహిళా పోలీస్ స్టేషన్ సీఐ రమేష్ బాబు స్పష్టం చేశారు.రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక మహిళా పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్ మహిళలకు ప్రత్యేక రక్షణ విభాగంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రమేష్ బాబు మాట్లాడుతూ సమాజంలో ట్రాన్స్‌జెండర్లు, విభిన్న వర్గాల ప్రజలు ఆత్మగౌరవంతో జీవించే వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ పోలీస్ శాఖ ప్రత్యేకంగా ట్రాన్స్‌జెండర్ ప్రొటెక్షన్ సెల్ ను ఏర్పాటు చేసిందని తెలిపారు.రాష్ట్ర మహిళా భద్రతా విభాగం పర్యవేక్షణలో పనిచేసే ఈ విభాగం ద్వారా వారిపై జరిగే దాడులు,వివక్ష,మానసిక వేధింపులను అరికట్టేందుకు తక్షణ సహాయం అందిస్తున్నామని వివరించారు.ఎవరైనా వేధింపులకు గురైతే నిర్భయంగా పోలీసులను సంప్రదించి చట్టపరమైన రక్షణ పొందవచ్చని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో షీ టీమ్స్ ఇన్‌చార్జి ఎస్ఐ లావణ్య, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ రవళి,షీ టీమ్ సిబ్బందితో పాటు భరోసా కేంద్ర కోఆర్డినేటర్ ఆశ్రిత, సహాయక సిబ్బంది మరియు ట్రాన్స్‌జెండర్ మహిళలు పాల్గొన్నారు.

యువజన పార్లమెంట్‌లో మెరిసిన గాయత్రి విద్యార్థిని

రాష్ట్ర స్థాయిలో 3వ స్థానం - విద్యార్థినిని సత్కరించిన గాయత్రి యాజమాన్యం



పెద్దపల్లి,నవంబర్ 06(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

గోదావరిఖనిలోని యూనివర్సిటీ పీజీ కళాశాల వేదికగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి వికసిత్ భారత్ యువజన పార్లమెంట్ పోటీల్లో పెద్దపల్లికి చెందిన గాయత్రి డిగ్రీ,పీజీ కళాశాల విద్యార్థిని పి. హరిప్రియ విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో తృతీయ బహుమతి కైవసం చేసుకుంది.ప్రస్తుత దేశ రాజకీయ, పరిపాలనా రంగాల్లో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న ఒకే దేశం – ఒకే ఎన్నికలు అనే అంశంపై ఈ పార్లమెంట్ చర్చాగోష్టి జరిగింది.ఈ కార్యక్రమంలో గాయత్రి కళాశాలకు చెందిన పది మంది విద్యార్థులు భాగస్వామ్యమై,జమిలి ఎన్నికల సాధ్యాసాధ్యాలు,దేశ ఆర్థిక వ్యవస్థపై వాటి ప్రభావం,ఎదురయ్యే రాజ్యాంగపరమైన సవాళ్లపై తమ గళాన్ని బలంగా వినిపించారు.వీరిలో హరిప్రియ వ్యక్తం చేసిన విశ్లేషణాత్మక భావాలు, వాక్చాతుర్యం న్యాయనిర్ణేతలను ఆకట్టుకుని రాష్ట్ర స్థాయిలో మూడో స్థానాన్ని తెచ్చిపెట్టాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో విజేత హరిప్రియను కళాశాల అధినేత అల్లెంకి శ్రీనివాస్ శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత కేవలం పుస్తక పరిజ్ఞానానికే పరిమితం కాకుండా,దేశ విధాన నిర్ణయాలు, ప్రజాస్వామ్య ప్రక్రియలపై లోతైన అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర స్థాయిలో కళాశాల పేరును నిలబెట్టిన హరిప్రియతో పాటు, పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న మిగతా తొమ్మిది మంది విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్,అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించారు.

ఎస్సీ హాస్టల్ తనిఖీ చేసిన ఎంపీడీవో గణేష్



ఇబ్రహీంపట్నం నవంబర్ 6 (ప్రజా కలం ప్రతినిధి) జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని లోని గల ఎస్సీ హాస్టల్ నీ ఎంపీడీఓ సిహెచ్ గణేష్ పరిశీలించారు. పిల్లలకు బ్రేక్ ఫాస్ట్ భోజనము మెనూ లను పరిశీలించారు. పరిసరాలు క్లీన్ గా ఉన్నాయా లేదాఅని పరిశీలించి,సరకుల ఎక్స్ ప్రైడేట్ లను పరిశీలించారు,స్టాక్ రిజిస్టర్ హాస్టల్ రికార్డులను పరిశీలించారు, పరిశుభ్రత పాటించాలి ఎల్నినో ప్రభావం ఉన్నందున నీరు, కరెంట్ ఆదా చేయాలనీ సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పుల్ల రామకృష్ణ , హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

33 కెవి గుల్లకోట ఫీడర్లు మరమ్మతుల దృశ్య విద్యుత్ కు అంతరాయం

- రైతులకు విజ్ఞప్తి విద్యుత్ శాఖ ఏఈ బండి సమ్మయ్య



ఎండపల్లి, నవంబర్ 06 : (ప్రజా కలం ప్రతినిధి) మండలంలోని గుల్లకోట గ్రామం లో శనివారం రోజున విద్యుత్ 33 కెవి గుల్లకోట ఫీడర్లు మర మ్మతుల దృశ్య విద్యుత్ సరఫరా నిలిపివేయ బడును కావున విద్యుత్ వినియోగదారులు, రైతులు సహక రించవలసిం దిగా విద్యుత్ శాఖ తరపున కోరనైనది. విద్యుత్ సరఫరా కు అంతరాయం కలిగే గ్రామాలు ఉ దయం 08:00 నుండి 12:00 గంటల వరకు గుల్లకోట వ్యవసాయ ఫీడర్, గుల్లకోట ఎక్స్ ప్రెస్ ఫీడర్, చర్లపల్లి ఫీడర్, కొండాపూర్ ఫీడర్, ఆత్మకూర్ ఫీడర్ల కు విద్యుత్ కు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ రాజారాంపల్లి సెక్షన్ ఏఈ బండి సమ్మయ్య తెలిపారు.

పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



గొల్లపల్లి నవంబర్ 06 ప్రజా కలం ప్రతినిధి

గొల్లపల్లి మండలంలోని చందోలి గ్రామానికి చెందిన పిట్టల రమేష్,రాఘవపట్నం గ్రామానికి చెందిన ఆడేపు మధు లు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.పిట్టల రమేష్ చేస్తున్న చిరు ఉద్యోగాన్ని కారుణ్య నియామకల్లో తన భార్యకు పీఏసీఎస్ లో తీర్మానం చేసి ఉద్యోగ అవకాశాన్ని కల్పించి భరోసా ఇచ్చారు.అనంతరం వివిధ అనారోగ్య కారణాలతో చికిత్స పొందిన గంగాదేవి పల్లి గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ నాయకులు కొలకాని రాజన్న, వెంగలపూర్ గ్రామానికి చెందిన ఇనుగంటి తిరుపతి సోదరుడి కుమారుడు హన్షిత్, ఇస్రాజ్ పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కందుకూరి చిరంజీవి కూతురు,మాజీ సర్పంచ్ భార్గవి లు అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వారిని మాజీ మంత్రి ఈశ్వర్ పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితితులను అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.అన్ని విధాలుగా అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.మాజీ మంత్రి వెంట గోస్కుల జలంధర్, గందే మాధవరావు,సర్పంచ్,శ్రీనివాస్,మాజీ సర్పంచ్ లు బలభక్తుల కిషన్,జగన్, కాంపెల్లి హన్మండ్లు,ఆవుల సత్యం,పుట్టపాక సత్యం,బుర్ర తిరుపతి,అలిశెట్టి రవీందర్,పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం ప్రధాన కార్యదర్శిగా పతికె రాజేందర్

మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం



నిర్మల్ నవంబర్ 06 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) ఇటీవల గజ్వేల్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర రేషన్ షాప్ డీలర్ల అసోసియేషన్ ఎన్నికల్లో నిర్మల్ పట్టణానికి చెందిన పతికె రాజేందర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా శుక్రవారం బెస్తవార్‌పేట్ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ.. బీసీ సామాజిక వర్గానికి చెందిన పతికె రాజేందర్ గతంలో సంఘం అధ్యక్షుడిగా పనిచేస్తూ అభివృద్ధికి విశేష కృషి చేశారని తెలిపారు. వివిధ ధార్మిక సంస్థల్లోనూ సేవలందిస్తూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండటం అభినందనీయమన్నారు. ఆయన సేవలు, కృషికి గుర్తింపుగా రాష్ట్రస్థాయి కీలక పదవి లభించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు తోట రమేష్, ప్రధాన కార్యదర్శి గుమ్ముల అశోక్, కోశాధికారి తోట రవి, కార్యదర్శి తోట రమేష్, బోడ శ్రీనివాస్, జెట్టి నరేందర్, పెంట రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి : జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి నవంబర్ 06: జిల్లా కేంద్రంలో బండమీదిపల్లిలోని రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) ట్రిపుల్ ఐటీ కళాశాలను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినీ, విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారి విద్యాభ్యాసం, బోధన ప్రమాణాలు, హాస్టల్ వసతి సౌకర్యాలు, ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాశాలలోని తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. కెమిస్ట్రీ, ఫిజిక్స్ సబ్జెక్టులకు సంబంధించి పలు ప్రశ్నలు వేయగా విద్యార్థులు సమాధానాలు ఇచ్చారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు, విషయ పరిజ్ఞానాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, విద్యార్థులు సాంకేతిక రంగంలో వేగంగా వస్తున్న నూతన మార్పులను అందిపుచ్చుకొని ఆధునిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకొని క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, సామాజిక మాధ్యమాల వినియోగాన్ని పరిమితం చేసుకొని విలువైన సమయాన్ని విద్యాభ్యాసం, నైపుణ్యాభివృద్ధికి కేటాయించాలని హితవు పలికారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు కళాశాలకు సొంత భవనం లేక అద్దె భవనంలో తరగతులు నిర్వహిస్తున్నామని కలెక్టర్‌కు వివరించారు. కళాశాలకు శాశ్వత భవనం నిర్మించి, వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. శ్రవణ్ కుమార్, అధ్యాపకులు డాక్టర్ ఎం.డి. షకీల్, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ స్వాతి, ఏవో అర్జున్ కుమార్, ఎస్‌డబ్ల్యూఓ రాముడు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబుపై అనుచిత వ్యాఖ్యలు సహించం

చిన్నతూండ్ల సర్పంచ్ గడ్డం క్రాంతి...

ఎంపీ వంశీకృష్ణ లేఖను ఖండిస్తూ ఆగ్రహం.. అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తామని వెల్లడి...



మల్హార్ నవంబర్ 06 ప్రజాకలం ప్రతినిధి... గణపతి సచ్చిదానంద స్వామీజీ మంథని పర్యటన, ఆధ్యాత్మిక కార్యక్రమంపై ఎంపీ గడ్డం వంశీకృష్ణ రాసిన లేఖను చిన్నతూండ్ల సర్పంచ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం క్రాంతి ఖండించారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలను రాజకీయాలతో ముడిపెట్టడం సరికాదన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కాంగ్రెస్ పార్టీ కోసం ఎంతో కష్టపడ్డారని, ఆయనపై విమర్శలు చేయడం తగదన్నారు. మంథని పర్యటనల్లో స్థానిక కాంగ్రెస్ నాయకులను కలుపుకొని వెళ్లాలని ఎంపీకి సూచించారు. ఎంపీ వ్యవహారశైలిపై పార్టీ అధిష్ఠానానికి ఆధారాలతో ఫిర్యాదు చేస్తామని, మంత్రి శ్రీధర్‌బాబుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ సర్పంచులు బండి స్వామి, మేకల రాజయ్య, బొమ్మ రజిత, రమేష్ రెడ్డి, జ్యోత్స్న, సరీన్ రావు, అబ్బినేని లింగస్వామి, చంద్రగిరి సంపత్, యూత్ నాయకులు రాహుల్, దుద్దిళ్ల సత్యం, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తల్లాడలో ద్విచక్ర వాహనం మాయం

తల్లాడ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు



తల్లాడ నవంబర్ 6 ప్రజా కలం న్యూస్ తల్లాడ పట్టణంలోని మసీదు వెనక బజారులో తన పల్సర్ బైక్ చోరీకి గురైందని విద్యుత్ శాఖ ఇంజనీరు సతీష్ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తన ఇంటి ముందు ఉన్న బైకును గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని పేర్కొన్నారు. టీఎస్ 28జి 5181 నెంబర్ గల పల్సర్ బైక్ చోరీకి గురైందని తెలిపారు. ఎవరికైనా కనిపిస్తే తమకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల్లోనూ అద్భుతమైన ప్రతిభ దాగిఉంది

సరైన ప్రోత్సాహం, నాణ్యమైన శిక్షణ అందిస్తే ప్రభుత్వ విద్యాసంస్థలలో చదివే విద్యార్థులు కూడా అద్భుత ఫలితాలు సాధిస్తారు

పయనీర్ ప్రత్యేక శిక్షణ ద్వారా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘన సన్మానం

విద్యార్థుల భవిష్యత్తుకు మహబూబ్‌నగర్ ఫస్ట్ ద్వారా బాటలు వేస్తున్నాం: ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి నవంబర్ 06:

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ ఉందని, వారికి సరైన ప్రోత్సాహం, నాణ్యమైన శిక్షణ అందిస్తే ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల విద్యార్థులకు దీటుగా అద్భుతమైన ఫలితాలు సాధిస్తారని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిలి అన్నారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో గత మూడేళ్లుగా నిర్వహిస్తున్న పయనీర్ కార్యక్రమం ద్వారా ప్రతి యేడాది వంద మంది విద్యార్థులు ఉన్నత ర్యాంకులు సాధించి, వైద్య, ఇంజినీరింగ్‌తో పాటు పలు ప్రొఫెషనల్ కోర్సుల్లో ఉచితంగా ప్రవేశాలు పొందడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పయనీర్ కార్యక్రమం ద్వారా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సన్మానం, సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన శిక్షణ అందించాలనే లక్ష్యంతో మహబూబ్‌నగర్ ఫస్ట్ కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. గత మూడేళ్లుగా ప్రతి సంవత్సరం వంద మందికి పైగా విద్యార్థులు వివిధ కోర్సుల్లో ప్రవేశాలు పొందే స్థాయికి చేరుకోవడం పయనీర్ కార్యక్రమం విజయానికి నిదర్శనమన్నారు. విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించేందుకు ముందుకొచ్చిన వాగ్దేవి, ప్రతిభ, ఋషి జూనియర్ కళాశాలల యాజమాన్యాలకు, ప్రిన్సిపాళ్లకు, అధ్యాపకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమ కళాశాలల అధ్యాపకులను కేటాయించి, నెలల తరబడి ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ అందించడం అభినందనీయమన్నారు. ఈ సహకారం వల్లే విద్యార్థులకు మెరుగైన శిక్షణ అందించగలిగామని పేర్కొన్నారు. విద్యార్థులు కూడా అనేక ఇబ్బందులను అధిగమిస్తూ కష్టపడి చదివారని, కళాశాల సమయం ముగిసిన తర్వాత కూడా అదనంగా రెండు గంటల పాటు శిక్షణ పొందారని గుర్తుచేశారు. వారి కృషి, అధ్యాపకుల అంకితభావం, తల్లిదండ్రుల సహకారం కలిసి మంచి ఫలితాలు సాధ్యం అయిందని తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులు వైద్య, ఇంజినీరింగ్, నర్సింగ్, అగ్రికల్చర్ , వెటర్నరీ, బయోటెక్నాలజీ తదితర ప్రొఫెషనల్, సాంకేతిక కోర్సుల్లో ప్రవేశాలు పొందుతున్నారని చెప్పారు. నగరంలో టాస్క్ ద్వారా కూడా విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాలను మరో పదేళ్ల పాటు కొనసాగిస్తే వేలాది మంది విద్యార్థుల జీవితాల్లో మార్పు తీసుకురావచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం సాధించిన విజయమే అంతిమ లక్ష్యం కాదని, ఇది భవిష్యత్తుకు తొలి అడుగు మాత్రమేనని ఆయన విద్యార్థులకు సూచించారు. తాము ఎంచుకున్న కోర్సులను పూర్తిస్థాయి ఏకాగ్రతతో చదువుతూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఉన్నత చదువులు అభ్యసించే మూడు, నాలుగేళ్ల కాలం విద్యార్థుల జీవితంలో ఎంతో విలువైనదని, ఈ సమయంలో ఇతర ఆకర్షణలకు దూరంగా ఉంటూ చదువుపైనే దృష్టి సారించాలని సూచించారు. కేవలం డిగ్రీలు పొందడమే కాకుండా, ఆయా కోర్సుల్లోని విషయ పరిజ్ఞానాన్ని లోతుగా అర్థం చేసుకుని, నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. క్రమశిక్షణతో ముందుకు సాగుతూ తల్లిదండ్రులకు, చదువు చెప్పిన అధ్యాపకులకు, చదువుకున్న కళాశాలలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు తమ విజయాలను,



సర్టిఫికెట్లను, అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లతో దిగిన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకోవాలని సూచించారు. ఇవి భవిష్యత్తులో మధుర జ్ఞాపకాలుగా మిగిలిపోతాయని చెప్పారు. ప్రతి కుటుంబంలోని బిడ్డ ఉన్నత విద్యను అభ్యసించి, స్వశక్తితో నిలబడి గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలన్నదే తమ లక్ష్యమని యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధనకు దాతలు, విద్యాసంస్థల యాజమాన్యాలు, అధ్యాపకులు, తల్లిదండ్రులు సమష్టిగా సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం పయనీర్ ప్రత్యేక శిక్షణ ద్వారా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ శ్రీమతి గుమ్ముల మమత శ్రీనివాస్, డీఐఈఓ శ్రీమతి చిలుక రమణి, బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి కౌసర్ జహాన్, బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అలీముద్దీన్, వాగ్దేవి జూనియర్ కళాశాల డైరెక్టర్ విజేత వెంకట్ రెడ్డి, ప్రతిభ జూనియర్ కళాశాల డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి, రిషి జూనియర్ కళాశాల డైరెక్టర్ వెంకటయ్య, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, కార్పొరేటర్లు అనువ ఆంజనేయులు, ప్రశాంత్ , సోషల్ మీడియా కన్వీనర్ ఏర్పుల నాగరాజు, , జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ ఉపాధ్యక్షులు సిరిగిరి మురళి, నాయకులు మైత్రి యాదయ్య , తుప్పలి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి -డీఎల్ఎస్ఏ కార్యదర్శి నిహారిక



నాగర్ కర్నూల్ నవంబర్ 06 (ప్రజా కలం): ప్రతి ఒక్కరూ చట్టాల పట్ల కనీస అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే సమాజంలో నేరాలను అరికట్టి నేరరహిత సమాజ నిర్మాణానికి కృషి చేయవచ్చని నాగర్‌కర్నూల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి నిహారిక అన్నారు.రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లవెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నిహారిక మాట్లాడుతూ ప్రతి పౌరుడు తన హక్కులు, బాధ్యతలు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే అన్యాయాలను ఎదుర్కొని, న్యాయం పొందేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందిస్తున్న ఉచిత న్యాయ సేవల గురించి ప్రజలకు వివరించారు. న్యాయవాదిని నియమించుకునే ఆర్థిక స్థోమత లేని అర్హులైన వారికి సంస్థ తరఫున ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. న్యాయపరమైన సలహాలు, సహాయం అవసరమైన వారు 15100 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని సూచించారు. అనంతరం గ్రామ ప్రజలకు ఉన్న న్యాయపరమైన సందేహాలను అడిగి తెలుసుకొని, వాటికి తగిన వివరణలు అందించారు. ప్రజలు తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలని, అందుబాటులో ఉన్న న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య, గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



రెడ్‌క్రాస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలి

మానవతా సేవల్లో సభ్యులు చురుకైన పాత్ర పోషించాలి : జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

నిర్మల్ నవంబర్ 06 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా నిర్వహించే సేవా కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయాలని, ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ మానవతా దృక్పథంతో సమాజ సేవలో సభ్యులు చురుకైన పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నూతనంగా ఎంపికైన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సభ్యులతో కలెక్టర్ సమావేశమై సంస్థ లక్ష్యాలు, విధులు, భవిష్యత్తులో చేపట్టాల్సిన సేవా కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రెడ్‌క్రాస్ సంస్థ ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచే గొప్ప మానవతా సేవా సంస్థ అని పేర్కొన్నారు. రక్తదాన శిబిరాలను విస్తృతంగా నిర్వహించి, అత్యవసర సమయంలో రోగులకు సకాలంలో రక్తం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. యువతను రక్తదానానికి ప్రోత్సహించడంతో పాటు కళాశాలలు, విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు తక్షణ సహాయం అందించేలా సభ్యులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని తెలిపారు. పేదలు, అనాథలు, వృద్ధులు, దివ్యాంగులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ హెల్త్ కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు, వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. యువత, విద్యార్థుల భాగస్వామ్యంతో సేవా కార్యక్రమాలను విస్తృతం చేయడంతో పాటు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల సహకారంతో కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. నూతనంగా ఎంపికైన సభ్యులందరూ సమన్వయంతో పనిచేసి జిల్లాలో రెడ్‌క్రాస్ సంస్థకు మరింత మంచి గుర్తింపు తీసుకురావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. చేపట్టాల్సిన కార్యక్రమాలకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని, వాటి అమలును ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని సూచించారు. అనంతరం.. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిర్మల్ జిల్లా శాఖకు శాశ్వత భవన నిర్మాణం చేపట్టేందుకు అనువైన స్థలాన్ని ఎంపిక చేసి కేటాయించాలని ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సభ్యులు జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా సహకార శాఖ అధికారి ఎం. సత్యనారాయణ, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షులు గొజ్జ జనార్ధన్, వైస్ చైర్మన్ ఎం.సి. లింగన్న, ట్రెజరర్ అల్లాడి రవి, స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యులు సమన్వల్లి రాఘవులు, సభ్యులు భూమయ్య, గంగన్న, నాగభూషణం, రాజేశ్వర్, రమేష్, ముజాహిద్, సాయన్న, రవీందర్, చిన్నయ్య, రాజన్న, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమైక్య భవన నిర్మాణానికి భూమిపూజ

రెండు నెలల్లో భవన నిర్మాణం పూర్తి చేసి మహిళలకు అందిస్తాం: సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్

తానూ ర్, నవంబర్ 6(ప్రజా కలం):: ముధోల్ మండలంలోని ఆష్టా గ్రామంలో మహిళా సమైక్య భవన నిర్మాణానికి గ్రామ సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్ శుక్రవారం అంగన్వాడీ భవనం పక్కన భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఉపసర్పంచ్ సహకారంతో మహిళల కోసం ప్రత్యేకంగా మహిళా సమైక్య భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భవనంపైకి వెళ్లేందుకు మెట్ల సదుపాయంతో పాటు, మెట్ల కింద మహిళల సౌకర్యార్థం వాష్‌రూమ్ నిర్మిస్తామని తెలిపారు. రెండు నెలల్లో భవన నిర్మాణాన్ని పూర్తి చేసి మహిళలకు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతకు పెద్దపీట వేస్తామని, ఎలాంటి నాణ్యతా లోపాలు లేకుండా పనులు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ సావిత్రి కోటయ్య, మహిళా సంఘం అధ్యక్షురాలు జైశీల్, ఉపాధ్యక్షురాలు దేవ్ భాయ్, కోశాధికారి లోలం కవిత, గ్రామంలోని వివిధ మహిళాసంఘాలసభ్యులు, వీడీసీఅధ్యక్షుడు అజయ్ రెడ్డి, వార్డు సభ్యులు మిద్దె ప్రమీల, సురేష్, బొంగు సంతోష్, చిన్నన్న, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



తాడిచర్లలో వీవో బిల్డింగ్‌కు భూమిపూజ

మహిళా సంఘాల అభివృద్ధికి మరో ముందడుగు

సర్పంచ్ బండి స్వామి ఆధ్వర్యంలో నిర్మాణ పనులకు శ్రీకారం



మల్హర్, నవంబర్ 6 ప్రజాకలం ప్రతినిధి... మల్హర్ రావు మండలం తాడిచర్ల గ్రామపంచాయతీ పరిధిలో వీవో బిల్డింగ్ నిర్మాణానికి శుక్రవారం స్థానిక సర్పంచ్ బండి స్వామి ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించి, ముగ్గు పోశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండి స్వామి, ఎంపీడీవో క్రాంతి కుమార్, ఉప సర్పంచ్ బొబ్బిలి రాజు గౌడ్, వార్డు సభ్యులు,తిర్రి అశోక్ గౌడ్, కామ బాపు, ఇందారపు సారయ్య, పమ్మిడి నిరంజన్ రావు, చల్లా మహేందర్, సీఏలు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో మహిళా సంఘాల సభ్యులు హాజరయ్యారు.

పీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో.ఏదులాపురం మున్సిపాలిటీలో 38 కుటుంబాలకు ఆర్థిక సాయం

పాలేరు నవంబర్ 06(ప్రజా కలం న్యూస్) పాలేరు నియోజకవర్గ పరిధిలోని ఏదులాపురం మున్సిపాలిటీలో అక్టోబర్ నెలలో మృతి చెందిన వారి కుటుంబాలకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థిక సహాయం అందజేశారు. ఒక్కో కుటుంబానికి రూ. 10,000 చొప్పున మొత్తం 38 కుటుంబాలకు ఆర్థిక తోడ్పాటునిచ్చారు. ఏదులాపురం మున్సిపాలిటీ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మున్సిపాలిటీ అధ్యక్షులు బానోత్ కిషోర్ హాజరై బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమాల్లో.. పలువురు కౌన్సిలర్లు, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



క్రైస్తవులపై దాడులు చేస్తే ఊరుకోం

- రంగారెడ్డి జిల్లా ఘటనపై కేసులు నమోదు చేయాలి

- టీసీసీ జిల్లా అధ్యక్షులు గుంటి బాబురావు, కే. ఇజ్రాయేల్ డిమాండ్



తల్లాడ, నవంబర్ 6 ప్రజా కలం న్యూస్ : ప్రజాస్వామ్యంలో ఏ మతానికి అయినా స్వేచ్ఛ ఉంటుందని, ఒక మతాన్ని కించపరిచే విధంగా మాట్లాడటం, దాడులు చేయటం ఏమాత్రం సమంజసం కాదని, మరలా ఇటువంటి దాడులు జరిగితే ఊరుకోమని తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుంటి బాబురావు, జిల్లా గాస్పల్ సింగర్ కే ఇస్రాయేలు అన్నారు. శుక్రవారం తల్లాడలో విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని అల్మాల్ లో ఇద్దరు మహిళలు బైబిల్ కు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేస్తుంటే ఓ వ్యక్తి మహిళలపై దాడులు చేయటం, కొట్టటం సరైనది కాదన్నారు. అతనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసే అధికారం ఎవరికి లేదన్నారు. ప్రభుత్వాలు క్రిస్టియన్లకు రక్షణ కల్పించాలని అన్నారు. ఇటువంటి దాడులు మరోసారి పునరావృతం అయితే ఊరుకోబోమని వారు ఘాటుగా హెచ్చరించారు. ఈ సమావేశంలో టిసిసి రాష్ట్ర నాయకులు గారపాటి సూర్యం ఉన్నారు.

కోలూర్ గ్రామంలో మృతుల కుటుంబాలను పరామర్శించిన ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి



తానూర్, నవంబర్ 06 (ప్రజా కలం): మండలంలోని కోలూర్ గ్రామానికి చెందిన ఫారెస్ట్ బీట్ అధికారి బి. లాలాజీ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు, ఈ విషయం తెలుసుకున్న ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి శుక్రవారం కోలూర్ గ్రామానికి చేరుకుని,బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు, లాలాజీ మృతిపట్ల తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారు, అలాగే, అదే గ్రామానికి చెందిన గుంజల్వార్ గంగాబాయి అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె బాధిత కుటుంబాన్ని కూడా మాజీ ఎమ్మెల్యే పరామర్శించి సానుభూతి తెలిపారు, ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాజన్న, మాజీ జడ్పీటీసీ ఉత్తమ్ బాలేరావు, మొగిలి సర్పంచ్ ఉషా-దర్శన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి భీమ్ పవార్, భైంసా మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మౌలాఖాన్, మాజీ ఎంపీటీసీ పోశెట్టి, మాజీ సర్పంచ్ బాలాజీ, తాజా మాజీ సర్పంచ్ చంద్రకళ-శ్రీనివాస్ రెడ్డి, నాయకులు సురేష్ పటేల్, భూమన్న, మాజీ సర్పంచ్ శంకర్, ధర్మేందర్,మనోజ్, రాజు, సలీం, సుధాకర్, బషీర్, బి. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అక్కమ్మ చిత్రపటానికి డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ నివాళులు




ఖమ్మం నవంబర్ 06(ప్రజా కలం న్యూస్)

ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం ఎర్రబోడు గ్రామానికి చెందిన దుప్పెల్లి అక్కమ్మ దశదినకర్మ కార్యక్రమానికి డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ హాజరై, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.అక్కమ్మ కుమారుడు దుప్పెల్లి శ్రీను తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ఉద్యమంలో చురుకైన పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎంహెచ్డీ నాయకులు మానుకొండ, కనకపూడి వీరస్వామి, కొండపల్లి మధు, జయరాజు, ముత్తయ్య, గోపాల్‌రావు, వెంకన్న, ఉపేందర్, రమేష్, రామకృష్ణ, హరి, తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజుల కుల దైవం పెద్దమ్మ తల్లి ఆలయంలో చోరీ

అమ్మవారి ముక్కుపుడక అపహరణ.. సీసీ కెమెరాలను ధ్వంసం చేసి ఎత్తుకెళ్లిన దుండగులు



నవంబర్ 6 ప్రజాకలం న్యూస్ మరిపెడ

ముదిరాజుల కుల గ్రామ దేవతగా పూజలందుకుంటున్న పెద్దమ్మ తల్లి ఆలయంలో దొంగతనం జరిగిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామంలోని పెద్దమ్మ తల్లి ఆలయం తాళాలను గుర్తుతెలియని దుండగుడు పగలగొట్టి ఆలయంలోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డాడు. ఆలయంలో ఉన్న అమ్మవారి ముక్కుపుడకను అపహరించడంతో పాటు, అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సైతం పూర్తిగా ఎత్తుకెళ్లినట్లు సమాచారం. చోరీ అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా దుండగుడు తిరిగి కొత్త తాళాలు వేసి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది.ఆలయానికి చేరుకున్న వారు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి ఆందోళన వ్యక్తం చేశారు. భక్తుల విశ్వాసానికి ప్రతీకగా ఉన్న అమ్మవారి ఆలయంలోనే దొంగతనం జరగడంతో గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీ కెమెరాలను సైతం ఎత్తుకెళ్లడంతో దుండగుడిని గుర్తించడం పోలీసులకు సవాలుగా మారే అవకాశం ఉంది. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టి, దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఆలయాల్లో భద్రతను మరింత పటిష్టం చేయాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

వివిజి రాంజీ ద్వారా 12 కోట్ల పనిదినాల లక్ష్యం

అభివృద్ధి, సంక్షేమ లక్ష్యాల సాధనలో జిల్లాల పనితీరును మెరుగుపరచాలి : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి నవంబర్ 06:

ప్రభుత్వం నిర్దేశించిన అభివృద్ధి, సంక్షేమ లక్ష్యాల సాధనలో జిల్లాల పనితీరును మరింత మెరుగుపరచాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.సమగ్ర శిక్షా, పీఎం శ్రీ పథకాలు, వివిజి రాంజీ, చేయూత పింఛన్ల దరఖాస్తులు విచారణ, తాగునీటి సరఫరా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం తదితర అంశాలపై శుక్రవారం డా బిఆర్ అంబేద్కర్ సచివాలయం నుండి ఆయా శాఖల కార్యదర్శులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వివిధ ప్రభుత్వ పథకాల అమలు, నిధుల వినియోగం, నిర్దేశిత లక్ష్యాల సాధనపై సమీక్షించారు.జిల్లా కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్,డి ఆర్.ఓ ఏ.నిర్మల,సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్, పీఎం శ్రీ పథకాలకు కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలని సీఎస్ సూచించారు. జనవరి మొదటి వారంలోగా నిధుల వ్యయాన్ని గరిష్ట స్థాయికి తీసుకెళ్లాలని, తద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి అదనపు నిధులు పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. పీఎం శ్రీ పథకం కింద రూ. 538 కోట్లు కేటాయించగా ఇప్పటివరకు 10 శాతం నిధులు కూడా ఖర్చు కాలేదని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 794 పీఎం శ్రీ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, విద్యా ఫలితాల మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పథకం అమలుపై ముఖ్యమంత్రి ప్రతి పది రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సమగ్ర శిక్ష అభియాన్ కింద రూ.1,763 కోట్లు కేటాయించగా, ఇప్పటివరకు రూ.79 కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు వివరించారు. సమగ్ర శిక్ష, వివిజిరాంజీ పథకాలను సమన్వయం చేసుకుంటూ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాల పనులు చేపట్టాలని సూచించారు. పాఠశాలలను అధికారులు తరచూ సందర్శించి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు మధ్యాహ్న భోజనం, అల్పాహార పథకాలను నాణ్యత తో అమలు చేయాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే విద్యార్థులకు యూనిఫారాలు, పాఠశాల కిట్లు అందించేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. వేసవి కాలం ముగిసే వరకు ప్రజలకు నిరంతరాయంగా తాగునీటి సరఫరా జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీఎస్ స్పష్టం చేశారు. తాగునీటి సమస్యలు తలెత్తే ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ నీటి వనరులను గుర్తించి వినియోగించుకోవాలని, అవసరమైన చోట ప్రైవేట్ బోర్‌వెల్లు, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా, కొత్త బోర్ వెల్ల ఏర్పాటు వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి జిల్లాలో జిల్లా స్థాయి తాగునీటి కమిటీలను ఏర్పాటు చేసి, జిల్లా పంచాయతీ అధికారి, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పబ్లిక్ హెల్త్ అధికారులతో పాటు సంబంధిత శాఖల అధికారులను సభ్యులుగా నియమించాలని ఆదేశించారు. జిల్లా కమిటీ ప్రతి వారం సమావేశమై తాగునీటి సరఫరా పరిస్థితిని సమీక్షించాలని, నవంబర్ నెలాఖరులోగా మండల స్థాయిలోనూ కమిటీలను ఏర్పాటు చేయాలని తెలిపారు. నవంబర్ 15వ తేదీలోగా చేతిపంపులు, బోర్లు, బహిరంగ బావులు తదితర తాగునీటి వనరులకు అవసరమైన మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తాగునీటి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్లలో ప్రెజర్ వాల్వ్‌లను నిరంతరం పర్యవేక్షిస్తూ నీటి వృథాను అరికట్టాలని, అక్రమ కనెక్షన్లు, ట్యాపింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

వివిజి రాంజీ ద్వారా 12 కోట్ల పనిదినాల లక్ష్యం...వివిజి రాంజీ పథకం ద్వారా చేపట్టే పనులు నాణ్యతా ప్రమాణాలతో ఉండాలని, మార్చి నెలాఖరు నాటికి రాష్ట్రవ్యాప్తంగా 12 కోట్ల పనిదినాల కల్పన లక్ష్యాన్ని సాధించాలని సీఎస్ సూచించారు. ప్రస్తుతం రోజుకు సగటున 5.5 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నామని, గత రెండేళ్లతో పోలిస్తే గణనీయమైన పురోగతి సాధించినట్లు తెలిపారు. ఉపాధి హామీ పనులను స్థానిక అవసరాలకు అనుగుణంగా చేపట్టి గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధికి దోహదపడేలా చూడాలని ఆదేశించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సీఎస్ సూచించారు. ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీలతో సమన్వయం చేసుకుంటూ అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లు, మొదటి విడతలో మరో లక్ష ఇళ్ల మంజూరు ప్రక్రియ పెండింగ్‌లో ఉందని, వీటిని త్వరగా పూర్తి చేయాలని తెలిపారు.దీపావళి సందర్భంగా చేపట్టిన 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంలో భాగంగా పూర్తయిన ఇళ్లకు నూతన లోగోతో కూడిన స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని, లబ్ధిదారుల ఇళ్లలో నిర్వహించే వేడుకలను సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక అందించాలని, రవాణా ఖర్చులు మాత్రమే వసూలు చేయాలని తెలిపారు. ఇందుకోసం 'మన ఇసుక -- మన వాహనం' యాప్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. అదేవిధంగా సిమెంట్ బస్తాను రూ.230కే అందించే సబ్సిడీ ప్రయోజనం అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కేంద్ర పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, నిధుల వినియోగం, లక్ష్యాల సాధనలో ప్రతి జిల్లా మెరుగైన పనితీరు కనబరచాలని సీఎస్ సూచించారు. కేంద్ర పథకాల పురోగతి ముఖ్యమంత్రి డాష్‌బోర్డులో నమోదవుతున్నందున అధికారులు ఎప్పటికప్పుడు వివరాలను పర్యవేక్షించాలని తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా చేరవేసేందుకు సోషల్ మీడియాను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.

ఖరీఫ్ 2026-27 ధాన్యం సేకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

పెండింగ్ సన్నబియ్యం డెలివరీ, డిఫాల్ట్ మిల్లర్ల నుంచి బకాయిల రికవరీపై ప్రత్యేక దృష్టి సారించాలి : సివిల్ సప్లైస్ డైరెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి నవంబర్ 06:

ఖరీఫ్ 2026-27 ధాన్యం సేకరణకు సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న సన్నబియ్యం డెలివరీతో పాటు డిఫాల్ట్ రైస్ మిల్లర్ల నుంచి ప్రభుత్వ బకాయిల రికవరీపై ప్రత్యేక దృష్టి సారించాలని సివిల్ సప్లైస్ డైరెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్, ఐఏఎస్ అధికారులను ఆదేశించారు.

పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఐపీఎస్ ఆదేశాల మేరకు శుక్రవారం మహబూబ్‌నగర్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల డీసీఎస్ఓలు, డీఎంలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ధాన్యం సేకరణ, సన్నబియ్యం డెలివరీ, బకాయిల రికవరీ తదితర అంశాలపై సమీక్షించి పలు కీలక సూచనలు చేశారు.

రైస్ మిల్లర్ల నుంచి పెండింగ్‌లో ఉన్న సన్నబియ్యాన్ని వెంటనే ప్రభుత్వానికి అందించేలా జిల్లా, మిల్లుల వారీగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించి నిర్దిష్ట లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. ముఖ్యంగా వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో పెండింగ్ ఎక్కువగా ఉన్నందున సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి డెలివరీలను వేగవంతం చేయాలన్నారు.

డిఫాల్ట్ మిల్లర్ల నుంచి బకాయిల వసూలుకు చర్యలు

జీఓ ఎంఎస్ నంబర్ 17 ప్రకారం నిర్దేశించిన 45 రోజుల గడువులోగా, అంటే డిసెంబర్ 2, 2026లోపు, డిఫాల్ట్ మిల్లర్ల నుంచి పెండింగ్ సన్నబియ్యాన్ని లేదా దానికి సమానమైన నగదును తప్పనిసరిగా రికవరీ చేయాలని ఆదేశించారు.

సంబంధిత జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో మిల్లర్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలను వసూలు చేయాలని సూచించారు. వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో డిఫాల్ట్ మిల్లర్లు అధికంగా ఉన్నందున రికవరీ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.ప్రభుత్వ బకాయిలను నిర్దేశిత విధివిధానాల ప్రకారం రెవెన్యూ రికవరీ చట్టం కింద వసూలు చేయాలని, అవసరమైన ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ల నుంచి పొంది చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

అక్రమాలపై నిరంతర తనిఖీలు నిర్వహించాలి

ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే అధిక ధరలకు సన్నబియ్యం విక్రయించడం, తూకాల్లో మోసాలకు పాల్పడటం వంటి అక్రమాలను అరికట్టేందుకు నిరంతర తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధిత దుకాణాలు, మిల్లర్లు, వ్యాపారులపై కేసులు నమోదు చేయాలని, అవసరమైన సందర్భాల్లో పీడీ చట్టం కింద చర్యలు తీసుకోవాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలి

ఖరీఫ్ 2026-27 ధాన్యం సేకరణ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని కొనుగోలు ఏజెన్సీలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో (గ్రాజ) అవసరమైన మౌలిక సదుపాయాలు, పరికరాలు, సిబ్బంది తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలన్నారు.

ప్రతి కొనుగోలు కేంద్రం గ్రాజూగ్రాలో ఎల్-3 (గ్రా3) గ్రేడింగ్ సాధించినప్పుడే గ్రామీ ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అందువల్ల అన్ని కొనుగోలు కేంద్రాలు నిర్దేశిత ప్రమాణాలను సాధించేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.

అర్హత కలిగిన మిల్లర్లకే ధాన్యం కేటాయింపు

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హత కలిగిన రైస్ మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారంటీలు తీసుకుని ధాన్యం కేటాయిస్తామని డైరెక్టర్ స్పష్టం చేశారు. మిల్లర్ అసోసియేషన్ ప్రతినిధులతో సంబంధం లేకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన మిల్లర్లకు ధాన్యం కేటాయించాలన్నారు.

మిల్లర్ల గత సీజన్ల కస్టమ్ మిల్లింగ్ రైస్ పనితీరును పరిగణనలోకి తీసుకుని అర్హుల జాబితాను ముందుగానే సిద్ధం చేయాలని, ధాన్యం కేటాయింపులో జాప్యం జరగకుండా మిల్లులకు ట్యాగింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ధాన్యం సేకరణకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కొనుగోళ్ల ప్రక్రియను విజయవంతం చేయాలని సివిల్ సప్లైస్ డైరెక్టర్ ఆదేశించారు.

కలెక్టర్‌తో మర్యాదపూర్వక భేటీ

సమీక్షా సమావేశం అనంతరం సివిల్ సప్లైస్ డైరెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ను కలెక్టర్ కార్యాలయం లో కలెక్టర్ ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సమావేశంలో చర్చించిన అంశాలను వివరించారు.

ఈ సమావేశంలో పౌరసరఫరాల శాఖ డిప్యూటీ కమిషనర్ (ప్రొక్యూర్‌మెంట్) కొండల్‌రావు, జీఎం (పీడీఎస్) సాయి అరుణ్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల డీసీఎస్ఓలు, డీఎంలు, డీటీలు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

నేలకొండపల్లిలో ప్రాచీన మానవ నివాస ఆనవాళ్లు వెలుగులోకి

విలువైన పురావస్తు ఆధారాలు, ఇటుక నిర్మాణాలు

బైరాగులగుట్ట, మొర్లకొండ వాగు పరిసరాల్లో తెలంగాణ వారసత్వ శాఖ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పరిశోధనలు : అన్వేషణ ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



పాలేరు నవంబర్ 06(ప్రజా కలం న్యూస్)

నేలకొండపల్లి వరినర ప్రాంతాల్లో ప్రాచీన మానవ నివాసానికి సంబంధించిన పలు ఆసక్తికరమైన ఆధారాలు వెలుగులోకి వచ్చాయని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. జిల్లా కలెక్టర్, రెవెన్యూ, పర్యాటక శాఖ అధికారులతో కలిసి బైరాగులగుట్ట, మొర్లకొండ వాగు పరిసరాల్లో పురావస్తు అన్వేషణ జరుగుతున్న ప్రాంతాన్ని శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ నందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నేలకొండపల్లి సమీపంలోని బైరాగులగుట్ట, మొర్లకొండ వాగు పరిసరాల్లో తెలంగాణ వారసత్వ శాఖ పురావస్తు అన్వేషణ బృందం నిర్వహించిన క్షేత్రస్థాయి ఉపరితల సర్వేలో ప్రాచీన నివాస స్థల ఆనవాళ్లు, ప్రాచీన ఇటుక నిర్మాణాలు లభ్యమయ్యాయన్నారు. తెలంగాణ వారసత్వ శాఖ సంచాలకుల ఆదేశాల మేరకు డిప్యూటీ డైరెక్టర్ (టెక్నికల్) డాక్టర్ పి. నాగరాజు నాయకత్వంలో అసిస్టెంట్ డైరెక్టర్లు బి. మల్లు నాయక్, బి. గంగాదేవి, సైట్ సూపర్‌వైజర్ అశ్విన్ కుమార్, జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్ చక్రవర్తులతో కూడిన అధికారుల బృందం నవంబర్ 5 నుండి 7వ తేదీ వరకు ఈ క్షేత్రస్థాయి అన్వేషణ చేపట్టిందన్నారు. ఈ బృందం బైరాగులగుట్ట, మొర్లకొండ వాగు పరిసర ప్రాంతాల్లో ప్రాచీన నివాస స్థలం విస్తరణ, భౌగోళిక పరిస్థితులు, ఉపరితలంపై కనిపిస్తున్న పురావస్తు అవశేషాలను పరిశీలించిందని తెలిపారు. క్షేత్రస్థాయి సర్వేలో నాటి ప్రజల దైనందిన జీవన విధానం, కళాత్మక నైపుణ్యం, వస్తు సంస్కృతిని ప్రతిబింబించే పలు విలువైన పురావస్తువులను గుర్తించి సేకరించారని తెలిపారు. వీటిలో ముఖ్యంగా మట్టి పూసలు, బండి చక్రం, రాతి రోకలి, ఎరుపు రంగు మృణ్మయ పాత్రల పెంకులు, నలుపు-ఎరుపు రంగుల పాత్రల పెంకులు, ఎరుపు పూత కలిగిన పాత్రల పెంకులు, నలుపు మెరుగు కలిగిన పాత్రల పెంకులు వంటి పురావస్తు ఆధారాలు లభించాయని కలెక్టర్ అన్నారు. సేకరించిన మృణ్మయ పాత్రల పెంకులపై పుష్పాలంకరణలు, బొటనవేలి ముద్రలు, తాడు ఆకారపు అలంకరణలు, పౌరాణిక ఆకృతులు, ముద్రిత అలంకరణలు గుర్తించారన్నారు. ఈ అలంకరణలు ఆనాటి ప్రజల పాత్రల తయారీ సాంకేతిక పరిజ్ఞానం, కళాత్మక అభిరుచి, సాంస్కృతిక సంప్రదాయాలను అధ్యయనం చేయడానికి ఉపయోగపడే ముఖ్యమైన ఆధారాలుగా భావిస్తున్నారన్నారు. ఈ అన్వేషణలో భాగంగా బైరాగులగుట్ట పరిసరాల్లోని ప్రాచీన నివాస స్థలంలో రెండు ఇటుక నిర్మాణాల అవశేషాలను పురావస్తు బృందం గుర్తించి, వాటిలో కొంత భాగాన్ని వెలికితీసిందన్నారు. ఈ నిర్మాణాల నిర్మాణశైలి, ఇటుకల పరిమాణం, అమరిక, వాటికి సంబంధించిన ఇతర పురావస్తు ఆధారాలపై మరింత శాస్త్రీయ పరిశోధన చేపట్టాల్సిన అవసరం ఉందని బృందం అభిప్రాయపడిందని కలెక్టర్ అన్నారు. తెలంగాణ వారసత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ (టెక్నికల్) డాక్టర్ పి. నాగరాజు జిల్లా కలెక్టర్‌కు అన్వేషణలో గుర్తించిన వివిధ పురావస్తువులు, మృణ్మయ పాత్రల రకాలు, వాటిపై కనిపించే ప్రత్యేక అలంకరణలు, ప్రాచీన ఇటుక నిర్మాణాల వివరాలను సమగ్రంగా వివరించారు. జిల్లా కలెక్టర్ పురావస్తు బృందం గుర్తించిన నిర్మాణాలను, సేకరించిన పురావస్తువులను పరిశీలించి, ఈ ప్రాంతానికి సంబంధించిన పురావస్తు విశేషాలను అడిగి తెలుసుకున్నారు. నేలకొండపల్లి ప్రాంతం తెలంగాణలోని ముఖ్యమైన చారిత్రక, పురావస్తు కేంద్రాల్లో ఒకటిగా గుర్తింపు పొందిన నేపథ్యంలో తాజాగా లభించిన ఈ ఆధారాలు ఈ ప్రాంత ప్రాచీన చరిత్రను, నివాస సంస్కృతిని మరింత లోతుగా అధ్యయనం చేయడానికి దోహదపడనున్నాయని, శాస్త్రీయ డాక్యుమెంటేషన్ ద్వారా మరిన్ని వివరాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. కలెక్టర్ పర్యటన సందర్భంగా నేలకొండపల్లి మండల తహసీల్దార్ రాంప్రసాద్, రెవెన్యూ, పర్యాటక శాఖ అధికారులు, తెలంగాణ వారసత్వ శాఖ పురావస్తు అన్వేషణ బృందం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బురద రోడ్డుకు కంకర డస్ట్‌తో తాత్కాలిక ఉపశమనం

- పర్యవేక్షించిన ఉప సర్పంచ్ చెన్ను వెంకటరమణ



పాలేరు నవంబర్ 06(ప్రజా కలం న్యూస్)

కూసుమంచి గ్రామాన్ని రాష్ట్ర రెవెన్యూ,గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సహకారంతో అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని ఉప సర్పంచ్ చెన్ను వెంకటరమణ అన్నారు.ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి.దీంతో ఉప సర్పంచ్ చెన్ను వెంకటరమణ,పాలకవర్గం సమన్వయంతో గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో శుక్రవారం రోడ్ల పై కంకర,డస్ట్ (కంకర పొడి) తొలించి డోజర్ తో చదును చేయించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా పలు వార్డుల్లోని వీధుల్లో రహదారులు బురదమయంగా మారడంతో గ్రామస్తులు,వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు.దీంతో గ్రామ పంచాయితి ఆధ్వర్యంలో తాత్కాలిక పరిష్కారంగా కంకర డస్ట్ వేయించి రాకపోకలకు అనుకూలంగా తీర్చిదిద్దే చర్యలు చేపట్టామని చెప్పారు.గ్రామపంచాయితీ చేపట్టిన ఈ పనులపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొక్కిరేణి రామనాథం, పంచాయితీ సిబ్బంది,గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

నాగర్ కర్నూల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో

ఉచిత మధుమేహ నిర్ధారణ శిబిరం

చిన్న వయసులోనే మధుమేహం బారిన పడుతున్న యువత.. ఆందోళన వ్యక్తం చేసిన వైద్యులు

క్రమశిక్షణతో కూడిన జీవనశైలితోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం: డాక్టర్ రమేష్ చంద్ర



నాగర్ కర్నూల్ నవంబర్ 06 (ప్రజా కలం): ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు మధుమేహ వ్యాధిని ముందస్తుగా గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకునేలా ప్రోత్సహించేందుకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మధుమేహ నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. నాగర్ కర్నూల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని డాక్టర్ రమేష్ చంద్ర, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ రాధాకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ చంద్ర మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా చిన్న వయసులోనే చాలామంది మధుమేహం బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా జంక్ ఫుడ్ అధికంగా తీసుకోవడం, శారీరక శ్రమ లేకపోవడం, ఊబకాయం వంటి కారణాలు మధుమేహానికి దారితీస్తున్నాయని వివరించారు. మధుమేహం రాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ సమతుల్య ఆహారం తీసుకోవడంతో పాటు ప్రతిరోజూ వ్యాయామం, నడక అలవాటు చేసుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో కూడిన జీవనశైలి, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు ఆరోగ్య పరిరక్షణకు ఎంతో దోహదపడతాయని తెలిపారు. వ్యాధి లక్షణాలు కనిపించే వరకు వేచి చూడకుండా ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా మధుమేహాన్ని ముందుగానే గుర్తించినియంత్రించవచ్చన్నారు. ఈ శిబిరంలో వంద మందికి పైగా ప్రజలకు ఉచితంగా మధుమేహం, రక్తపోటు పరీక్షలు నిర్వహించారు. ఉదయం వాకింగ్‌కు వచ్చిన ప్రజలతో పాటు వాకింగ్ వండర్స్ సభ్యులకు ప్రత్యేకంగా పరీక్షలు చేసి ఆరోగ్య పరిరక్షణపై పలు సూచనలు అందించారు. ప్రజల్లో ఆరోగ్యంపైఅవగాహనపెరుగుతుండటం సంతోషకరమని నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులుఅమరేందర్ రెడ్డి, కార్యదర్శి పరమేశ్వర్ రెడ్డి, కోశాధికారి ప్రేమ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతను మాదకద్రవ్యాల బారి నుంచి కాపాడాలి

డ్రగ్స్‌పై నిరంతర అవగాహనతోనే బంగారు భవిష్యత్తు

కెరియర్ గైడెన్స్ అండ్ కౌన్సిలర్ , మోటివేషనల్ స్పీకర్ : రావిరాల బుచ్చయ్య.



ఖమ్మం నవంబర్ 06(ప్రజా కలం న్యూస్) యువత మాదకద్రవ్యాలకు బానిసై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని టీచర్, మోటివేషనల్ స్పీకర్ , ఈగల్ ఫోర్స్ తెలంగాణ యాంటీ డ్రగ్స్ సోల్జర్ రావిరాల బుచ్చయ్య పిలుపునిచ్చారు . గంజాయి , ఇతర మత్తు పదార్థాలు విద్యార్థులకు సులభంగా అందుబాటులోకి రావడం ఆందోళనకరమని పేర్కొన్నారు . డ్రగ్స్ వినియోగం వల్ల ఆరోగ్యం , చదువు , కుటుంబ జీవితం దెబ్బతినడంతో పాటు యువత నేరప్రవృత్తి వైపు మళ్లే ప్రమాదం ఉందన్నారు . తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు, కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు . ప్రభుత్వాలు మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు డీ-అడిక్షన్ కేంద్రాలను విస్తరించాలని కోరారు. డ్రగ్స్‌కు అలవాటుపడి ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు, యువత ఈగల్ ఫోర్స్ తెలంగాణను లేదా సమీప వాలంటీర్లను సంప్రదించాలని సూచించారు. నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని, యువతను రక్షించుకోవడం సమాజ బాధ్యతని బుచ్చయ్య పేర్కొన్నారు.

నల్లవెల్లి రంగారెడ్డి పేరు మీద నీటిపారుదల ప్రాజెక్టుకు నామకరణం చేయాలి

ఎమ్మెల్యే డాక్టర్ రాజేశ్ రెడ్డికి రెడ్డి సేవా సమితి ప్రతినిధుల వినతి



నాగర్‌కర్నూల్ నవంబర్ 06 (ప్రజా కలం) : ప్రముఖ నీటిపారుదల ఇంజనీర్ నల్లవెల్లి రంగారెడ్డి చేసిన విశేష సేవలకు గుర్తింపుగా జిల్లాలోని ఓ నీటిపారుదల ప్రాజెక్టుకు లేదా రిజర్వాయర్‌కు ఆయన పేరు పెట్టాలని రెడ్డి సేవా సమితి ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేశ్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ మహాత్మా గాంధీ ఎత్తిపోతల పథకం రూపకల్పనలో నల్లవెల్లి రంగారెడ్డి కీలక పాత్ర పోషించారని తెలిపారు. పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు మాజీ ఓఎస్డీగా ఆయన అందించిన సేవలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలోనూ ఓఎస్డీగా నియమితులై బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో ఆయన మరణించడం బాధాకరమన్నారు.నాగర్‌కర్నూల్ జిల్లాలో సాగునీటి అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి ఆయన చేసిన కృషి మరువలేనిదని తెలిపారు. ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టుల రూపకల్పన, అమలులో ఆయన చూపిన చొరవ వల్ల జిల్లాలోని రైతాంగానికి ఎంతో మేలు జరిగిందని వివరించారు. ఆయన సేవలను భవిష్యత్ తరాలు గుర్తుంచుకునేలా జిల్లాలోని ఒక నీటిపారుదల ప్రాజెక్టుకు లేదా రిజర్వాయర్‌కు నల్లవెల్లి రంగారెడ్డి పేరు పెట్టాలని కోరారు.ప్రతినిధుల విజ్ఞప్తిపై ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేశ్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ విషయాన్ని పరిశీలించి వీలైనంత త్వరగా తగిన నిర్ణయం తీసుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సేవా సమితి ప్రతినిధులు లింగారెడ్డి, శ్యామ్ సుందర్ రెడ్డి, నారాయణరెడ్డి, బాలచంద్రారెడ్డి, రాజారెడ్డి, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కురుమూర్తి బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

ఈ నెల 10 నుంచి 25 వరకు ఉత్సవాలు.. 14లోగా అన్ని పనులు పూర్తి చేయాలి : ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

సమష్టి కృషితో బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి నవంబర్ 06:

ఈ నెల 10 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సూచించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.శుక్రవారం చిన్నచింతకుంట మండలం అమ్మాపురం గ్రామంలోని కురుమూర్తి దేవస్థానం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి ఎమ్మెల్యే వివిధ శాఖల అధికారులతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖలవారీగా చేపట్టాల్సిన పనులు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై సమీక్షించారు.

జాతర పరిసరాలు, ఆలయ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పంచాయతీరాజ్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రతిరోజూ పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించడంతోపాటు ప్రతి దుకాణం, స్టాల్ వద్ద చెత్తకుండీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ అధికారులు రహదారులపై గుంతలను పూడ్చి మరమ్మతులు చేపట్టాలని, పార్కింగ్ సౌకర్యాలు కల్పించాలని, రోడ్ల వెంట ఉన్న పిచ్చిమొక్కలు, చెట్ల కొమ్మలను తొలగించాలని సూచించారు. ఉద్దాల ఉత్సవం సందర్భంగా అవసరమైన బారికేడ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు.భక్తులకు నిరంతర తాగునీటి సరఫరా అందించేలా ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులు చర్యలు తీసుకోవాలని, అవసరమైన పైపులైన్ల మరమ్మతులు, కొత్త పైపులైన్ల నిర్మాణాలను జాతర ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగేలా అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి తగినన్ని మందులు, పాముకాటు నివారణ మందులు, అత్యవసర ఔషధాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. పోలీసు శాఖ పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టి దొంగతనాలు, ఇతర అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మఫ్టీలో పోలీసులతో గస్తీ నిర్వహించాలని అన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై ప్రత్యేక నిఘా ఉంచాలని, వీఐపీల పేరుతో ప్రత్యేక అనుమతులు కోరుతూ సాధారణ భక్తులకు ఇబ్బందులు కలిగించే చర్యలనుఅనుమతించకూడదని స్పష్టం చేశారు. మద్యం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వీటిలో మూడు బృందాలు మూడు ప్రధాన మార్గాల్లో వాహనాల ద్వారా నిరంతరం గస్తీ నిర్వహిస్తాయని వెల్లడించారు. పశు సంవర్ధక శాఖ అధికారులు జాతర పరిసరాల్లో మాంసం విక్రయాలపై వర్యవేక్షణ చేపట్టి, వ్యాధులతో బాధపడుతున్న లేదా చనిపోయిన గొర్రెలు, మేకల మాంసం విక్రయించకుండా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. భక్తుల రాకపోకలకు అనుగుణంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కొత్తకోట, ఆత్మకూరు, నారాయణపేట, చిన్నచింతకుంట మార్గాల్లో బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. గత ఏడాది 200 బస్సులు నడపగా, ఈసారి కూడా అదే సంఖ్యలో బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఐదు డిపోల నుంచి 100 మంది సిబ్బందిని కేటాయించి బస్సుల నిర్వహణ చేపడతామని పేర్కొన్నారు. కౌంటర్ల వద్ద రహదారిపై గుంతలను పూడ్చడంతోపాటు రైల్వే అండర్‌పాస్ వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అగ్నిమాపక శాఖ అధికారులు 24 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని, అగ్నిప్రమాదాలు సంభవిస్తే వెంటనే స్పందించేలా సిబ్బంది, వాహనాలను సిద్ధంగా ఉంచాలని అన్నారు. జాతర ప్రాంగణంలో మూడు అగ్నిమాపక వాహనాలను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. దేవాదాయ శాఖ అధికారులు భక్తులకు దర్శనం, ఇతర సౌకర్యాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, ఆలయ కమిటీ సభ్యులు కూడా అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఆర్‌అండ్‌బీ, మిషన్ భగీరథ తదితర శాఖలు చేపట్టాల్సిన పనులన్నింటినీ ఈ నెల 14వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 15న స్వామివారి ప్రత్యేక సేవ, 16న ఉద్దాల ఉత్సవం, 17న ఆవాహిత దేవతల పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సమష్టి కృషితో బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి: కలెక్టర్

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలను గత ఏడాది కంటే మరింత ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గత సమావేశాల్లో అప్పగించిన బాధ్యతల మేరకు అధికారులు ఇప్పటికే పలు పనులు పూర్తి చేశారని తెలిపారు. మిగిలిన పనులను కూడా నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కురుమూర్తి జాతర మహబూబ్‌నగర్ జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చే ప్రధాన ఉత్సవమని, పర్యాటక కేంద్రంగా కూడా ఎంతో ప్రాధాన్యత కలిగి ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడం ద్వారా జిల్లాకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభిస్తుందని అన్నారు. జిల్లా యంత్రాంగం తరపున అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, డి.ఆర్.ఓ ఎ.నిర్మలా, ఆలయ కమిటీ చైర్మన్ బత్తుల బాలరాజ్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సోమారంలో గ్రామైక్య సంఘు భవన నిర్మాణ పనులు ప్రారంభం

-భవన నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలి

- ఎంపీడీవో శంకర్ నాయక్



(వరంగల్/పర్వతగిరి)నవంబర్ 06, ప్రజాకలం ప్రతినిధి: మహిళ స్వయం సహాయక సంఘాలు క్రమం తప్పకుండా నెలసరి సమావేశాలు నిర్వహించుకొనుటకు ప్రభుత్వం పక్కా భవనాలు నిర్మించాలనే సంకల్పంతో మండలంలోని అన్ని గ్రామాలకు విబిజి రామ్జి పథకం ద్వారా ఒక్కొక్క భవన నిర్మాణానికి 10 లక్షలు, మరుగుదొడ్డి నిర్మాణానికి 1.25 లక్షల చొప్పున నిధులు మంజూరు చేయడం జరిగిందని ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మహిళ గ్రామైక్య సంఘాల భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయుటకు కృషి చేయాలని పర్వతగిరి ఎంపీడీవో మాలోత్ శంకర్ నాయక్ సూచించారు. శుక్రవారం మండలంలోని సోమారం లో వెన్నెల గ్రామైక్య సంఘం భవన నిర్మాణాల పనులకు భూమి పూజ కార్యక్రమానికి ఎంపీడీవో శంకర్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని స్థానిక సర్పంచ్ ఏర్పుల శ్రీనివాస్ తో కలిసి పనులను ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏల్ నినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరు ప్రతి నీటి బిందువును ఒడిసిపట్టి భూగర్భ జలాల నీటిమట్టాన్ని పెంపొందించుటకు కృషి చేయాలని కోరారు. మహిళలు ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా సామాజికంగా సుస్థిరత సాధించాలని అన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం సోమవారం గుంటూరుపల్లిలలో విబిజి రామ్ జి పథకం ద్వారా నిర్మించిన మ్యాజిక్ సోఫిట్స్, మరుగుదొడ్డి నిర్మాణాలతో పాటు ఇందిరమ్మ లబ్ధిదారులు నిర్మించుకున్న ఇండ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శేషంజన్ స్వామి,ఏపిఎం రాజీరు, సీసీలు గోలి కొమురయ్య, వర్కాల సుధాకర్, పంచాయతీ కార్యదర్శి మమత, జి పి పాలకవర్గ సభ్యులు ఎస్కే సర్దార్, డెక్క రేణుక, రాపాక సరోజన,రాపాక రమేష్,అజ్మీరా రవీందర్, వివో యుపిఎస్ హెచ్ఎం గౌస్ మొయినుద్దీన్,జిపిఓ సారంగపాణి, అధ్యక్షురాలు అనిత, కోశాధికారిఅరుణ,వివోఏ జ్యోతి,ఎఫ్ఏ శంకర్,అంగన్వాడి, ఆశా కార్యకర్తలు, మహిళా స్వయం సహాయక బృందాల లీడర్లు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణహితంగా, సురక్షితంగా

ప్రశాంత వాతావరణంలో దీపావళి జరుపుకోవాలి

గ్రీన్ క్రాకర్స్ వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వాలి : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

బాణాసంచా కాల్చే సమయంలో ప్రతి ఒక్కరూ భద్రతా జాగ్రత్తలు పాటించాలి : పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి



ఖమ్మం, నవంబర్ 06(ప్రజా కలం న్యూస్)

దీపావళి పండుగను పర్యావరణహితంగా, సురక్షితంగా, సంతోషంగా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పండుగ సందర్భంగా గ్రీన్ క్రాకర్స్ వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వాలని, శబ్ద, వాయు కాలుష్యాన్ని తగ్గించే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. బాణాసంచా కాల్చే సమయంలో ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. టపాసులు కాల్చేటప్పుడు కాటన్ దుస్తులు ధరించాలని, నైలాన్, పాలిస్టర్ వంటి సింథటిక్ దుస్తులు ధరించకూడదని సూచించారు. భవనాలు, విద్యుత్ తీగలకు దూరంగా ఉన్న ఖాళీ ప్రదేశాల్లో మాత్రమే బాణాసంచా కాల్చాలని, టపాసులు కాల్చే ప్రదేశంలో ముందస్తుగా ఒక బకెట్ నీరు, ఇసుక, ప్రథమ చికిత్స సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. పిల్లలు బాణాసంచా కాల్చేటప్పుడు పెద్దలు తప్పనిసరిగా వారి పక్కనే ఉండి పర్యవేక్షించాలని, బాణాసంచాను జేబుల్లో పెట్టుకోవడం, చేతుల్లో పట్టుకుని తిరగడం చేయకూడదని కలెక్టర్ సూచించారు. వెలగని టపాసులను తిరిగి వెలిగించే ప్రయత్నం చేయకూడదని, వాటిని నీటితో తడిపి సురక్షితంగా తొలగించాలని పేర్కొన్నారు. ఇళ్లలో, గ్యారేజీల్లో, బాల్కనీల్లో బాణాసంచా కాల్చకూడదని తెలిపారు.

ప్రమిదలు, దీపాలను స్థిరమైన ప్రదేశాల్లో, కర్టెన్లు, ప్లాస్టిక్ వస్తువులు, ఇతర మండే వస్తువులకు దూరంగా ఉంచాలని, నిద్రించే ముందు లేదా బయటకు వెళ్లే ముందు వెలుగుతున్న దీపాలను ఆర్పివేయాలని సూచించారు. పెంపుడు జంతువులు, వీధి జంతువుల సమీపంలో పెద్ద శబ్దాలు వచ్చే బాణాసంచా కాల్చకూడదని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని, ప్రమాదాలకు తావులేకుండా కుటుంబ సభ్యులతో కలిసి సురక్షితమైన, ఆనందకరమైన దీపావళి పండుగను జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.



మానవత్వంతో అండగా నిలిచిన ఎర్రవాడ కుటుంబ సభ్యులు

గజ్వేల్, నవంబర్ 06 (ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ పట్టణంలోని 17వ వార్డుకు చెందిన సంఘనోల్ల రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎర్రవాడ కుటుంబ సభ్యులు ఆయన కుటుంబాన్ని పరామర్శించి,ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా రాజు మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ,ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాద సమయంలో మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రవాడ బాలకృష్ణ,ఎర్రవాడ రాజు,బజరంగ్ దళ్ నాయకుడు అరవింద్,ఎర్రవాడ స్వామి,ఎర్రవాడ కరుణాకర్‌తో పాటు ఎర్రవాడ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ అండర్-19 క్రికెట్ టోర్నమెంట్‌కు గజ్వేల్ యువకుడు బాకీ చేతన్ నిఖిల్ ఎంపిక

- తెలంగాణ జట్టు తరఫున మధ్యప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటేందుకు సిద్ధం

గజ్వేల్, నవంబర్ 6 (ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ పట్టణానికి చెందిన యువ క్రికెటర్ బాకీ చేతన్ నిఖిల్ జాతీయ అండర్-19 క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యాడు.తెలంగాణ ఎస్‌జీఎఫ్ అండర్-19 బాలుర క్రికెట్ జట్టు తరఫున జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కించుకున్నాడు. మధ్యప్రదేశ్‌లో వారం రోజుల పాటు జరగనున్న ఈ టోర్నమెంట్‌లో తెలంగాణ జట్టు తరఫున తన ప్రతిభను ప్రదర్శించనున్నాడు.గజ్వేల్‌కు చెందిన బాకీ లావణ్య,బాకీ స్వామి దంపతుల కుమారుడైన చేతన్ నిఖిల్ చిన్ననాటి నుంచి క్రికెట్‌పై ఆసక్తి పెంచుకొని నిరంతరం సాధన చేస్తున్నాడు. క్రమశిక్షణ,పట్టుదలతో శ్రమిస్తూ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం వట్ల కుటుంబ సభ్యులు, స్థానిక క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా చేతన్ నిఖిల్ మాట్లాడుతూ..జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసిన సెలక్షన్ కమిటీకి,శిక్షణ అందించిన కోచ్ రాజేందర్‌కు కృతజ్ఞతలు తెలిపాడు. తన క్రికెట్ ప్రయాణంలో ప్రతి అడుగునా ప్రోత్సహిస్తూ అండగా నిలిచిన తండ్రి బాకీ స్వామికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశాడు.తమ కుమారుడు జాతీయ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు బాకీ లావణ్య,బాకీ స్వామి ఆనందం వ్యక్తం చేశారు.చిన్ననాటి నుంచి క్రికెట్‌పై ఉన్న ఆసక్తి,నిరంతర సాధన,పట్టుదలతో ఈ స్థాయికి చేరుకున్నాడని తెలిపారు. గజ్వేల్ పట్టణానికి చెందిన యువకుడు జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక కావడంపై పట్టణ ప్రముఖులు, క్రీడాభిమానులు అభినందనలు తెలిపారు.భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి,గజ్వేల్ పట్టణానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



బీజేపీ ఎండోమెంట్ సెల్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్‌గా జిల్లా రమేష్

-గజ్వేల్ నాయకుడికి రాష్ట్రస్థాయి బాధ్యతలు..

అభినందించిన పార్టీ శ్రేణులు

గజ్వేల్, నవంబర్ 6 (ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు జిల్లా రమేష్‌కు పార్టీ రాష్ట్రస్థాయి బాధ్యతలు లభించాయి.బీజేపీ ఎండోమెంట్ సెల్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్‌గా ఆయన నియమితులయ్యారు. ఈ నియామకంతో గజ్వేల్ నియోజకవర్గ బీజేపీ నాయకులు,కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.పార్టీ సంస్థాగత బలోపేతంతో పాటు హిందూ ధార్మిక సంస్థలకు సంబంధించిన సమస్యలు, వాటి పరిరక్షణ అంశాలపై పనిచేసే బాధ్యతలు జిల్లా రమేష్‌కు అప్పగించారు.ఈ సందర్భంగా జిల్లా రమేష్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి రాష్ట్రస్థాయి బాధ్యతలు అప్పగించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు,ఎంపీ రఘునందన్ రావు, పార్టీ అధికార ప్రతినిధి కప్పర ప్రసాద్ రావు,సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్,ఎండోమెంట్ సెల్ రాష్ట్ర కన్వీనర్ సూర్య ప్రకాష్ అన్నావర్ఖుల,కో-కన్వీనర్ నిరంజన్ దేశాయ్,మనోహర్ యాదవ్‌తో పాటు ఇతర సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.తనకు సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు.తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తానని,పార్టీ సిద్ధాంతాల ప్రచారం,సంస్థాగత బలోపేతంతో పాటు ధార్మిక సంస్థల పరిరక్షణకు కృషి చేస్తానని జిల్లా రమేష్ తెలిపారు.జిల్లా రమేష్ నియామకంపై గజ్వేల్ నియోజకవర్గ బీజేపీ నాయకులు,కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.





అమెరికాతో డీల్‌పై భారత్ ఆచితూచి అడుగులు..

కలిసిరానున్న ఎన్నికల ఫలితాలు!

అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై భారత్‌కు తగ్గిన తొందర

రిపబ్లికన్లకు పట్టు తగ్గడంతో సుంకాల విషయంలో కలిసి రావొచ్చని అంచనా

ఈ పరిణామం భారత ఆర్థిక వ్యవస్థకు సానుకూలమన్న ఎంకే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్

ఇకపై అదనపు సుంకాలు విధించాలంటే సెక్షన్ 301, 232 కింద విచారణలు తప్పనిసరి

దీంతో భారత్‌కు అకస్మాత్తుగా సుంకాల షాక్ తగిలే ప్రమాదం తగ్గుతుందని అంచనా



న్యూఢిల్లీ : అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలన్న భారత్ తొందర తగ్గిందని ఎంకే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ తాజా నివేదిక వెల్లడించింది. అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్లు కాంగ్రెస్‌పై పూర్తి ఆధిపత్యం కోల్పోవడంతో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ కొంత తగ్గిందని విశ్లేషించింది. దీంతో భారత్‌పై సుంకాల విషయంలో ఆకస్మిక ఒత్తిళ్లు తగ్గే అవకాశం ఉందని పేర్కొంది. ఈ పరిణామం భారత ఆర్థిక వ్యవస్థకు సానుకూలమని తెలిపింది. అమెరికా గతంలో ప్రకటించిన 18 శాతం సుంకాల విధానం అమల్లోకి రాలేదు. ప్రస్తుతం భారత వస్తువులపై 10 శాతం సెక్షన్ 301 సుంకం మాత్రమే అమలవుతోందని నివేదిక వివరించింది. అంతే కాకుండా, అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం (ఐఈఈపీఏ) ద్వారా ట్రంప్‌కు ఉన్న ఒత్తిడి తీసుకొచ్చే అవకాశం కూడా తగ్గిందని పేర్కొంది. ఇకపై అదనపు సుంకాలు విధించాలంటే సెక్షన్ 301, 232 కింద విచారణలు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపింది. ఈ ప్రక్రియకు ఎక్కువ సమయం పడుతుంది. దీంతో భారత్‌కు అకస్మాత్తుగా సుంకాల షాక్ తగిలే ప్రమాదం తగ్గుతుందని అంచనా వేసింది. అయితే వాణిజ్య రంగంలో అనిశ్చితి పూర్తిగా తొలగిపోలేదని నివేదిక హెచ్చరించింది. ఫార్మా, ఎలక్ట్రానిక్స్ రంగాలపై సెక్షన్ 232 కింద అదనపు సుంకాలు విధించే ప్రమాదం ఉందని పేర్కొంది. రష్యా, ఇరాన్‌తో దౌత్య సంబంధాల్లో ప్రతికూల పరిణామాలు ఎదురైతే.. భారత్ చమురు దిగుమతులపై మళ్లీ ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని తెలిపింది. 2028 ఎన్నికలకు ముందు వినియోగదారులకు ధరల ఉపశమనం కల్పించాల్సిన రాజకీయ అవసరం ట్రంప్‌పై ఉంటుందని విశ్లేషించింది. మరోవైపు అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గడం భారత్‌కు ఊరటనిస్తోంది. అక్టోబర్ 2026లో నమోదైన గరిష్ఠ స్థాయిలతో పోలిస్తే బ్రెంట్ క్రూడ్ ధర 19 శాతం తగ్గి బ్యారెల్‌కు 95 డాలర్లకు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు భారత్ చమురు దిగుమతుల బిల్లు 24 శాతం పెరిగింది. ఈ నేపథ్యంలో ధరల తగ్గుదల విదేశీ మారక నిల్వలపై ఒత్తిడిని తగ్గించనుంది. చమురు ధరలు తగ్గడం, డాలర్ బలహీనపడటం రూపాయి స్థిరత్వానికి దోహదపడతాయని నివేదిక పేర్కొంది. అయితే ఆర్బీఐ వద్ద 239 బిలియన్ డాలర్ల ఫారెక్స్ రిజర్వ్ డాలర్ బాధ్యతలు ఉండటంతో రూపాయి మరింత బలపడటానికి పరిమితులు ఉండొచ్చని అంచనా వేసింది. మరోవైపు అమెరికాలో ద్రవ్యోల్బణం అధికంగానే కొనసాగితే వడ్డీ రేట్లు త్వరగా తగ్గకపోవచ్చని తెలిపింది.

భీమ్‌రెడ్డి కేసులో ఇళ్లు, భూముల అటాచ్‌మెంట్

లంచంగా ఇచ్చినట్లు ఆరోపణలున్న రెండు ఇళ్లు, ఇన్నోవా కారు స్వాధీనానికి చర్యలు

నాలుగు వ్యవసాయ భూములపైనా ఆదాయపు పన్ను శాఖ ఆంక్షలు

హైదరాబాద్: పోలీసు అధికారి సంకిరెడ్డి భీమ్‌రెడ్డి, ఆయన భార్యకు సంబంధించిన బినామీ ఆస్తుల వ్యవహారంలో ఆదాయపు పన్ను శాఖ మరిన్ని ఆస్తులను గుర్తించింది. అధికారికంగా చేసిన మేళ్లకు ప్రతిఫలంగా ఇచ్చినట్లు ఆరోపణలున్న రెండు ఇళ్లు, వివాదాల పరిష్కారంలో సహకరించినందుకు అందించినట్లు భావిస్తున్న ఇన్నోవా కారు సహా పలు ఆస్తులను తాత్కాలికంగా అటాచ్ చేసింది. ఆదాయపు పన్ను శాఖలోని బినామీ ఆస్తుల నిరోధక విభాగం (బీపీయూ) నవంబరు 3న మూడు ఉత్తర్వులు జారీ చేసింది.పటాన్‌చెరు పరిధిలోని ముత్తంగిలో రెండు ఇళ్లు, మొగుడంపల్లిలో 3.20 ఎకరాల విస్తీర్ణంలో నాలుగు వ్యవసాయ భూములు, టయోటా ఇన్నోవా క్రిస్టా కారు ఈ జాబితాలో ఉన్నాయి. రిజిస్ట్రేషన్ పత్రాల్లో పేర్కొన్న ధరలు, వాహనం విలువ ప్రకారం వీటి మొత్తం విలువ రూ.59.4 లక్షలు. ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం స్థిరాస్తుల విలువ పలుకోట్ల రూపాయలు ఉంటుందని అంచనా. హైదరాబాద్ బీపీయూ ఈ ఆస్తులపై అటాచ్‌మెంట్ ఉత్తర్వులు ఇచ్చింది.అధికారికంగా చేసిన మేళ్లకు ప్రతిఫలంగా ఇళ్లుఆదాయపు పన్ను శాఖ దర్యాప్తు ప్రకారం.. జీపీఆర్ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ 2023 జులైలో ముత్తంగిలోని బృందావన్ గార్డెన్స్‌లో రెండు ఇళ్లను పోతుగంటి ఇంద్రకరణ్‌రెడ్డి పేరుతో బదిలీ చేసింది. ఇందుకు ఎలాంటి డబ్బు తీసుకోలేదు. ఒక్కో ఇల్లు 200 చదరపు గజాల విస్తీర్ణంలో ఉంది. రిజిస్ట్రేషన్ పత్రాల్లో ఒక్కోదాని విలువ రూ. 14.2 లక్షలుగా పేర్కొన్నారు.పటాన్‌చెరు సబ్‌డివిజనల్ పోలీసు అధికారిగా (ఎస్‌డీపీవో) పనిచేసిన సమయంలో భీమ్‌రెడ్డి చేసిన మేళ్లకు ప్రతిఫలంగానే ఈ ఇళ్లు ఇచ్చారని ఆదాయపు పన్ను శాఖ ఆరోపించింది. సంస్థకు వ్యతిరేకంగా వచ్చిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేయకపోవడం, సంస్థకు సంబంధించిన వివాదాల పరిష్కారంలో సహకరించడం వంటి పనులు చేసినట్లు పేర్కొంది.జీపీఆర్ హౌసింగ్ డైరెక్టర్ జి.కల్యాణ్‌బాబు ఇచ్చిన వాంగ్మూలాన్ని అధికారులు ఈ కేసులో ప్రస్తావించారు. కృతజ్ఞతగా ఆ ఇళ్లను ఇచ్చినట్లు ఆయన చెప్పారని పేర్కొన్నారు. భీమ్‌రెడ్డి సూచన మేరకే ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు తన పేరును ఉపయోగించుకునేందుకు అంగీకరించినట్లు ఇంద్రకరణ్‌రెడ్డి ఒప్పుకొన్నారని తెలిపారు. విద్యుత్తు కనెక్షన్లకు సంబంధించిన రికార్డులను కూడా అధికారులు ఆధారాలుగా తీసుకున్నారు.

లద్దాక్ ప్రాంతాల్లో కరెంట్

శ్రీనగర్ : మనిషికి బలంగా అనుకుంటే ప్రకృతి కూడా సహకరిస్తుంది. ప్రతికూల పరిస్థితి కూడా చిన్నబోతుంది. ఎముకలు కొరికే చలి.. కనుచూపుమేర మంచుకొండలు.. అడుగు తీసి అడుగు వేయాలంటే కష్టం.. ఇలాంటి చోట కొంతమందికి పనే దైవం. విధి నిర్వహణే వారికి శిరోధార్యం ఇలాంటి ఇబ్బందుల్లో కూడా వారు ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. ప్రజల ఇబ్బందులతో పోల్చితే.. ఇవి ఒక ఇబ్బందులా అని వారు అనుకున్నారు.. అంతేకాదు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రాణాల సైతం లెక్క చేయలేదు. దీనికి సంబంధించిన ఒక వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో సంచలనం కలిగిస్తోంది.జమ్ము కాశ్మీర్‌లోని లద్దాక్ ప్రాంతంలో విద్యుత్ సౌకర్యాలను మరింత పెంపొందించేందుకు కార్మికులు కృషి చేస్తున్నారు. వారు చేస్తున్న పని ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ముఖ్యంగా మారుమూల ప్రాంతాలకు కూడా విద్యుత్ సదుపాయం కల్పించాలని లక్ష్యంతో అక్కడి ప్రభుత్వం అడుగులు వేస్తోంది ప్రభుత్వ లక్ష్యానికి తగ్గట్టుగా సిబ్బంది అత్యంత కఠినమైన వాతావరణంలో పని చేస్తున్నారు. ఉష్ణోగ్రతలు మైనస్ 10 డిగ్రీలకు పడిపోయినప్పటికీ పనులు ఏమాత్రం ఆపడం లేదు.వందల అడుగుల ఎత్తులో విద్యుత్ స్తంభాలు.. లైన్లకు సంబంధించిన పనులు చేస్తున్నారు. చుట్టూ మంచుకొండలు.. కింద లోతైన లోయలు.. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా సరే ప్రమాదం జరిగే పరిస్థితులు.. అయినప్పటికీ కార్మికులు ఏమాత్రం వెనకడుగు వేయడం లేదు. తమ ప్రాణాలను ఫణంగా పెట్టి పనులు చేస్తున్నారు.లద్దాక్ ప్రాంతంలోని నుబ్రా ర్యాలీ.. సియాచిన్ గ్లేషియర్ వంటి ప్రాంతాలలో పనులు జరుగుతున్నాయి. సాధారణ సమయంలో విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేయడమే చాలా శ్రమతో కూడుకుంటుంది. అలాంటిది మంచు ప్రాంతాలలో.. అత్యంత ఎత్తైన ప్రదేశాలలో విద్యుత్ సదుపాయం కల్పించడం అంటే మామూలు ఇబ్బంది కాదు. అక్కడి వాతావరణం ఇప్పుడు ఎలా ఉంటుందో ఎవరూ చెప్పలేరు. తీవ్రమైన చలి.. బలమైన గాలులు.. మంచు వల్ల పనులకు నిత్యం ఆటంకాలు కలుగుతూ ఉంటాయి. అయినప్పటికీ నిర్ణయించిన గడువులోగా ప్రాజెక్టును పూర్తి చేసేందుకు సిబ్బంది పనిచేస్తున్నారు.ఈ పనులకు సంబంధించిన వీడియోలు బయటికి వచ్చాయి.

కాంగ్రెస్ లో నిధుల మంటలు



మహబూబ్‌నగర్ :తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు అవుతున్నా పార్టీ అంతర్గత విభేదాలు మాత్రం నివురుగప్పిన నిప్పులా రగులుతూనే ఉన్నాయి. ఒకవైపు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మరోవైపు జడ్చర్ల ఎమ్మెల్యే జె. అనిరుధ్ రెడ్డి నేరుగా తమ సొంత ప్రభుత్వంపైనే అసంతృప్తి వ్యాఖ్యలు చేయడం, విమర్శల బాణాలు ఎక్కుపెట్టడం టీపీసీసీలో పెను దుమారం రేపుతోంది. ఇద్దరు ఎమ్మెల్యేల వేదన, ఆరోపణలు దాదాపు ఒకే తీరుగా ఉన్నాయి? నియోజకవర్గాలకు అభివృద్ధి నిధులు రావడం లేదు, మంత్రివర్గంలో తగిన ప్రాధాన్యత దక్కలేదు, నిధుల కోసం ప్రతిపక్ష ఎమ్మెల్యేల తరహాలోనే పోరాడాల్సి వస్తోంది అని వారు బహిరంగంగానే తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అసంతృప్తి వెనుక కేవలం నిధులు, మంత్రి పదవుల ఆశలు మాత్రమే కాక టెండర్ల కేటాయింపుల్లో ప్రాధాన్యత దక్కకపోవడం కూడా ఉందనే ఆరోపణలు నడుస్తున్నాయి. హైదరాబాద్ రేడియల్ రోడ్ల టెండర్ల విషయంలో ఏపీకి చెందిన కాంట్రాక్టర్లకు ప్రాధాన్యత ఇస్తున్నారని, లోకల్ కాంట్రాక్టర్లను పక్కనబెట్టారని రాజగోపాల్ రెడ్డి నేరుగా సీఎంఓ నిఘా, టెండర్ల కేటాయింపులపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించడం కేడర్‌ను షాక్‌కు గురిచేసింది. మరోవైపు, జడ్చర్ల నియోజకవర్గంలో రోడ్డు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు రాకపోవడం, ఫండ్స్ విడుదల కాకపోవడంతో అనిరుధ్ రెడ్డి ఆమరణ దీక్షకు హెచ్చరికలు జారీ చేసే దాకా పరిస్థితి దాటింది.అయితే, ఈ ఇద్దరి అసంతృప్తుల వెనుక పొలిటికల్ అజెండాలు ఉన్నాయనే భావనతో సీఎం రేవంత్ రెడ్డి, ఆయన కోటరీ దీనిని లైట్ తీసుకుంటున్నారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజగోపాల్ రెడ్డికి సుదీర్ఘ రాజకీయ అనుభవం, కోమటిరెడ్డి బ్రదర్స్ ఇమేజ్ ఉన్నప్పటికీ, ఆయన గతంలో పార్టీ మారిన నేపథ్యం ఉండటంతో హైకమాండ్ వద్ద ఆయన ఒత్తిళ్లకు తలొగ్గకూడదని అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం. సీనియర్లకు పదవులు ఇస్తూ పోతే కొత్తగా వచ్చిన వారికి లేదా రేవంత్ విధేయులకు అవకాశాలు దక్కవనే వ్యూహంతోనే వీరి కామెంట్లను ప్రభుత్వం తీవ్రంగా పట్టించుకోకుండా ఉపేక్షిస్తున్నట్లు కనిపిస్తోంది. ఇక ఇద్దరు ప్రజాప్రతినిధులు రోడ్డెక్కి విమర్శలు చేస్తుంటే, వారికి సర్దిచెప్పడంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లేదా పార్టీ సీనియర్ నాయకత్వం విఫలమవుతోందనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. అసంతృప్త నేతలను పిలిచి మాట్లాడి క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించాల్సింది పోయి, అసమ్మతి వ్యాఖ్యలు చేస్తే చర్యలు ఉంటాయంటూ హెచ్చరికలు జారీ చేయడం మంటలపై నెయ్యి పోసినట్లు పనిచేస్తోంది. పార్టీ అంతర్గత సమావేశాల్లో చర్చించాల్సిన సమస్యలు మీడియా ముందుకు రావడం చూస్తుంటే, పీసీసీ అధ్యక్షుడికి , ఎమ్మెల్యేలకు మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే కాలంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అంతర్గత తిరుగుబాటు రూపంలో పెద్ద చికాకులు తప్పవు. ఇప్పుడు రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి ఓపెన్‌గా గళం విప్పుతుండటంతో, లోలోపల నిధులు రాక, హామీలు నెరవేర్చలేక సతమతమవుతున్న మరికొందరు అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా వీరికి మద్దతుగా నిలిచే అవకాశాలు లేకపోలేదు. అసెంబ్లీలో మెజారిటీకి ముప్పు లేకపోయినప్పటికీ, స్వపక్ష ఎమ్మెల్యేలే రెబెల్స్ గా మారి అవినీతి, నిధుల మళ్లింపు ఆరోపణలు చేస్తే.. అది ప్రతిపక్షాలైన బిఆర్ఎస్, బిజెపిలకు ఉచితంగా పొలిటికల్ ఆయుధాలను అందించినట్లవుతుంది. స్థానిక ప్రజాప్రతినిధులకు నిధుల కొరత, ప్రాధాన్యతలేమి అనేది కేవలం ఇద్దరు ఎమ్మెల్యేలకే పరిమితమైన సమస్య కాదు. రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి అసంతృప్త నేతలతో సమావేశమై టెండర్లు, నిధుల విడుదల మరియు పదవుల భర్తీపై స్పష్టమైన భరోసా ఇవ్వకపోతే, ఈ చిన్న నిప్పు రాబోయే రోజుల్లో రేవంత్ సర్కార్ స్థిరత్వాన్ని, ఇమేజ్‌ను దెబ్బతీసే పెద్ద దావానలంగా మారే ప్రమాదం ఉంది.

ముందస్తు సత్య సాయి జన్మదిన వేడుకలు

వైభవంగా 101 సత్యసాయి స్మరణ భజనల కార్యక్రమం - 21 మంది వృద్ధులకు దుప్పట్లు బహూకరణ

5 పేద కుటుంబాలకు 'అమృత కలశాల' (నిత్యావసర సరుకులు) పంపిణీ - భక్తులకు అన్నదాన కార్యక్రమం

కమాన్ పూర్ : రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో సత్యసాయిబాబా 101 వ జయంతి వేడుకలు ముందస్తు నిర్వహించారు.లోకానికి సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస అనే పంచ మానవ విలువలను బోధించిన భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి శతవర్ష జన్మదిన వేడుకలను పురస్కరించుకుని, రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో 101వ జన్మదినోత్సవ ముందస్తు వేడుకలు భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించబడ్డాయి. కల్వచర్ల శ్రీసత్యసాయి భజన మండలి కన్వీనర్, సింగరేణి రిటైర్డ్ అధికారి నూక రమేష్ ఆధ్వర్యంలో గ్రామంలో పలు ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు జరిగాయి. కల్వచర్ల మెయిన్ రోడ్డులోని నూక రమేష్ గారి స్వగృహం 'సాయి నిలయం' వేదికగా భక్తులు, సేవాదళ్ మరియు శ్రీశివరామకృష్ణ భజనమండలి సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం నుండి సాయంత్రం వరకు '101 సత్యసాయి భజనల' కార్యక్రమం వైభవంగా సాగింది. స్వామివారి నామస్మరణతో కల్వచర్ల గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. భక్తితో భజనల కార్యక్రమానికి హాజరైన భక్తులందరికీ ఉదయం నుండి సాయంత్రం వరకు టీ, భోజన వసతులను నూక రమేష్-దంపతులు ఏర్పాటు చేశారు. భజనల అనంతరం ప్రతి నెలా నిర్వహించే నారాయణ సేవలో భాగంగా ఐదుగురు నిరుపేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులతో కూడిన 'అమృత కలశాల' సంచులను అందజేశారు. అలాగే, రాబోయే చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని 21 మంది వృద్ధులకు చలి నుంచి రక్షణ కోసం దుప్పట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కన్వీనర్ నూక రమేష్ గారు మాట్లాడుతూ... ఈనెల 23వ తేదీన స్వామివారి పవిత్ర జన్మదినం రోజున తాను పుట్టపర్తి క్షేత్రానికి వెళ్తున్న కారణంగా, ఈ వేడుకలను ముందస్తుగా నిర్వహించినట్లు తెలిపారు. లబ్ధి పొందిన వృద్ధులందరూ స్వామివారి ఆశీస్సులతో ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి నెల నిరుపేదలకు అందుతున్న ఈ సాయంపై లబ్ధిదారులు స్పందిస్తూ నూక రమేష్ గారి కుటుంబానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమాలలో డాక్టర్ యం.హరికృష్ణ (పూర్వ కరీంనగర్ సత్యసాయి సేవాసమితి కన్వీనర్), సింగరేణి డీజీయం పెరుమాల్ శరవణన్, మాజీ జడ్పిటిసి గంట వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా అమృత కలశాల సంచులు అందజేశారు.

కార్యక్రమంలో పెద్దపెల్లి జిల్లా సత్యసాయి ఆధ్యాత్మిక సమన్వయకర్త క్యాతం రాజేశం, 8వ కాలనీ కన్వీనర్ కట్కూరి శ్రీనివాస్ రెడ్డి, భజన మండలి ఇంచార్జి పారిపెల్లి మల్లయ్య, కరీంనగర్ సభ్యులు రాంరెడ్డి, కల్వచర్ల గ్రామ సర్పంచ్ శ్రీమతి రేండ్ల శారద, మాజీ సర్పంచ్ రేండ్ల అశోక్, సత్యసాయి సేవాదళ్ సభ్యత్వ దంపతులు గరిగంటి రాజం, గుండ శంకరయ్య, పుల్లూరి అన్వేష్, కొండ సమ్మయ్య,

సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి విజేతలకు బహుమతుల ప్రదానం

అండర్-19 పోటీల్లో నిజామాబాద్‌కు ప్రథమ స్థానం

గజ్వేల్, నవంబర్ 6 (ప్రజాకలం ప్రతినిధి): గజ్వేల్ బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లో తెలంగాణ రాష్ట్ర 70వ పాఠశాల క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-19 సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి టోర్నమెంట్ ముగిసింది. పోటీల్లో విజయం సాధించిన జట్లకు గజ్వేల్ మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్ బహుమతులు అందజేశారు.ఈ పోటీల్లో నిజామాబాద్ జిల్లా ప్రథమ స్థానం సాధించగా, మహబూబ్‌నగర్ జిల్లా ద్వితీయ, రంగారెడ్డి జిల్లా తృతీయ స్థానాల్లో నిలిచాయి.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగుతూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.రాష్ట్రస్థాయి టోర్నమెంట్ నిర్వహణకు సహకరించిన సిబ్బందికి, రాష్ట్రస్థాయి ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మార్కంటి భాగ్యలక్ష్మి కనకసేన, రాష్ట్రస్థాయి అబ్జర్వర్ సమ్మయ్య, వివిధ జిల్లాల కోచ్‌లు,క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



నెల రోజుల్లో రూ.10 లక్షల విలువైన 56 సెల్‌ఫోన్ల రికవరీ

- ఈ ఏడాది ఇప్పటివరకు 726 ఫోన్లు బాధితులకు అప్పగింత

సిద్దిపేట సీపీ రష్మీ పెరుమాళ్ ఐపీఎస్

సిద్దిపేట: 06 నవంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను గుర్తించేందుకు సిద్దిపేట పోలీసులు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా గత నెల రోజుల్లో సుమారు రూ.10 లక్షల విలువైన 56 చరవాణులను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో ఈ ఫోన్లను గుర్తించారు. శుక్రవారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో బాధితులకు ఫోన్లను సీపీ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా సీపీ రష్మీ



పెరుమాళ్ మాట్లాడుతూ మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వారు ఆందోళన చెందకుండా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు నమోదు చేసుకోవాలని సూచించారు. సంబంధిత పోలీస్ స్టేషన్‌లో లేదా ఆన్‌లైన్ ద్వారా వివరాలు నమోదు చేస్తే సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ఫోన్‌ను గుర్తించి తిరిగి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ ఏడాది ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 726 చరవాణులను రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు సీపీ తెలిపారు. సీఈఐఆర్ పోర్టల్ వినియోగంపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఎవరికైనా ఇతరుల చరవాణి దొరికితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలని సూచించారు. చరవాణుల రికవరీలో ప్రతిభ కనబరిచిన సీఈఐఆర్ బృందాన్ని సీపీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ బృందంలో ఇన్‌స్పెక్టర్ మొగిలి,ఆర్ఎస్ఐ నిరంజన్,కానిస్టేబుళ్లు రమేష్, రాజిరెడ్డి,హరికృష్ణ,స్వామి,శ్రీకాంత్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కుశాల్కర్,అదనపు డీసీపీ (ఏఆర్) సుభాష్ చంద్రబోస్,ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ మొగిలి తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కల్వకోల్ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ మాజీ సర్పంచ్ తామస్ రెడ్డి ఇంటికి వెళ్లిన మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, నవంబర్ 06,(ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కల్వకోల్ గ్రామానికి మాజీ హోం శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఈరోజు మర్యాదపూర్వకంగా



విచ్చేశారు. ముందుగా గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ ఇంటికి వెళ్లి కలిసి మాట్లాడారు. అనంతరం ఆమ్లెట్ విలేజ్ (కేకే బస్తీ) మాజీ సర్పంచ్ తామస్ రెడ్డి ఇంటికి వెళ్లి, అక్కడే బ్రేక్ ఫాస్ట్ చేసి వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామ సమస్యలు, అభివృద్ధి పనులపై సాధారణంగా మాట్లాడి, స్థానికుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అంబయ్య యాదవ్, హనుమ గళ్ళ చంద్రయ్య, వెంకటేశ్వర్ రెడ్డి, కర్రోళ్ల చంద్రయ్య, నవీన్, సుధాకర్ రెడ్డి, బక్కని రవి మాదిగ, పర్వతాలు గౌడ్, అరడి వెంకటేష్ యాదవ్, పాండు యాదవ్, బొజ్జం చంద్రయ్య, అరడి రమేష్, గుర్రంపల్లి మల్లేష్ యాదవ్, సుమన్, అశోక్, బబ్లు,అలాగే దుబ్బచెర్ల, పోరండ్ల, మాణిక్యమగుడా, ఆకన్ పల్లి, మహేశ్వరం, సిగిలిపురం, నాగారం గ్రామాల సర్పంచులు కూడా పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, పార్క్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, నవంబర్ 06,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలో అభివృద్ధి పనులకు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. అల్మాస్‌గూడ గ్రామంలో అంబేద్కర్ విగ్రహం నుంచి శివాలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.1.20 కోట్ల నిధులు, ఆర్‌వీఆర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.65 లక్షలు, విశాఖ నగర్ ఫేజ్-1 పార్క్ అభివృద్ధికి రూ. 25 లక్షల నిధులతో చేపట్టనున్న పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి గారు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ కార్పొరేటర్ ఏనుగు రామిరెడ్డి, మాజీ అధ్యక్షులు రామిడి రామిరెడ్డి, సమ్ రెడ్డి వెంకటరెడ్డి, బోయపల్లి శేఖర్ రెడ్డి, ముత్యాల కృష్ణ, భీమిడి జంగారెడ్డి, పెద్దబావి శ్రీనివాస్ రెడ్డితో పాటు కాలనీవాసులు, బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

అల్మాస్‌గూడ గుర్రంగూడ ప్రధాన రహదారి అభివృద్ధికి పనులకు శంకుస్థాపన

ఏఐసీసీ -- విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి



మహేశ్వరం, నవంబర్ 06, (ప్రజా కలం) మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం అల్మాస్‌గూడ అంబేద్కర్ సెంటర్ నుండి గుర్రంగూడ శివాలయం వరకు ప్రధాన రహదారి అభివృద్ధిలో భాగంగా జీహెచ్ఎంసీ జనరల్ ఫండ్ ద్వారా రూ. 2 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు, డ్రైనేజీ పనులకు ఈరోజు గుర్రంగూడ శివాలయం మెయిన్ రోడ్డు వద్ద శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం బోయపల్లి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. బీటీ రోడ్డుకు – రూ. 1.20 కోట్లు డ్రైనేజీ నిర్మాణానికి – రూ. 80 లక్షలు ఈ పనులు పూర్తయితే ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యంతో పాటు డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ఈ నందర్భంగా రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తాం" అని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటైన తర్వాత ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కి, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శ్రీ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి కి, జిల్లా డీసీసీ అధ్యక్షులు చిగురింత పారిజాత నరసింహారెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాదర్‌గుల్ డివిజన్ అధ్యక్షులు బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, నవారు మల్లారెడ్డి, బోయపల్లి వెంకటరెడ్డి, యాదయ్య, శ్రీనివాస చారి, దిండు శ్రీనివాస్ గౌడ్, ఎదుళ్ల ప్రతాప్ రెడ్డి, లక్ష్మీ నరసింహారెడ్డి, ధన్సింగ్ నాయక్, గోలి రంజిత్ రెడ్డి, పృథ్వి రాథోడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ అధ్యక్షులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవ యువతులపై దాడి ఘటనపై మహిళా కమిషన్‌కు వినతి

నిందితులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలి..

బాధితులకు రక్షణ, ఆర్థిక పరిహారం కల్పించాలి



మల్కాజిగిరి, నవంబరు 6 (ప్రజా కలం ప్రతినిధి): హైదరాబాద్‌లో ఇద్దరు దళిత క్రైస్తవ యువతులపై జరిగిన దాడి, అసభ్యకర దూషణలు, లైంగిక వేధింపుల ఘటనపై సమగ్ర విచారణ జరిపించి నిందితులందరిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరికి చెందిన సుప్రీంకోర్టు న్యాయవాది తిప్పరపు కీర్తి కుమార్ తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఉజ్మా ఆషైకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నవంబరు 6న వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం.. సుమారు రెండు నెలల క్రితం హైదరాబాద్‌లో ఇద్దరు యువతులు వెళ్తుండగా కొందరు వ్యక్తులు వారిని అడ్డగించి, వారి సంచులను తనిఖీ చేస్తూ దురుసుగా ప్రవర్తించారని తెలిపారు. తాము పరిచయస్తురాలిని కలవడానికి వచ్చామని యువతులు వివరణ ఇచ్చినప్పటికీ వినకుండా వేధింపులకు పాల్పడ్డారని పేర్కొన్నారు. అంతేకాకుండా ఒక యువతిపై చేయి చేసుకుని చెంపదెబ్బ కొట్టడంతో ఆమె కళ్లద్దాలు సైతం ఎగిరిపడ్డాయని, ఇద్దరు యువతులను బహిరంగంగా అసభ్య పదజాలంతో దూషించి అవమానించారని వినతిపత్రంలో వివరించారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు నవంబరు 3న సామాజిక మాధ్యమాల్లో వెలుగులోకి రావడంతో విషయం ప్రజల దృష్టికి వచ్చిందని తెలిపారు. ఘటన అనంతరం బాధిత యువతులు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారని, ఇంటి నుంచి బయటకు రావడానికి సైతం భయపడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే ఒక నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిసిందని, అయితే ఘటనలో పాల్గొన్న మిగతా వ్యక్తులతో పాటు ప్రేరేపించిన వారిపైనా పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టంలోని సంబంధిత కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. బాధిత యువతుల ఇళ్లకు మహిళా కమిషన్ సభ్యులు స్వయంగా వెళ్లి పరామర్శించి ధైర్యం కల్పించాలని, వారి కుటుంబాలకు పోలీసు రక్షణ కల్పించాలని కోరారు. బాధితులకు చట్టప్రకారం తక్షణ ఆర్థిక పరిహారం, నాణ్యమైన మానసిక కౌన్సెలింగ్ అందించాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలని సూచించారు. అలాగే కేసు విచారణను వేగవంతం చేసేందుకు ప్రత్యేక న్యాయస్థానానికి అప్పగించి నిందితులకు త్వరితగతిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని తిప్పరపు కీర్తి కుమార్ మహిళా కమిషన్‌ను కోరారు. భవిష్యత్తులో మహిళలపై, ముఖ్యంగా అణగారిన వర్గాలకు చెందిన యువతులపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కమిషన్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మర్కుక్ పబ్లిక్ స్కూల్ ఉద్యోగ నియామకాలపై విచారణ చేపట్టాలి

నియామకాల్లో పారదర్శకత పాటించాలి

: ఎమ్మార్పీఎస్ నాయకుల డిమాండ్



గజ్వేల్ నియోజకవర్గం, నవంబర్ 6 (ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ నియోజకవర్గం మర్కుక్ మండలంలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో ఉద్యోగ నియామకాల ప్రక్రియపై సమగ్ర విచారణ చేపట్టి, నియామకాల్లో పారదర్శకత పాటించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగాల భర్తీలో అవకతవకలు జరిగాయంటూ వస్తున్న ఆరోపణలపై అధికారులు స్పందించి స్పష్టత ఇవ్వాలని కోరారు. అలాగే సమతా ఏజెన్సీని తొలగించి, బాధ్యులపై విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. తమ డిమాండ్లు పరిష్కరించకపోతే నిరుద్యోగులతో కలిసి కలెక్టరేట్ ముట్టడి చేపడతామని హెచ్చరించారు. గజ్వేల్ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మైసరాములు మాదిగ మాట్లాడుతూ.. తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఉద్యోగ నియామకాలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ఉద్యోగాల భర్తీకి సంబంధించి పత్రికా ప్రకటనలో కొన్ని పోస్టులను మాత్రమే పేర్కొని,మిగతా ఖాళీల వివరాలను వెల్లడించకపోవడానికి కారణమేంటని ప్రశ్నించారు. నియామకాలపై వస్తున్న ఆరోపణలపై అధికారులు స్పందించి,అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మార్పీఎస్ సిద్దిపేట జిల్లా మాజీ అధ్యక్షులు ముంద్రాతి కృష్ణ మాట్లాడుతూ.. ఉద్యోగ నియామకాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నియామకాల్లో అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని,సమతా ఏజెన్సీ స్థానంలో మరో సంస్థ ద్వారా పారదర్శకంగా నియామకాలు చేపట్టాలని కోరారు. అర్హులైన నిరుద్యోగులకు న్యాయం చేయాలని, సమస్య పరిష్కారం కాకపోతే నిరుద్యోగులతో కలిసి కలెక్టరేట్ ముట్టడి నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు శెనిగరి రమేష్ మాదిగ, కుకునూరుపల్లి మండల ఇన్‌చార్జి చిన్నరాజుగారి కిషన్ మాదిగ, మర్కుక్ మండల ఇన్‌చార్జి మొండి రమేష్ మాదిగ, గజ్వేల్ అధ్యక్షులు చింతకింది యాదగిరి మాదిగ,ఎంఎస్పీ టౌన్ అధ్యక్షులు ఇదోళ్ల యాదగిరి మాదిగ, టౌన్ ప్రధాన కార్యదర్శి ఎర్రవల్లి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సీపీ సజ్జనార్ ని కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపిన రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నరసింహారెడ్డి

మహేశ్వరం , నవంబర్ 06, (ప్రజా కలం)

హైదరాబాద్ సీపీ వి.సి. సజ్జనార్ ఐపీఎస్ ని మర్యాదపూర్వకంగా రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నరసింహారెడ్డి కలిశారు. హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ శ్రీ వి.సి. సజ్జనార్ ఐపీఎస్ ని



రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నరసింహారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీ గారికి పూల బొకే అందచేసి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. హైదరాబాద్ నగరంలో శాంతి భద్రతలు, ప్రజలకు పోలీస్ శాఖ అందిస్తున్న సేవలపై ఇరువురు కాసేపు మాట్లాడుకున్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు పోలీస్ శాఖ చేస్తున్న కృషిని పారిజాత నరసింహారెడ్డి అభినందించారు. పండుగ సందర్భంగా నగరంలో శాంతి భద్రతలు కాపాడేందుకు పోలీస్ సిబ్బంది చేస్తున్న కృషిని కూడా ఆమె ప్రత్యేకంగా ప్రశంసించారు.

హెచ్‌డీపీఎస్ పద్ధతితో పత్తి సాగు చేస్తే అధిక దిగుబడులు.

రైతులకు అవగాహన కల్పించి, పత్తి పొలాలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు.

దుబ్బాక ప్రజాకలం నవంబర్ 06.

అధిక సాంద్రత పత్తి సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించేందుకు రాయపోల్ మండలంలో శుక్రవారం క్షేత్రస్థాయి సందర్శన



కార్యక్రమం నిర్వహించారు. మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి గజ్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు బాబు నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌డీపీఎస్ పద్ధతిలో పత్తి సాగు చేయడం ద్వారా మొక్కల సాంద్రతను పెంచి, శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన పెంచుకొని వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని కోరారు.

అనంతరం పత్తి పొలాలను సందర్శించి పంట ఎదుగుదల, మొక్కల సాంద్రత, ఎరువులు, నీటి యాజమాన్యం, సస్యరక్షణ చర్యలను పరిశీలించారు. పంట దిగుబడి పెంచేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు.

ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆర్. నరేష్, ఆత్మ డైరెక్టర్ జానీ గౌడ్, ఏఏంసీ డైరెక్టర్ మల్లేశం, రైతులు కృష్ణ, బాలన్ రావు, అరేపల్లి ఉపసర్పంచ్ వీరేష్, వ్యవసాయ విస్తరణ అధికారి శిరీష, తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో డ్రైనేజీ మరమ్మతులు చేపట్టిన కాంగ్రెస్ నాయకులు

- చందాబాగ్‌లో మురుగునీటి సమస్య పరిష్కారానికి స్వచ్ఛందంగా ముందుకొచ్చిన నాయకులు

మల్కాజిగిరి, నవంబరు 6 (ప్రజా కలం ప్రతినిధి): మౌలాలి 186వ డివిజన్ పరిధిలోని చందాబాగ్ ప్రాంతంలో గత కొన్ని రోజులుగా డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు పొంగిపొర్లుతూ రోడ్లపై ప్రవహిస్తుండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చి డ్రైనేజీ మరమ్మతు పనులు చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు మౌలాలి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోతుల వినోద్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ ఆధ్వర్యంలో పార్టీ సీనియర్ నాయకులందరూ కలిసి తమ సొంత నిధులతో మరమ్మతు పనులు ప్రారంభించారు. ప్రభుత్వ అధికారులపై ఆధారపడకుండా ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నాయకులే స్వయంగా ఖర్చులు భరిస్తూ పనులు చేపట్టడం స్థానికుల ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తూ, సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పోతుల వినోద్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి సలీం, సీనియర్ నాయకులు రైస్ భాయ్, అరుణ్ గౌడ్, హమీద్ భాయ్, ఫారూక్, చంద్రకాంత్, నర్సింగరావు, రమేష్, అక్తర్, మల్లేష్, మైనారిటీ విభాగం అధ్యక్షుడు షకీల్ సిద్దిఖ్, కుమార్, సాయి తదితర కాంగ్రెస్ నాయకులు, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.





కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

దళారులను నమ్మి మోసపోవద్దు : సర్పంచ్ లతా శ్రీశైలం

బీబీనగర్,నవంబర్ 06 (ప్రజాకలం): మండలంలోని భట్టుగూడం గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ పొట్లోళ్ల శ్యామ్ గౌడ్‌తో కలిసి గ్రామ సర్పంచ్ దాసమోని లతా శ్రీశైలం శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం నిర్దేశించిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని కోరారు. రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. రైతులకు గిట్టుబాటు ధర అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ధాన్యం విక్రయ సమయంలో రైతులకు ఏవైనా సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని, వారికి అండగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వాకిటి చంద్రశేఖర్ రెడ్డి, డైరెక్టర్లు శ్రీశైలం, వినోద్, అంబెపు బాలరాజు, శ్రీకాంత్, గండు బసవయ్య, పంజాల శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీ పంజాల వెంకటేశ్ గౌడ్, వార్డు సభ్యులు, గ్రామస్థులు, కాంగ్రెస్ కార్యకర్తలు, పీఏసీఎస్ అధికారులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు.

వలిగొండ నవంబర్ 6 ప్రజాకలం:

మండల పరిధిలోని పాఠశాలలు,కళాశాలల పరిసర ప్రాంతాలు, పాడుబడిన వెంచర్లు మరియు ఇతర బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ



ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్సై శ్రీకాంత్ రెడ్డి హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం వలిగొండ పట్టణ శివారులోని పాడుబడిన వెంచర్ నందు మద్యపానం సేవిస్తున్న ఇద్దరు వ్యక్తుల మీద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

ఢిల్లీ, హర్యానాలో బిజెపి జాతీయ నేతలను మర్యాదపూర్వకంగా కలిసిన బిజెపి తెలంగాణ రాష్ట్ర సీనియర్ నేత కోలన్ శంకర్ రెడ్డి

మహేశ్వరం, నవంబర్ 06, (ప్రజా కలం)


బిజెపి తెలంగాణ రాష్ట్ర సీనియర్ నేత కోలన్ శంకర్ రెడ్డి ఈరోజు



ఢిల్లీలో కేంద్ర పార్టీ ఇంచార్జ్, బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ ఎంపీ ని, అలాగే హర్యానా రాష్ట్రం కర్నాల్ లో బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి సంజయ్ భట్లా ఎంపీ గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పూల మొక్కను అందచేసి, దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ నేతలు మాట్లాడుతూ సమాజంలో కాంగ్రెస్ దాని కూటమి అరాచకాలను, దేశ వ్యతిరేక చర్యలను, బిజెపిపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలను ప్రజలకు వివరించాలని సూచించారు. సర్ పై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని, సమన్వయంతో బిజెపి శ్రేణులు ప్రజలకు మరింత దగ్గర కావాలని పిలుపునిచ్చారు.

బుల్లెట్ బైక్ తో అధిక శబ్దం..ఇద్దరిపై కేసు నమోదు

వలిగొండ నవంబర్ 6 ప్రజాకలం:అధిక స్పీడ్ తో వెళ్లడమే కాకుండా,అధిక శబ్దాలు చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తూ,ప్రజా శాంతికి భంగం కలిగించే విధంగా,ఇతరుల ప్రాణాలకు ప్రమాదం కలిగించే రీతిలో అతివేగంగా,నిర్లక్ష్యంగా బైక్ నడుపుతున్న ఇద్దరు వ్యక్తులను స్థానిక పోలీసులు అరెస్టు చేసి,బుల్లెట్ బైకును సీజ్ చేసినట్లు స్థానిక ఎస్సై శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజలకు,ప్రజా శాంతికి భంగం కలిగించే విధంగా,వాహనదారులు ప్రమాదం కలిగించేలా వాహనాలు నడిపే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని.ప్రజలకు నష్టం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదన్నారు.



రంగాపురం గ్రామంలో ఉన్న డివిఆర్ ఫార్మా కెమికల్ కంపెనీ ని వెంటనే మూసివేయాలని జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు

- మండలంలోని కెమికల్, టైర్ల కంపెనీపై చర్యలు తీసుకోవడంలో కాలుష్య నియంత్రణ మండలి (పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్) నల్గొండ జిల్లా అధికారుల విఫలం?

కెమికల్ కంపెనీ ప్రక్కనే ఉన్న డిఫెన్స్ అకాడమీలో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై ఆందోళన

కెమికల్ కంపెనీలతో మండల ప్రజలు ఇబ్బందులు పట్టించుకోని ప్రజాప్రతినిధులు, మండల అధికారులు

బొమ్మలరామారం,నవంబర్ 06 (ప్రజా కలం)

యాదాద్రి భువనగిరి జిల్లా, బొమ్మలరామారం మండలం, రంగాపురం గ్రామంలో ఉన్న డివిఆర్ కెమికల్ కంపెనీ నుండి వెలుపడే వ్యర్థ రసాయనాలు గ్రామంలో ఉన్న చెరువులో కలవడంతో పూర్తిగా నీరు కలుషితమై నీటిలో ఉన్న చేపలు చనిపోవడం,వ్యర్థ రసాయనాలతో నిండిన చెరువులోని నీరు త్రాగడంతో ఇతర పక్షులు చనిపోవడం జరిగిందని మరియు కెమికల్ కంపెనీ ప్రక్కనే ఉన్న పంట పొలాలు మరియు గ్రామంలోని ప్రజలకు హాని కలిగి క్యాన్సర్, శ్వాసకోస సంబంధిత సమస్యలతోపాటు గ్రామంలో ఉన్న గర్భిణీలు,వృద్ధులు, చిన్నపిల్లలు నమస్యలతో బాధపడుతున్నారని గతంలో గ్రామస్తులు మండల తాహసీల్దార్ కు, కాలుష్య నియంత్ర మండలి అధికారులకు ఫిర్యాదులు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు డివిఆర్ కెమికల్ కంపెనీకి అతి దగ్గరలో ఉన్న డిఫెన్స్ అకాడమీలో విద్యార్థులు విద్య బ్యాసం చేస్తున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు కెమికల్ కంపెనీ నుండి వెలువడుతున్న దుర్వాసనతో విద్యార్థులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు ఇట్టి విషయంపై గ్రామ పెద్దలు,

ప్రజా సంఘాల నాయకులు, పర్యావరణ పరిరక్షణ సమితి మండల సభ్యులు మండలంలో అనేక ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు అక్టోబర్ నెలలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కు డివిఆర్ కెమికల్ కంపెనీ పై చర్యలు తీసుకొని వెంటనే కంపెనీని మూసివేయాలని ఫిర్యాదు చేశారు హైదరాబాదుకు అతి దగ్గరగా ఉన్న మండలంలో ఇలాంటి హాని చేసే విష వ్యర్థ రసాయనాలు కలిగిన కెమికల్ ఇతర కంపెనీలపై వెంటనే చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు జిల్లా కలెక్టర్ ఇప్పటికైనా స్పందించి ఇలాంటి కంపెనీలను వెంటనే మూసివేయాలని ఆదేశాలు జారీ చేయాలని బొమ్మలరామారం మండల ప్రజలు కోరుతున్నారు

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

మైనర్ బాలికకు న్యాయం చేసిన న్యాయస్థానం

- పకడ్బందీ దర్యాప్తు, పటిష్టమైన ప్రాసిక్యూషన్‌తో నేరస్థుడికి శిక్ష.



రాజన్న సిరిసిల్ల జిల్లా, నవంబర్ 06 (ప్రజా కలం ప్రతినిధి) : బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే చట్టం ఎంత కఠినంగా వ్యవహరిస్తుందో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పోక్సో కేసు తీర్పు మరోసారి నిరూపించింది. మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన నిందితుడికి సిరిసిల్ల పోక్సో ప్రత్యేక న్యాయస్థానం 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. అంతేకాకుండా రూ. 1,000 జరిమానా, బాధిత బాలికకు రూ. 30 వేల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. పోలీసుల సమర్థవంతమైన దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణ, ప్రాసిక్యూషన్ సమర్థ వాదనలతో నిందితుడికి శిక్ష పడింది, ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లికి చెందిన ముద్రకోల చరణ్ సిరిసిల్ల పట్టణానికి చెందిన ఓ మైనర్ బాలికతో పరిచయం పెంచుకొని లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు.

ఈ ఘటనపై బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేములవాడ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు,ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు సమగ్రంగా దర్యాప్తు చేపట్టి కీలక ఆధారాలను సేకరించారు. డీఎస్పీ నాగేంద్రచారి దర్యాప్తు అనంతరం న్యాయస్థానంలో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో కోర్టు మానిటరింగ్ విభాగం కీలక పాత్ర పోషించింది. ఎస్ఐ శ్రవణ్ యాదవ్ ఆధ్వర్యంలో కోర్టు సిబ్బంది 16 మంది సాక్షులను న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఝాన్సీ సమర్థవంతంగా వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలను, సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించిన పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్ నేరం రుజువైనట్లు నిర్ధారించి నిందితుడు చరణ్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ. 1,000 జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించారు. బాధిత బాలికకు రూ. 30 వేల పరిహారం చెల్లించాలని ఆదేశించారు.

చట్టం ముందు తప్పించుకోలేరు..

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ మహిళలు, బాలికల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఎలాంటి వేధింపులు ఎదురైనా బాలికలు, మహిళలు భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. నేరాలకు పాల్పడిన వారు ఎంతటివారైనా చట్టం నుంచి తప్పించుకోలేరని, పకడ్బందీ దర్యాప్తు, పటిష్టమైన ప్రాసిక్యూషన్‌తో నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పోలీసు బృందానికి ఎస్పీ అభినందనలు..

ఈ కేసులో సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ వీరప్రసాద్, ఎస్ఐ శ్రావణ్ యాదవ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఝాన్సీ, కోర్టు కానిస్టేబుల్ మహేందర్, కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్స్ నవీన్, వెన్నెల, భరోసా లీగల్ సపోర్ట్ పర్సన్ లహరికలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

బాలికలకు భరోసా.. నేరస్థులకు హెచ్చరిక!

ఈ తీర్పు కేవలం ఒక కేసులో శిక్ష విధింపుకే పరిమితం కాదు. బాధిత బాలికకు న్యాయం అందించడంలో పోలీసు దర్యాప్తు, న్యాయస్థాన విచారణ, ప్రాసిక్యూషన్ సమన్వయం ఎంత కీలకమో చాటిచెప్పింది. బాలికలపై నేరాలకు పాల్పడేవారికి చట్టం కఠినంగా శిక్షిస్తుందనే హెచ్చరికను పంపడంతో పాటు, బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే న్యాయం సాధ్యమనే భరోసాను కల్పించింది.



రాజన్న ఆలయ క్యాలెండర్-2027 ను ఆవిష్కరించిన ప్రభుత్వ విప్

వేములవాడ, నవంబర్ 06 (ప్రజా కలం ప్రతినిధి) : శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం నూతన సంవత్సర క్యాలెండర్-2027ను వేములవాడ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఆలయ అనుబంధ దేవాలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం క్యాలెండర్‌ను ఒక్కొక్కటి రూ.100 చొప్పున అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఇందులో నక్షత్రాలు, ఏకాదశి తిథులు, ఉగాది పండుగ ముహూర్తాలతోపాటు రాజన్న ఆలయానికి సంబంధించిన సమాచారం, పూజా వివరాలను పొందుపరిచినట్లు పేర్కొన్నారు. క్యాలెండర్ల ప్రాధాన్యాన్ని చాటుతూ తొలి 21 క్యాలెండర్లను ఆయన స్వయంగా కొనుగోలు చేశారు. అంతకుముందు భీమేశ్వరాలయానికి చేరుకున్న ప్రభుత్వ విప్‌కు అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభం, స్వస్తివచనాలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పూజల అనంతరం వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ ఈవో రమాదేవి, డీఈవో ప్రతాప నవీన్ కుమార్ స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు, సూపరింటెండెంట్లు, ఉద్యోగులు, వేద పండితులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అహ్మదీపూర్‌లో వీఓ భవన నిర్మాణానికి శంకుస్థాపన

గజ్వేల్ :06 నవంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్: మండలంలోని అహ్మదీపూర్ గ్రామంలో మహిళా సంఘాల



కార్యకలాపాలకు అవసరమైన వసతులు కల్పించే ఉద్దేశంతో వీఓ (విలేజ్ ఆర్గనైజేషన్) భవన నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. గ్రామ సర్పంచ్ ప్రభాకర్ భూమిపూజ నిర్వహించి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధితో పాటు మహిళా సంఘాల కార్యకలాపాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి మాజీ మండల అధ్యక్షుడు మద్ది రాజిరెడ్డి, పంచాయతీ ఏఈ రాకేష్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పాల రమేష్‌గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు నిజాముద్దీన్, సీసీ నిర్మల, వార్డు సభ్యులు రాంచంద్రం, ప్రవంతి, వెంకట్‌గౌడ్, నాయకులు కిష్టారెడ్డి, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బిక్షపతి, మహిపాల్‌రెడ్డి, మల్లయ్య, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి.

దుబ్బాక ప్రజాకలం నవంబర్ 06. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో శుక్రవారం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ రేణుక రాజగౌడ్, ఏపీఎం యాదగిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ధాన్యం విక్రయించే సమయంలో దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని, తమ ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మర్యాల స్వామి, సీసీ నాగరాజు, వార్డు సభ్యులు కరుణాకర్, సునంద, నరసింహులు, తప్పుడు సుధాకర్, సీఏ మమత, రైతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరంలో ఎమ్మెల్సీ ఎన్నికల సమన్వయ కమిటీ

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అత్యధిక ఓట్ల నమోదు లక్ష్యంగా కార్యాచరణ

- సామ రామ్మోహన్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

- మహేశ్వరం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు రాజు గొల్లూరి

మహేశ్వరం,
నవంబర్ 06, (ప్రజా కలం)

రాబోయే మహబూబ్ నగర్ – రంగారెడ్డి–హైదరాబాద్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించడమే లక్ష్యంగా మహేశ్వరం మండలంలో ఎన్నికల సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. మహేశ్వరం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు, చిన్నతూప్ర గ్రామ సర్పంచ్ రాజు గొల్లూరి అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించి, ఎమ్మెల్సీ ఎన్నికల విజయానికి అనుసరించాల్సిన కార్యాచరణపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రాజు గొల్లూరి మాట్లాడుతూ.. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మహేశ్వరం మండలం నుంచి అత్యధిక సంఖ్యలో గ్రాడ్యుయేట్ ఓట్లు నమోదు చేయించడంతో పాటు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. గ్రామాల వారీగా గ్రాడ్యుయేట్లను గుర్తించి, ఓటు హక్కు కల్పించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఓటరు నమోదు ప్రక్రియతో పాటు ఎన్నికల ప్రచారంలోనూ ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పనిచేస్తూ గ్రాడ్యుయేట్ ఓటర్లను చైతన్యపరచాలని, ఎన్నికల వరకు నిరంతరం ప్రజల్లో ఉంటూ పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. సమన్వయంతో, సమష్టి కృషితో ముందుకు సాగితే మహేశ్వరం మండలంలో కాంగ్రెస్ పార్టీకి మంచి ఫలితాలు సాధించడం సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు కుమార్ యాదవ్, ఏర్పుల శ్రీశైలం, నాగేందర్, కాట్రవత్ ప్రభు, బుడుగు రాఘవేందర్, పెంజర్ల మల్లేష్, గణేష్, శ్రీను, రాకేష్, శశికాంత్, రవి నాయక్, రవి, ప్రకాష్ నాయక్, షరీఫ్ అన్వార్, సుధాకర్, విజేందర్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ఏర్పాట్లను పర్యవేక్షించిన నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, ఐ.పి.యస్.

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 06:

5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్--2026 ముగింపు వేడుకల నేపథ్యంలో నిజామాబాద్‌కు విచ్చేయనున్న వివిధ జిల్లాల పోలీస్ క్రీడాకారులకు అవసరమైన వసతి, మౌలిక వసతుల ఏర్పాట్లను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐ.పి.యస్. క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జానకంపేటలోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్ (జుజ)ను సందర్శించిన సీపీ, క్రీడాకారుల బస కోసం చేపడుతున్న ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే



క్రీడాకారులకు ఆతిథ్యంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వసతి గదులు, తాగునీరు, పారిశుద్ధ్యం, నిరంతర విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలను పక్కాగా సమకూర్చాలని స్పష్టం చేశారు. ప్రతి విభాగానికి ప్రత్యేక బాధ్యతలు కేటాయించామని, అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి ఈ 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను విజయవంతం చేయాలని సీపీ సాయి చైతన్య పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బోధన్ ఏసిపి శ్రీనివాస్, సి.టి.సి ఎ.సి.పి రాజశేఖర్, బోధన్ రూరల్ సీఐ విజయబాబు, రుద్రూర్ సీఐ కృష్ణ, బోధన్ ఎస్హెచ్ఓ వెంకట్ నారాయణ, ఏడపల్లి ఎస్సై రమ తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

దివంగత మాణిక్యమ్మకు ప్రభు దీవెనలు కలుగును గాక

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 06:

అపారమైన ప్రేమ కృతజ్ఞతతో ప్రియమైన కన్న తల్లి మాణిక్యమ్మ సుంకరి (77) గారి 2వ జ్ఞాపకార్థం సమావేశం జరిపారు. గురువారం సాయంత్రం ముంబై శాంతకృజ్ లో అగ్ని జ్వాల మినిస్ట్రీస్ చర్చి వాకోల ఆధ్వర్యంలో మాణిక్యమ్మ 2వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ ఆమె జెస్ట కుమారుడు సుంకరి ప్రభుదాస్ ఈ సందర్భంగా ఆమెను ప్రేమతో, కన్నీటితో స్మరించుకున్నారు. వీరు వాస్తవానికి జిల్లా నిజామాబాద్ మంథెన గ్రామ వాస్తవ్యులు. కానీ ముంబై మహానగరంలోనే స్థిర నివాసమైన ఉన్నారు. ఐతే ఆమె ప్రేమపూర్వక జ్ఞాపకార్థం నిమిత్తంగా జరిగిన ప్రార్థనలో తమ జీవితంలో కుటుంబం నేర్పిన అద్భుతమైన పాఠాల్ని, అనుభూతుల్ని ఫ్యామిలీ సభ్యులు నెమరు వేసుకున్నారు. ఆమె ఆత్మ శాంతి కోసం చర్చి సభ్యులు మనసార ప్రార్థించారు. ఈ ప్రార్థనలో పలు ఫ్యామిలీలు, అభిమానులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు. ముఖ్యంగా కుమార్తెలు యేసుమణి, వినోద, కుమారులు ప్రభుదాస్, విద్యా సాగర్, సుధాకర్, సదానంద్, కోడళ్లు మరియమ్మ, సహీదా, భారతి, రాధ, మనవళ్ళు అనూప్, రయాన్, వెనెస్సా తదితరులు ఉన్నారు.



ఆర్మూర్‌లో బియ్యం ధరలపై అధికారుల ప్రత్యేక నిఘా: హెచ్చరికలు జారీ

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 06:

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలో బియ్యం ధరలు ఇష్టారాజ్యంగా పెరగకుండా ఉండేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మార్కెట్‌లో బియ్యం ధరలను అదుపులో ఉంచడంతో పాటు, సామాన్య ప్రజలపై అదనపు భారం పడకుండా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగానే



పట్టణంలోని పలు కిరాణా, హోల్‌సేల్ బియ్యం దుకాణాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన నిర్దేశిత ధరలకే బియ్యాన్ని విక్రయించాలని, ఎలాంటి కృత్రిమ కొరత సృష్టించకూడదని వ్యాపారులను గట్టిగా ఆదేశించారు.

ధరల పట్టిక తప్పనిసరి:

వినియోగదారులకు ధరలపై స్పష్టమైన అవగాహన ఉండేలా ప్రతి దుకాణం ముందు విధిగా బియ్యం ధరల పట్టికను ప్రదర్శించాలని అధికారులు స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలను ప్రతీ ఒక్కరూ ఖచ్చితంగా పాటించాలన్నారు.

అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు:

నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ మొత్తానికి బియ్యం విక్రయిస్తూ వినియోగదారులను మోసం చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలకు లోబడి వ్యాపారాలు నిర్వహించి, ప్రజలకు సహకరించాలని ఈ సందర్భంగా కోరారు.

దళారులను ఆశ్రయించి రైతులు మోసపోవద్దు

వలిగొండ నవంబర్ 6 ప్రజా కలం:దళారులను ఆశ్రయించి రైతులు మోసపోవద్దని,టేకుల సోమరం గ్రామ సర్పంచి పనుమటి మమతా నరేందర్ రెడ్డి అన్నారు.గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకోచ్చి ప్రభుత్వ మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని,సూచించారు. వరి ధాన్యం అమ్మకాలలో రైతులు మధ్య దళారీలను ఆశ్రయించి నష్టపోవద్దన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు సజావుగా జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏపిఎం అంజయ్య,వార్డు సభ్యులు పనుమటి కలమ్మ,శ్యామల సుదర్శన్ రెడ్డి,సీసీలు బాబు, రవీందర్,మహేందర్ రెడ్డి, చిట్టెడు యాదిరెడ్డి,జక్క రామచంద్ర రెడ్డి,దంతూరి సువర్ణ,సరిత,రైతులు, గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.



మాధవ్‌నగర్ ఆర్ఓబీ పనుల పునఃప్రారంభం

: సామాజిక కార్యకర్త మనోజ్ చిత్రపటానికి పాలాభిషేకం



నిజామాబాద్,
(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 06:

నగరంలోని మాధవ్‌నగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) నిర్మాణ పనుల పునఃప్రారంభానికి, నిధుల విడుదలకు సామాజిక మాధ్యమాల ద్వారా నిరంతర పోరాటం చేసిన మోర్తాడ్ మండలానికి చెందిన సామాజిక కార్యకర్త సత్పుతే మనోజ్ క్షత్రియకు విశేష గుర్తింపు లభించింది. ప్రజా సమస్యపై ఆయన చేసిన కృషిని అభినందిస్తూ నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ నాయకులు బాజిరెడ్డి జగన్ ఆధ్వర్యంలో మనోజ్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

సుదీర్ఘ నిరీక్షణకు తెర:

మాధవ్‌నగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు ఎన్నో రోజులుగా నిలిచిపోవడంతో వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను గుర్తించిన మనోజ్ క్షత్రియ సోషల్ మీడియా వేదికగా డిజిటల్ ఉద్యమాన్ని చేపట్టారు. బ్రిడ్జి దుస్థితిని వివరిస్తూ, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ ఆయన రూపొందించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడమే కాకుండా ఉన్నతాధికారుల, ప్రభుత్వ దృష్టిని ఆకర్షించాయి.

పోరాటానికి దక్కిన ఫలితం:

మనోజ్ చేసిన నిరంతర ప్రయత్నాల ఫలితంగా ప్రభుత్వం స్పందించి, నిలిచిపోయిన పనులకు నిధులు విడుదల చేయడమే కాకుండా పనులను సైతం పునఃప్రారంభించింది. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సోషల్ మీడియాను వేదికగా చేసుకుని, కేవలం మాధవ్‌నగర్ బ్రిడ్జి సమస్యే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోని పలు ప్రజా సమస్యలపై మనోజ్ నిరంతరం గళమెత్తుతున్నారు.

ఈ సందర్భంగా బాజిరెడ్డి జగన్ మాట్లాడుతూ.. సమాజంలో మార్పు కోసం, ప్రజల కష్టాలను తీర్చడం కోసం సోషల్ మీడియాను సరైన మార్గంలో వాడుతూ మనోజ్ చేస్తున్న పోరాటం అభినందనీయమన్నారు. ఎన్నో ఏళ్ల నాటి సమస్యను పరిష్కరించేందుకు కారకుడైన మనోజ్‌కు స్థానిక ప్రజలు, వాహనదారులు కృతజ్ఞతలు తెలుపుతూ 'బిగ్ సెల్యూట్' చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన చైర్మన్ పాట్లోళ్ల శ్యామ్ గౌడ్

- చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం - రైతులు అధైర్య పడొద్దు

-ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



బీబీనగర్, నవంబర్ 06 (ప్రజాకలం): మండలంలోని మక్తనంతారం, వెంకిర్యాల, పల్లెగూడెం,రుద్రవెల్లి, లక్ష్మీదేవిగూడెం, చిన్నరావులపల్లి, బట్టుగూడెం, నీల తండా, మాదారం, రావిపహాడ్ మగ్దంపల్లి, గొల్లగూడెం, గూడూరు, జైనపల్లి, పడమటిసోమారం గ్రామాలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం పీఏసీఎస్ చైర్మన్ పొట్లోళ్ల శ్యామ్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,461, బి గ్రేడ్ ధాన్యానికి రూ.2,441 మద్దతు ధర చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు.అలాగే సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన చివరి గింజ వరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే వడ్లు విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా సకాలంలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కొనుగోళ్లలో ఏవైనా సమస్యలు ఎదురైతే రైతులు నేరుగా తనను లేదా పీఏసీఎస్ డైరెక్టర్లను సంప్రదించాలని కోరారు. కొనుగోళ్లలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించేందుకు రైతులందరూ సహకరించాలని చైర్మన్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గోలి పింగల్ రెడ్డి ,పిఏసిఎస్ వైస్ చైర్మన్ వాకిటి చంద్రశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురకంటి సత్తి రెడ్డి,అధికారులు,డైరెక్టర్లు, ఆయా గ్రామాల సర్పంచులు,ఉపసర్పంచ్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.





వేల్పూరులో పిఆర్టియు టీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు ఘనంగా సత్కారం

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 06:

పిఆర్టియు టిఎస్ వేల్పూర్ మండల శాఖ ఆధ్వర్యంలో ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు వేల్పూర్ ఉన్నత పాఠశాలలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వేల్పూర్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోడ దేవానందం, అప్పెన రాకేష్ ల నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంబెల్లి శంకర్, గంగోని కిషన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా జిల్లా నాయకులు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పిఆర్టియు టీఎస్ సంఘం ఎల్లప్పుడూ నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. అనంతరం నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన రాష్ట్ర కార్యవర్గ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని ఎన్నికైన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఎన్నికైన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీరే:

రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు: టి. హరిచరణ్ (జి హెచ్ ఎం, కుకునూర్), జె. రమేష్ కుమార్ (జి హెచ్ ఎం, పచ్చల నడుకూడ), టి. లక్ష్మీ నారాయణ (ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ ఎం మోతే), డా. పతాని గంగాధర్ (కుకునూర్), నరసింహారావు (మోతే), ఎస్. రవికుమార్ (పచ్చల నడుకూడ), కె. దేవరాజు (అంక్సాపూర్), బి. విజయ్ కుమార్ (అమీనాపూర్), ఎం. సురేష్ కుమార్ (మోతే). రాష్ట్ర ఉపాధ్యక్షులు: జి. రవీందర్ (కుకునూర్), ఏ. దత్త ప్రసాద్ (వేల్పూర్). రాష్ట్ర కార్యదర్శులు: రేగుల్ల గంగాధర్ (వేల్పూర్), కే. నరేందర్ (రామన్నపేట్), ఆర్. రాంచందర్ (పడగల్). ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎన్.వి.కృష్ణారెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు చిలుక శ్రీనివాస్, ధర్పల్లి మండల ప్రధాన కార్యదర్శి సతీష్, వేల్పూర్ మండల కార్యవర్గ సభ్యులు సుధాకర్, చంద్ర దేవ్, రాజేంద్ర, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు. సన్మాన కార్యక్రమం అనంతరం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులను మండల, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రజాప్రతినిధుల సమక్షంలో ఘనంగా సత్కరించారు.

పేదల సొంతింటి కలకు సాకారం

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేసిన సర్పంచ్ గోపీ నాయక్

బీబీనగర్,నవంబర్ 06 (ప్రజాకలం): పేద కుటుంబాల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా రామునిగుండ్ల తండాలో లబ్ధిదారులు జ్యోతి--నగేష్ దంపతుల ఇంటి నిర్మాణానికి సర్పంచ్ బానోతు గోపీ నాయక్ శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన పేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇంటి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రావణి--శ్రీనివాస్, వార్డు సభ్యుడు బానోతు రవి నాయక్, పంచాయతీ కార్యదర్శి టి.విద్య, చంద్రు నాయక్, కారోబార్ లింగ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



జర్నలిస్టుల హక్కుల సాధనే టిడబ్ల్యూజేఎఫ్ లక్ష్యం

-సంఘం బలోపేతం, జర్నలిస్టుల సంక్షేమం కోసం సమిష్టిగా పని చేయాలి

-సర్కారు వివక్ష పై సమరానికి సిద్ధం కావాలి -రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)

రాష్ట్రంలో జర్నలిస్టుల హక్కుల సాధనే లక్ష్యంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ పని చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. అన్ని జిల్లాల్లో టిడబ్ల్యూజేఎఫ్ సంఘాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కుత్బుల్లాపూర్ లోని సూరారంలోని బాబు జగ్జీవన్ రామ్-అంబేద్కర్ భవన్ లో టీడబ్ల్యూజేఎఫ్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నాల్గవ మహాసభ విజయవంతంగా జరిగింది.

ఈ మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మామిడి సోమయ్య మాట్లాడుతూ... జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం సంఘం నిరంతరం ఉద్యమిస్తుందని అన్నారు. టీడబ్ల్యూజేఎఫ్ ఏ రాజకీయ పార్టీకి అనుబంధం కాదని, ఏ ఒక్క పత్రికకు అనుకూలం కాదని ఆయన స్పష్టం చేశారు. జర్నలిస్టుల కోసమే పుట్టిన టీడబ్ల్యూజేఎఫ్ సంఘం పాలకుల పక్షం ఉండదని జర్నలిస్టుల వక్షాన సమస్యలపై పోరాడుతుందన్నా రు. జర్నలిస్టుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ, జర్నలిస్టుల ఇళ్ళస్థలాలు, అక్రెడిటేషన్, హెల్త్ కార్డులు తదితర సంక్షేమ పథకాల సాధనకు పోరాటం చేస్తామని, ఈపోరాటాలకు జర్నలిస్టులు ఐక్యంగా సిద్ధం కావాలని మామిడి సోమయ్య పిలుపునిచ్చారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ మాట్లాడుతూ... రాష్ట్రంలోని సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. గతంలో సంఘంలో కీలక పదవులు చేపట్టిన కొందరు వ్యక్తులు వ్యక్తిగత ప్రయోజనాల కోసం సంఘ ప్రతిష్ఠను దెబ్బతీశారని, ప్రస్తుతం టిడబ్ల్యూజేఎఫ్ ను మళ్లీ బలోపేతం చేసి జర్నలిస్టుల విశ్వాసాన్ని నిలబెట్టే దిశగా అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమీది అశోక్ అధ్యక్షతన ప్రముఖుల సమక్షంలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యింది.



అధ్యక్షులుగా అంగూరు గోవిందరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ గా శివ, ఉపాధ్యక్షులుగా దప్పు రామస్వామి, మంజుల రెడ్డి, దివాకర్, వెంకట నరసయ్య, ప్రధాన కార్యదర్శిగా బ్రహ్మచారి, కోశాధికారిగా కొండా సంజీవకుమార్, సంయుక్త కార్యదర్శిగా శ్రీశైలం, ప్రచార కార్యదర్శిగా మధు, కార్యవర్గ సభ్యులు లక్ష్మి, సుస్మిత, సాయిరాజ్, ఆనంద్, కుమార్ గౌడ్, శ్యాం ముదిరాజ్, ఎలక్ట్రానిక్ మీడియా నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రవీణ్ రాజ్, రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా కోశాధికారిగా తేజోమూర్తి, జిల్లా ప్రచార కార్యదర్శిగా వీరేష్ ముదిరాజ్, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా వర్కింగ్ ప్రెసిడెంట్ గా దుర్గారావు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా కోశాధికారిగా శ్యామల వెంకటేష్ నియమితులు అయ్యారు. సందర్భంగా టిడబ్ల్యూ జెఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు మామిడి సోమయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ కమిటీని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు కొంచెం శ్రీనివాస్, జగదీష్ గుప్తా, మేడ్చల్ జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు కావాలి మోహన్, కూకట్పల్లి నియోజకవర్గ అధ్యక్షులు యాకయ్య, సీనియర్ జర్నలిస్టు శివ పార్వతి, స్వప్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



దీపావళికి మీ ఇంటికి కొత్త కళ!

- భారీ ఖర్చు లేకుండానే సరికొత్త లుక్..
-ఐబీఓ అదిరిపోయే హోమ్ మేకోవర్!

హైదరాబాద్, నవంబర్ 6 (ప్రజా కలం ప్రతినిధి)

దీపావళి పండుగ వేళ ఇంటిని అందంగా, ఆధునికంగా తీర్చిదిద్దుకోవాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. అయితే ఇందుకోసం భారీగా ఖర్చు చేసి పూర్తి స్థాయి ఇంటి పునరుద్ధరణ చేపట్టాల్సిన అవసరం లేదంటోంది ఓమ్నీఛానల్ గృహ నిర్మాణ, మెరుగుదల ఉత్పత్తుల మార్కెట్‌ప్లేస్ ఐబీఓ (ఐబీఓ). చిన్నచిన్న మార్పులతోనే ఇంటికి సరికొత్త రూపాన్ని తీసుకురావచ్చని సూచిస్తోంది. ఇంటి రూపురేఖలను మార్చడంలో పెయింటింగ్ కీలక పాత్ర పోషిస్తుంది. లివింగ్ రూమ్‌కు ప్రకాశవంతమైన రంగులు, పడకగదికి ఆహ్లాదకరమైన షేడ్స్ ఎంచుకోవడం ద్వారా కొత్త వాతావరణాన్ని సృష్టించవచ్చు. ఇందుకోసం ఐబీఓలో ఇంటీరియర్ ఎమల్షన్ పెయింట్లు, ప్రైమర్లు, పెయింటింగ్ సామగ్రి అందుబాటులో ఉన్నాయి. అలాగే, ఆధునిక లైటింగ్‌తో ఇంటి అందాన్ని మరింత పెంచుకోవచ్చు. ఎల్ఈడీ బల్బులు, ప్యానెల్ లైట్లు, పెండెంట్ లైట్లు, స్ట్రిప్ లైట్లను ఉపయోగించి గదులు, క్యాబినెట్లు, అలంకరణ ప్రదేశాలకు ప్రత్యేక ఆకర్షణ తీసుకురావచ్చు. వంటగదిలో పాత కుళాయిల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడం, సింక్‌లను మార్చడం, బాత్రూమ్‌లో ఆధునిక షవర్‌హెడ్‌లు, వాష్‌బేసిన్లు, టవల్ ర్యాక్‌లు, స్టోరేజ్ షెల్ఫ్‌లు అమర్చడం వంటి మార్పులు సౌకర్యాన్ని పెంచుతాయి. ఫర్నిచర్, క్యాబినెట్లకు కొత్త రూపం ఇవ్వడానికి డెకరేటివ్ లామినేట్లు, వార్నిష్‌లు, వుడ్ ఫినిష్‌లు ఉపయోగపడతాయి. ఆన్‌లైన్ షాపింగ్‌తో పాటు ఐబీఓ స్టోర్లలో ఉత్పత్తులను ప్రత్యక్షంగా పరిశీలించి కొనుగోలు చేసే అవకాశాన్ని కూడా సంస్థ కల్పిస్తోంది. అంతేకాకుండా, అక్టోబర్ 8 నుంచి నవంబర్ 8, 2026 వరకు ప్రతి కొనుగోలుపై ఉచిత హామీతో కూడిన బహుమతిని అందిస్తోంది. ఈ దీపావళికి తక్కువ ఖర్చుతో ఇంటికి కొత్త అందాన్ని తీసుకురావాలనుకునే వారికి ఐబీఓ ఉత్పత్తులు మంచి ఎంపికగా నిలవనున్నాయి.

దిల్‌సుఖ్‌నగర్‌లో వేగా జ్యువెలర్స్ కొత్త షోరూం

- నటి ప్రగ్యా జైస్వాల్ చేతుల మీదుగా ప్రారంభం
- బాలకృష్ణ ఆశీస్సులతో అంగరంగ వైభవంగా వేడుకలు
- మేకింగ్ ఛార్జీలపై 2.99 నుంచి 11.99 శాతం వరకు రాయితీ



హైదరాబాద్, నవంబర్ 6 (ప్రజా కలం ప్రతినిధి)

నగరంలోని దిల్‌సుఖ్‌నగర్‌లో వేగా జ్యువెలర్స్ నూతన షోరూం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ సినీనటి ప్రగ్యా జైస్వాల్ ముఖ్య అతిథిగా హాజరై షోరూంను ప్రారంభించారు. నందమూరి బాలకృష్ణ (బాలయ్య బాబు) ఆశీస్సులు, శుభాకాంక్షలతో ప్రారంభోత్సవ వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సంస్థ ఛైర్మన్ బండ్లమూడి రామ్మోహన్, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ వనమా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుధాకర్ వనమా తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో సంస్థకు ఇది ఏడో షోరూం కాగా, హైదరాబాద్‌లో రెండోది. నగరంలోని వినియోగదారులకు మరింత చేరువ కావాలనే లక్ష్యంతో నూతన షోరూంను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లు

ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని వినియోగదారులకు ప్రత్యేక రాయితీలను ప్రకటించారు. బంగారు ఆభరణాల తయారీ ఛార్జీలపై 2.99 శాతం నుంచి 11.99 శాతం వరకు డిస్కౌంట్ అందిస్తున్నట్లు వెల్లడించారు. రూ. 47,999 నుంచి ప్రారంభమయ్యే జ్యువెలరీ పర్చేజ్ కార్డుతో పాటు పలు ఆకర్షణీయమైన ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక ఆఫర్లు నవంబర్ 6 నుంచి 30వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

మెగా గోల్డ్ లక్కీ డ్రా

వినియోగదారులను ఆకర్షించేలా మెగా గోల్డ్ లక్కీ డ్రాను సైతం నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. ఇందులో విజేతలకు ఐదు గ్రాముల చొప్పున 24 క్యారెట్ల బంగారు బిస్కెట్లు, వెండి బిస్కెట్లను బహుమతులుగా అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొత్తం 24 మంది విజేతలకు బంగారు బహుమతులు, మరో 500 మంది విజేతలకు వెండి బహుమతులు అందించేలా ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించినట్లు వెల్లడించారు.

సంప్రదాయ, ఆధునిక ఆభరణాల కలెక్షన్లు

నూతన షోరూంలో వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా సంప్రదాయ, ఆధునిక డిజైన్లతో రూపొందించిన బంగారు, వజ్రాభరణాలతో పాటు వివిధ రకాల విలువైన ఆభరణాలను అందుబాటులో ఉంచారు. వివాహాలు, శుభకార్యాలు, పండుగలు, ఇతర ప్రత్యేక సందర్భాలకు అనువైన విభిన్న డిజైన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. నాణ్యమైన ఆభరణాలు, అత్యుత్తమ పనితనం, ఆకర్షణీయమైన డిజైన్లతో వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లో నూతన షోరూం ప్రారంభంతో హైదరాబాద్‌లో తమ వ్యాపార విస్తరణకు మరో ముందడుగు పడిందని వారు తెలిపారు.



జయశంకర్ కాలనీలో గత మూడు నెలలుగా పొంగిపొర్లుతున్న డ్రైనేజ్

- వ్యాపారస్తులకు వాన దారులకు భరించలేని డ్రైనేజ్ దుర్వాసన
- అల్మాస్గూడ ప్రధాన రహదారి కావడంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు
- ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోని జిహెచ్ఎంసి అధికారులు
- డ్రైనేజ్ సమస్యను వెంటనే పరిష్కారం చేయాలి
- జయశంకర్ కాలనీ అధ్యక్షుడు కే సంజీవ ఉపాధ్యక్షుడు చెరుకు జంగయ్య



మహేశ్వరం, నవంబర్ 06, (ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండల కేంద్రం, బడంగ్ పేట జిహెచ్ఎంసి పరిధిలోని అల్మాస్గూడ ప్రధాన రహదారి, జయశంకర్ కాలనీలో గత మూడు నెలలుగా డ్రైనేజ్ పొంగిపొర్లుతూ రోడ్లపైకి వస్తోంది. ప్రధాన రహదారి కావడంతో రోజూ వందలాది వాహనాలు, వేలాది మంది ప్రయాణికులు ఈ రోడ్డు గుండా వెళ్తున్నారు. డ్రైనేజ్ నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని జయశంకర్ కాలనీ అధ్యక్షుడు కే సంజీవ ఉపాధ్యక్షుడు చెరుకు జంగయ్య అన్నారు.

భరించలేని దుర్వాసనతో వ్యాపారస్తులు, బాటసారుల అవస్థలు

డ్రైనేజ్ నుండి వస్తున్న భరించలేని దుర్వాసనతో స్థానిక వ్యాపారస్తులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు. షాపుల ముందు మురుగునీరు నిలిచిపోవడంతో వ్యాపారాలు దెబ్బతింటున్నాయని వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసనతో ఆ రోడ్డులో నడవలేకపోతున్నామని ప్రజలు చెబుతున్నారు. దోమలు పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులకు నిత్యం ప్రమాదాలు జరుగుతున్న ఎవరు పట్టించుకోవడంలేదని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని జిహెచ్ఎంసి అధికారులు

ఈ సమస్యపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా జిహెచ్ఎంసి అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే మూడు నెలలుగా సమస్య ఇలాగే కొనసాగుతోందని మండిపడుతున్నారు.

వెంటనే డ్రైనేజ్ సమస్యను పరిష్కరించాలి – కాలనీ అధ్యక్షుడు

జయశంకర్ కాలనీ అధ్యక్షుడు కే. సంజీవ్, ఉపాధ్యక్షుడు చెరుకు జంగయ్య మాట్లాడుతూ... "వెంటనే జిహెచ్ఎంసి అధికారులు స్పందించి డ్రైనేజ్ సమస్యను పరిష్కరించాలి. లేకపోతే ప్రజలతో కలిసి ఆందోళన చేస్తాం" అని హెచ్చరించారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని స్థానిక ప్రజలు వాహనదారులు వ్యాపారస్తులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని దుర్వాసన భరించలేక రోగాలు వస్తున్నాయని ఆయన పట్టించుకోవడంలేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే డ్రైనేజ్ సమస్యను పరిష్కారం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాగిరెడ్డి, విష్ణు, యాదయ్య, బాలయ్య, కాలనీ ప్రజలు వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.



మచ్చ బొల్లారం ట్రాన్స్‌ఫర్ స్టేషన్ తరలింపునకు ప్రత్యామ్నాయ స్థలాల పరిశీలన

- ఎన్‌హెచ్ఆర్‌సీ సభ్యురాలు విజయ భారతి సయాని క్షేత్రస్థాయి పర్యటన

మల్కాజిగిరి, నవంబరు 6 (ప్రజా కలం ప్రతినిధి): మచ్చ బొల్లారంలోని హిందూ శ్మశానవాటిక ప్రాంతం వ్యర్థాల డంపింగ్ యార్డుగా మారుతోందన్న ఆందోళనల నేపథ్యంలో, అక్కడ కొనసాగుతున్న వ్యర్థాల తరలింపు కేంద్రాన్ని మరో ప్రాంతానికి మార్చేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి గుర్తించిన నాలుగు ప్రత్యామ్నాయ స్థలాలను జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ ఆర్‌సీ) సభ్యురాలు విజయ భారతి సయాని శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ట్రాన్స్‌ఫర్ స్టేషన్ తరలింపునకు గుర్తించిన నాలుగు ప్రాంతాలను ఆమె సందర్శించి, ఆయా స్థలాల భౌగోళిక పరిస్థితులు, వ్యర్థాల నిర్వహణ కేంద్రం ఏర్పాటుకు ఉన్న అనుకూలతలను పరిశీలించారు. ప్రస్తుత ట్రాన్స్‌ఫర్ స్టేషన్ పరిస్థితులు, అక్కడి వ్యర్థాల నిర్వహణ, తరలింపు ప్రతిపాదనకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్ మను చౌదరి, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి ఆమెకు వివరించారు. హిందూ శ్మశానవాటిక ప్రాంతంలో వ్యర్థాల నిర్వహణ కారణంగా స్థానికంగా వ్యక్తమవుతున్న ఆందోళనలు, ప్రజల మనోభావాలు, ప్రజారోగ్యంపై పడే ప్రభావం తదితర అంశాలపై ఈ సందర్భంగా సమీక్షించారు. పరిసరాల పరిశుభ్రతకు విఘాతం కలగకుండా, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అనువైన ప్రత్యామ్నాయ స్థలాన్ని ఎంపిక చేయాల్సిన అవసరంపై దృష్టి సారించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, అదనపు కమిషనర్ (ఆరోగ్యం, పారిశుధ్యం) సి.ఎన్. రఘు ప్రసాద్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



మాజీ సర్పంచ్ బస్వ శ్రీశైలం గౌడ్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, నవంబర్ 06, (ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండలం అమీర్‌పేట్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బస్వ శ్రీశైలం గౌడ్ మరణించిన విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గ శాసనసభ్యురాలు పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి హుటాహుటిన అమీర్‌పేట్ గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ పార్థివదేహంపై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, కుటుంబ పెద్దను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న వారిని ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గ్రామ సర్పంచ్‌గా ప్రజలకు సేవలందించిన శ్రీశైలం గౌడ్ మరణం గ్రామానికి తీరని లోటని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించండి

డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావును కలిసిన లక్ష్మీ నర్సింహా రెడ్డి

కడ్తాల్, నవంబర్ 06, (ప్రజా కలం) హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మీడియా ప్యానలిస్టు గూడూరు లక్ష్మీ నర్సింహా రెడ్డి పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీష్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేసేందుకు తనకు అవకాశం కల్పించాలని హరీష్ రావును కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న తన రాజకీయ ప్రస్థానాన్ని, ప్రజా జీవితంలో నిర్వహించిన వివిధ బాధ్యతలను ఆయనకు వివరించారు. గతంలో సర్పంచిగా, తెలంగాణ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవంతో పాటు, ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మీడియా ప్యానలిస్టుగా పార్టీ వాణిని ప్రజల్లోకి తీసుకెళ్తున్న విషయాన్ని వివరించారు. పట్టభద్రుల సమస్యలు, నిరుద్యోగ యువత సమస్యలు, విద్యావ్యవస్థలో నెలకొన్న సవాళ్లు, ఉద్యోగ అవకాశాలు, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, కాంట్రాక్టు మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ఎమ్మెల్సీగా తన గొంతుకను వినిపించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. పట్టభద్రుల హక్కుల పరిరక్షణ, యువతకు ఉపాధి అవకాశాలు, విద్యారంగ అభివృద్ధి తన ప్రధాన ప్రాధాన్యతలుగా ఉంటాయని పేర్కొంటూ, పార్టీ నాయకత్వం తనకు అవకాశం కల్పించాలని లక్ష్మీ నర్సింహా రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా హరీష్ రావు సానుకూలంగా స్పందించి పార్టీలో చర్చించిన తరవాత నిర్ణయం తీసుకుంటామని తెలిపినట్లు పేర్కొన్నారు. హరీష్ రావును కలిసిన వారిలో బీఆర్ఎస్ యూత్ వింగ్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ కేశని మహేష్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కంబాల పరమేష్, తదితరులు పాల్గొన్నారు.



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,Telangana -503001
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com

ప్రభుత్వ లక్ష్యాల సాధనలో నిర్మల్ జిల్లా పనితీరు మెరుగుపరచాలి

అధికారులతో సమన్వయం చేసుకుంటూ పథకాల అమలును వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



నిర్మల్ నవంబర్ 06 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో సాధించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. విద్య, ఉపాధి హామీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, తాగునీటి సరఫరా, చేయూత పింఛన్ల పరిశీలన తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి జిల్లాలో ప్రభుత్వ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్‌తో కలిసి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాల అమలు, నిధుల వినియోగం, నిర్దేశిత లక్ష్యాల పురోగతిపై ప్రధాన కార్యదర్శి సమీక్షించారు. సమగ్ర శిక్ష అభియాన్, పీఎం శ్రీ పథకాల కింద మంజూరైన నిధులను జనవరి మొదటి వారంలోగా గరిష్ట స్థాయిలో వినియోగించాలని సీఎస్ సూచించారు. పీఎం శ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, ఇతర మరమ్మతు పనులను చేపట్టాలని, విద్యార్థుల హాజరు శాతం పెంచాలని సూచించారు. మధ్యాహ్న భోజనం, అల్పాహార పథకాలను నాణ్యతతో అమలు చేయాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే విద్యార్థులకు యూనిఫారాలు, కిట్లు అందేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. వేసవి కాలం ముగిసే వరకు ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందించడమే ప్రధాన ప్రాధాన్యతగా ఉండాలని సీఎస్ స్పష్టం చేశారు. జిల్లా, మండల స్థాయిలో తాగునీటి కమిటీలను ఏర్పాటు చేసి ప్రతి వారం సరఫరా పరిస్థితిని సమీక్షించాలని సూచించారు. నవంబర్ 15లోగా చేతిపంపులు, బోర్లు, బహిరంగ బావులకు సంబంధించిన మరమ్మతులు పూర్తి చేయాలని, నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తాగునీటి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. మిషన్ భగీరథ పైపులైన్లలో లీకేజీలు, ప్రెజర్ వాల్వ్‌లను నిరంతరం పర్యవేక్షించాలని, అక్రమ కనెక్షన్లు, నీటి వృథాను అరికట్టాలని తెలిపారు. వి బి జి రామ్ జి పథకం కింద చేపట్టే పనులను నాణ్యతతో అమలు చేస్తూ మార్చి నెలాఖరు నాటికి 12 కోట్ల పనిదినాల లక్ష్యాన్ని సాధించాలని సీఎస్ సూచించారు. గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించి కూలీలకు విస్తృతంగా ఉపాధి కల్పించాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని, ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీలతో సమన్వయం చేసుకుంటూ అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేయాలని సీఎస్ ఆదేశించారు. పూర్తయిన ఇళ్లకు 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక లోగో స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక అందించేలా 'మన ఇసుక – మన వాహనం' యాప్‌ను సమర్థవంతంగా వినియోగించాలని, రవాణా ఖర్చులు మాత్రమే వసూలు చేయాలని తెలిపారు. అలాగే లబ్ధిదారులకు సిమెంట్ బస్తాను రూ.230కే అందించేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ రాయితీలు పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు చేరేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో ప్రతి జిల్లా మెరుగైన ఫలితాలు సాధించాలని, ముఖ్యమంత్రి డాష్‌బోర్డులో నమోదైన అంశాలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సీఎస్ సూచించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా చేరవేసేందుకు సోషల్ మీడియాను సమర్థవంతంగా వినియోగించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విజయలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి బోజన్న, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాల సాధనలో జిల్లాల పనితీరు పెరగాలి : సీఎస్ సంజయ్ జాజు




పెద్దపల్లి,నవంబర్ 06:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) ప్రభుత్వ పథకాల అమలు,లక్ష్యాల సాధనలో జిల్లాల పనితీరు మెరుగుపడాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు స్పష్టం చేశారు.శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడగా,పెద్దపల్లి ఐడీఓసీ నుంచి కలెక్టర్ కోయ శ్రీ హర్ష,అదనపు కలెక్టర్లు శ్రీరాములు,అరుణ శ్రీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్,పీఎం శ్రీ పథకాల నిధుల వ్యయాన్ని జనవరి మొదటి వారానికల్లా నూరు శాతానికి చేర్చాలని,ఎంపిక చేసిన 794 పీఎం శ్రీ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా ఫలితాలపై దృష్టి సారించాలని ఆదేశించారు.వచ్చే విద్యా సంవత్సరానికి యూనిఫారాలు, విద్యార్థి కిట్లను సకాలంలో అందించేలా ముందస్తు కార్యాచరణ రూపొందించాలని, వికసిత్ భారత్ జీ రామ్ జీ నిధులతో పాఠశాలల్లో అదనపు గదులు,మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.అలాగే వేసవి ముగిసే వరకు తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నవంబర్ 15 నాటికి బోర్లు,చేతిపంపుల మరమ్మతులు పూర్తి చేసి,నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రత్యేక డ్రైవ్ ద్వారా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. వికసిత్ భారత్ జీ రామ్ జీ ద్వారా నాణ్యమైన పనులు చేపట్టి మార్చి నెలాఖరు నాటికి 12 కోట్ల పనిదినాల లక్ష్యాన్ని సాధించాలని పేర్కొన్నారు.మరోవైపు ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని,లబ్ధిదారులకు ఉచిత ఇసుక అందేలా పర్యవేక్షిస్తూ,ఒక్కో సిమెంట్ బస్తాను రూ.230 సబ్సిడీ ధరకే అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

సొంత పార్టీ ఎంపీ కార్యక్రమానికి వెళ్తే సస్పెన్షనా

రెండు దశాబ్దాల విధేయతకు దక్కిన బహుమతి ఇదేనా

మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాలతోనే వేటు - తిరుపతి నాయక్ సంచలన ఆరోపణ



పెద్దపల్లి,నవంబర్ 06:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) తాము రెండు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీనే నమ్ముకుని విధేయులుగా పనిచేస్తున్నామని,అలాంటి తమపై ఏకపక్షంగా సస్పెన్షన్ వేటు వేయడం తీవ్ర అన్యాయమని మలహర్ మండలం కొయ్యూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు లాకావత్ తిరుపతి నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా లాకావత్ తిరుపతి నాయక్ మీడియాతో మాట్లాడుతూ ఓటు హక్కు వచ్చిన నాటి నుంచి కాంగ్రెస్ పార్టీ కోసమే శ్రమిస్తున్నామని, ఎన్నడూ పార్టీ మారే ఆలోచన కూడా చేయలేదని ఆయన స్పష్టం చేశారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో తన భార్య ఛాయాశాస్త్రి వార్డు మెంబర్‌గా ఎన్నికయ్యారని తెలిపిన ఆయన,ఇటీవల విశాఖ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు బ్యాగుల పంపిణీ కార్యక్రమం జరిగిందన్నారు.ఈ కార్యక్రమానికి స్థానిక ఎంపీ గడ్డం వంశీకృష్ణ హాజరుకాగా,తాము కూడా అందులో పాల్గొన్నామని తెలిపారు.అయితే,సొంత పార్టీ ఎంపీ పాల్గొన్న సేవా కార్యక్రమానికి వెళ్లారన్న నెపంతో ఉప సర్పంచ్ లాకావత్ సవేందర్, లాకావత్ లక్ష్మి,కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ కలీంలపై వేటు వేయడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.ఈ సస్పెన్షన్‌పై మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జంగిడి శ్రీనివాస్‌ను ఫోన్‌లో నిలదీయగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పైనుంచి ఆదేశించి పేర్లు ఇవ్వడం వల్లే చర్యలు తీసుకున్నట్లు స్పష్టంగా చెప్పారని తిరుపతి నాయక్ ఆరోపించారు.ఎలాంటి షోకాజ్ నోటీసు ఇవ్వకుండా,కనీస వివరణ కూడా తీసుకోకుండా క్రమశిక్షణా ఉల్లంఘన పేరుతో పార్టీ నుంచి బహిష్కరించడం ఏ రకమైన న్యాయమని ఆయన ప్రశ్నించారు.పార్టీ ఎంపీ వంశీకృష్ణ పిలుపునిచ్చిన కార్యక్రమానికి వెళ్లడమే నేరమైతే,ఎన్నికల్లో ఆయన గెలుపు కోసం పనిచేసిన కార్యకర్తల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అసలు తాము చేసిన తప్పేంటో పార్టీ అధిష్ఠానం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.ఈ వ్యవహారంపై గాంధీభవన్‌కు చేరుకుని టీపీసీసీ పెద్దలకు లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేశామని,పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న తమలాంటి నిజమైన కార్యకర్తలకు న్యాయం చేసి, సస్పెన్షన్‌ను తక్షణమే రద్దు చేయాలని తిరుపతి నాయక్ కోరారు.

బుద్ధుని మార్గంలో నడుస్తూ సమాజ శ్రేయస్సుకు పాటుపడాలి

- ప్రముఖ బౌద్ధ భిక్షువు మహావీరో థేరో పిలుపు



తానూర్, నవంబర్ 6(ప్రజా కలం): ప్రపంచానికి శాంతి, అహింసా మార్గాన్ని చూపిన గౌతమ బుద్ధుని బోధనలను ఆచరిస్తూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రముఖ బౌద్ధ భిక్షువు మహావీరో థేరో పిలుపునిచ్చారు. ముథోల్ మండలం రాంటెక్ గ్రామంలోని విక్రమ్ శీల బుద్ధ విహార్‌లో మూడు నెలలుగా కొనసాగిన వర్షావాస్ కార్యక్రమం శుక్రవారం బౌద్ధ సంప్రదాయాల ప్రకారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా గ్రామ బౌద్ధ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహావీరో థేరో, బోధి ధమ్మో థేరోలకు ఘన స్వాగతం పలికారు.

ముందుగా గ్రామంలోని ఆటో స్టాండ్ వద్దకు చేరుకున్న బౌద్ధ భిక్షువులకు ప్రజలు పూలతో స్వాగతం పలికారు. సుమారు 100 మీటర్ల పొడవైన బౌద్ధ జెండాను చేతబట్టి, జై భీమ్, బుద్ధం శరణం గచ్ఛామి నినాదాలు చేస్తూ ఆటో స్టాండ్ నుంచి బుద్ధ విహార్ వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం సంప్రదాయబద్ధంగా భిక్షువుల పాదాలను నీటితో కడిగి గౌరవం తెలిపారు. అక్కడి నుంచి అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నీలి జెండాను ఆవిష్కరించగా, సమతా సైనిక్ దళ్ సభ్యులు గౌరవ వందనం సమర్పించారు. బుద్ధ విహార్‌లో బుద్ధుని విగ్రహం ఎదుట కొవ్వొత్తులు వెలిగించి బుద్ధ వందనలు నిర్వహించారు.

ఈ సందర్భంగా మహావీరో థేరో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ బుద్ధ విహార్‌కు వచ్చి బుద్ధ వందనలు చేయాలని, కనీసం పది నిమిషాల పాటు ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. బుద్ధ విహార్‌లో బౌద్ధ ధర్మానికి సంబంధించిన పుస్తకాలతో పాటు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జీవిత చరిత్ర, ఆయన రచించిన గ్రంథాలను అందుబాటులో ఉంచాలని అన్నారు. పిల్లలకు విహార్‌లోనే ప్రత్యేక బోధన తరగతులు నిర్వహించి విద్యావరంగా ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యను అభ్యసించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం ద్వారా గ్రామానికి, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

గౌతమ బుద్ధుని జీవిత విశేషాలను వివరిస్తూ రాజకుటుంబంలో జన్మించిన సిద్ధార్థుడు అపారమైన సంపద, సుఖసంతోషాలు ఉన్నప్పటికీ ప్రజల కష్టాలను తెలుసుకోవడానికి రాజభోగాలను వదులుకుని సత్యాన్వేషణకు బయలుదేరారని తెలిపారు. ప్రజల మధ్య జీవిస్తూ వారి బాధలను అర్థం చేసుకున్నారని, మానవ జీవితంలోని దుఃఖానికి కారణాలను అన్వేషించి వాటి నుంచి విముక్తి పొందే మార్గాన్ని ప్రపంచానికి బోధించారని వివరించారు. బుద్ధుడు చూపిన అష్టాంగ మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరిస్తే జీవితంలో ప్రశాంతత, సంతోషం లభిస్తాయని అన్నారు. బుద్ధుని బోధనలను వినడానికే పరిమితం కాకుండా నిత్యజీవితంలో పాటించాలని పిలుపునిచ్చారు.

ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించి వారికి సేవ చేయాలని మహావీరో థేరో సూచించారు. ఉద్యోగాలు, ఉపాధి కోసం పట్టణాలకు వెళ్లిన కొందరు తమ తల్లిదండ్రులను గ్రామాల్లో ఒంటరిగా వదిలేస్తున్నారని, అలా చేయకుండా వారిని ప్రేమగా చూసుకుంటూ అండగా నిలవాలని అన్నారు. తల్లిదండ్రులను గౌరవించే కుటుంబాల్లో సుఖశాంతులు నెలకొంటాయని పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచే పిల్లలకు తల్లిదండ్రుల పట్ల గౌరవం, సేవాభావం నేర్పించాలని సూచించారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బౌద్ధ ధర్మాన్ని స్వీకరించి సమాజానికి బుద్ధుని మార్గాన్ని పరిచయం చేశారని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలైన విద్య, సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగడంతో పాటు బుద్ధుడు, అంబేద్కర్ చూపిన మార్గంలో నడవాలని సూచించారు. మహనీయుల పాటలకు కేవలం వినోదం కోసం నృత్యాలు చేయడం కంటే వారి ఆశయాలు, సందేశాలకు గౌరవం ఇచ్చేలా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. వారి పేర్లను వినోదానికే పరిమితం చేయకుండా సమాజంలో చైతన్యం కలిగించాలని సూచించారు.

బౌద్ధ ధర్మంలోని నైతిక విలువలు, మానవత్వం, సమానత్వం, తల్లిదండ్రుల పట్ల గౌరవం వంటి సూత్రాలను ప్రతి ఒక్కరూ పాటించాలని మహావీరో థేరో అన్నారు. మూడు నెలల పాటు నిర్వహించిన వర్షావాస్ కార్యక్రమంలో గ్రామ బౌద్ధ ప్రజలు బుద్ధుని గ్రంథాలను చదువుతూ ధర్మంపై అవగాహన పెంపొందించుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా గ్రామంలో బౌద్ధ ధర్మంపై మరింత చైతన్యం పెరగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో విక్రమ్ శీల బుద్ధ విహార్ కమిటీ సభ్యులు, సమతా సైనిక్ దళ్ సభ్యులు, గ్రామ బౌద్ధ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైఫల్యాల మళ్లింపునకే కాళేశ్వరంపై కాంగ్రెస్ విషప్రచారం

400 కిలోమీటర్లు.. నిజాల నిగ్గు తేల్చిన సైకిల్ యాత్ర - సైకిల్ యోధులకు కేసీఆర్ ఆత్మీయ ఆలింగనం

పంపులు ఆన్ చేయకుంటే ప్రజా తిరుగుబాటు తప్పదు -బీఆర్ఎస్ నేత ఉప్పు రాజ్‌కుమార్





పెద్దపల్లి,నవంబర్ 06:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) తెలంగాణ సమాజానికి అన్నంపెట్టే జీవనాడి కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాన్ని,అసత్యాలను క్షేత్రస్థాయిలో తిప్పికొట్టి ప్రజలకు నిజాలు వివరించడానికే మేడిగడ్డ నుంచి కొండపోచమ్మ సాగర్ వరకు విస్తృత సైకిల్ యాత్ర చేపట్టినట్లు బీఆర్ఎస్ పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్ స్పష్టం చేశారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తనతో పాటు 400 కిలో మీటర్ల సైకిల్ యాత్రలో పాల్గొన్న కాశిపాక శ్రీనివాస్,ముత్యం లక్ష్మణ్ గౌడ్,ఆరేపల్లి సరేష్,అమ్ము కుమార్ లతో కలిసి ఆయన మాట్లాడారు.

వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించేందుకే కుట్రలు

ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలు,ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక చేతులెత్తేసిన రేవంత్ రెడ్డి సర్కార్,ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాళేశ్వరం ప్రాజెక్టుపై నిరాధార ఆరోపణలు చేస్తోందని రాజ్‌కుమార్ మండిపడ్డారు. మేడిగడ్డ వద్ద రెండు పిల్లర్ల కుంగుబాటును భూతద్దంలో చూపిస్తూ లక్ష కోట్ల అవినీతి అంటూ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.సముద్ర మట్టానికి 100 మీటర్ల దిగువన ఉన్న గోదావరి జలాలను 600 మీటర్ల ఎత్తుకు ఎత్తిపోసి కొండపోచమ్మ సాగర్ దాకా తరలించిన అపర భగీరథుడు కేసీఆర్ అని కొనియాడారు.

400 కిలోమీటర్లు.. అడుగడుగునా ఘన స్వాగతం

అక్టోబర్ 28న మేడిగడ్డ వద్ద బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్,జెడ్పీ చైర్‌పర్సన్ పుట్ట మధు,మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతా రెడ్డి జెండా ఊపి ప్రారంభించిన ఈ యాత్ర దాదాపు 400 కిలోమీటర్ల మేర సాగిందని వివరించారు.పెద్దపల్లి,గోదావరిఖని ప్రాంతాలకు చెందిన వది మంది సైక్లిస్టులతో ప్రారంభమై అన్నారం,సుందిళ్ల,గోలివాడ పంప్‌హౌస్,ఎల్లంపల్లి,నందిమేడారం, గాయత్రి పంప్‌హౌస్,మిడ్ మానేరు, అనంతగిరి,రంగనాయక సాగర్,మల్లన్న సాగర్ మీదుగా కొండపోచమ్మ సాగర్ చేరుకుందన్నారు.యాత్ర సాగిన మార్గంలో మాజీ మంత్రులు హరీశ్ రావు,కొప్పుల ఈశ్వర్,మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్,రసమయి బాలకిషన్,సిద్ధం వీరయ్య,ప్రతాప్ రెడ్డి తదితర పార్టీ శ్రేణులు సంపూర్ణ మద్దతునిచ్చి ఆతిథ్యం ఇచ్చారని తెలిపారు.

పంటలు ఎండి రైతుల కన్నీరు

యాత్ర సాగిన వెంబడి గ్రామాలు,గిరిజన తండాల్లోని రైతులు కాంగ్రెస్ పాలనపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఆయన వెల్లడించారు.కేసీఆర్ హయాంలో 24 గంటల ఉచిత విద్యుత్,సకాలంలో రైతుబంధు,రైతుబీమాతో నిండుగా పంటలు పండితే,నేడు కరెంట్ కోతలు,సాగునీటి ఎద్దడితో పంటలు ఎండిపోయి రైతులు కన్నీరుమున్నీరవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రాణహిత ద్వారా రోజూ 22 వేల క్యూసెక్కుల నీరు దిగువకు వృథాగా పోతున్నా,కన్నెపల్లి వద్ద సిల్ట్ తీసి పంపులు ఆన్ చేయకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని,ఏపీ ప్రభుత్వం పట్టిసీమ ద్వారా నీటిని తరలించుకుపోతున్నా చోద్యం చూస్తోందని ధ్వజమెత్తారు.

కేసీఆర్‌తో ఆత్మీయ భేటీ

యాత్ర ముగింపు సందర్భంగా కొండపోచమ్మ సాగర్ వద్ద పార్టీ అధినేత కేసీఆర్ తమను ఆత్మీయంగా ఆహ్వానించి, దాదాపు 2 గంటల 40 నిమిషాల పాటు ముఖాముఖి మాట్లాడారని రాజ్‌కుమార్ భావోద్వేగంతో తెలిపారు. స్వయంగా భోజన వసతులు ఏర్పాటు చేసి,అలసట లేకుండా క్షేత్రస్థాయి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారని చెప్పారు.తన 25 ఏళ్ల ఉద్యమ ప్రస్థానం,పాదయాత్రలు,రైల్ రోకోల ఫోటో ఆల్బమ్‌ను చూసి కేసీఆర్ ముగ్ధులై ఆటోగ్రాఫ్ ఇచ్చి ఆశీర్వదించారన్నారు. సైక్లిస్టుల తిరుగు ప్రయాణం కోసం ప్రత్యేక వాహనాలు సమకూర్చిన కేసీఆర్ పెద్దరికం, నాయకత్వ లక్షణాలు ఎన్నటికీ మరువలేనివని కొనియాడారు. ప్రభుత్వం తక్షణమే ద్వేషపూరిత రాజకీయాలు పక్కనపెట్టి, పంపులు ఆన్ చేసి రైతాంగానికి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.400 కిలోమీటర్ల ఈ సైకిల్ యాత్రకు పూర్తి సహకారాన్ని అందించిన పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.సమావేశం అనంతరం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.400 కిలో మీటర్ల సైకిల్ యాత్రలో పాల్గొన్న ఉప్పు రాజ్ కుమార్,కాశిపాక శ్రీనివాస్,ముత్యం లక్ష్మణ్ గౌడ్,ఆరేపల్లి సరేష్,అమ్ము కుమార్ లను పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో బీఎఆర్ఎస్ మండల అధ్యక్షుడు మార్కు లక్ష్మణ్,కౌన్సిలర్ వెన్నం రవీందర్,మాజీ కౌన్సిలర్లు పెంచల శ్రీధర్,పూదరి చంద్ర శేఖర్,ఉపసర్పంచ్ మేకల కుమార్ యాదవ్,గండు రంగయ్య,బొద్దుపల్లి రమేష్,వైద శ్రీనివాస్,పల్లె మధు,జక్కుల శ్రీకాంత్,అమెరిశెట్టి శ్రీకాంత్,సంతోష్, శ్రీనివాస్,కుక్క మనోజ్,రాజు,మల్లికార్జున్, ఉప్పు శివకుమార్,తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడపడుచులకు అండగా కళ్యాణలక్ష్మి!

580 మందికి పైగా లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



గద్వాల ప్రతినిధి, నవంబర్ 6 (ప్రజా కలం):

బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన 580 మందికి పైగా లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద ఒక్కొక్కరికి రూ.1,00,116 చొప్పున చెక్కులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కళ్యాణలక్ష్మి చెక్కుల కోసం ఎవరూ మధ్యవర్తులకు డబ్బులు చెల్లించవద్దని స్పష్టం చేశారు. రైతుల సంక్షేమం కోసం సాగునీరు అందించడంతో పాటు, గద్వాల నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. మహిళలు చెక్కుల ద్వారా అందిన మొత్తాన్ని అవసరాలకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి, నరసింహులు యాదవ్, సింగల్ విండో చైర్మన్ శేషంపల్లి ఎస్ తిమ్మారెడ్డి, మాజీ ఎంపీపీ వై. రాజారెడ్డి, వైస్ ఎంపీపీ పెద్ద వీరన్న, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాసరెడ్డి, విక్రసింహారెడ్డి, శేషంపల్లి నరసింహులు, మాజీ ఎంపిటిసి గోపాల్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సవరణ, మాజీ ఎంపిటిసి వెంకటన్న, మల్దకల్ గోపాల్, సర్పంచులు వినోద్, తుమ్ కృష్ణారెడ్డి, జి.రాముడు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ ధన్వంతరి
నారాయణ జయంతి వేడుకలు



పెద్దపల్లి,నవంబర్ 06:(ప్రజాకాలం జిల్లా ప్రతినిధి) మండల పరిధిలోని పెద్దకల్వల గ్రామంలో శ్రీ ధన్వంతరి నారాయణ జయంతి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో,ఘనంగా జరిగాయి.శ్రీ ఆదర్శ నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఈ వేడుకల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు,ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా సంఘం అధ్యక్షుడు విష్ణు భక్తుల రవీందర్,ప్రధాన కార్యదర్శి నారాయణదాసు శ్రీనివాస్ మాట్లాడుతూ ధన్వంతరి స్వామి దివ్యాశీస్సులతో సమాజంలోని ప్రజలంతా ఆయురారోగ్యాలు,సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఆధ్యాత్మిక చింతనతో పాటు సంఘం బలోపేతానికి, సామాజిక ఐక్యతకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు,నాయకులు నారాయణదాసు నర్సయ్య,నారాయణదాసు నంబయ్య, కొమరయ్య,రాజమల్లు,శ్రీనివాస్,వెంకటేష్,కుమార్,వివేక్,ప్రశాంత్,అజయ్,రాకేష్, నారాయణదాసు కుమారస్వామి, నాగసాగర్,శ్రీకాంత్,సోన్నాయిల వంశీకృష్ణ, అభిషేక్,కంది మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడిగా సుద్దాల సతీష్ గౌడ్

పెద్దపల్లి,నవంబర్ 06:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) భారతీయ జనతా పార్టీ పెద్దపల్లి జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడిగా సుద్దాల సతీష్ గౌడ్ వరుసగా రెండోసారి నియమితులయ్యారు. గత 23 ఏళ్లుగా పార్టీకి ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి నాయకత్వం ఈ బాధ్యతలను పునరుద్ధరించింది. సతీష్ గౌడ్ గతంలో గ్రామ శాఖ అధ్యక్షుడిగా రెండుసార్లు,బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడిగా,ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీజేవైఎం కార్యదర్శిగా,పెద్దపల్లి అసెంబ్లీ ఓబీసీ మోర్చా కన్వీనర్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు సంజీవరెడ్డి,ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు చాతరాజు రమేష్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లాలో ఓబీసీ మోర్చాను మరింత బలోపేతం చేస్తూ,వెనుకబడిన వర్గాల హక్కుల కోసం శ్రమిస్తానని పేర్కొన్నారు. సుద్దాల సతీష్ గౌడ్ నియామకంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.



చందోలి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం



గొల్లపల్లి నవంబర్ 06 ప్రజా కలం ప్రతినిధి గొల్లపల్లి మండలంలోని చెందోలి గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలను సుమారు 150 మందికి పైగా నిర్వహించగా గ్రామ ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకున్నారు.పరీక్షల అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బొమ్మన కుమార్, సాయిని నరహరి క్లబ్ ప్రతినిధులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా!

చెక్ పోస్ట్ లు దాటుతున్న ట్రాక్టర్ లు - అధికారుల మౌనం

మల్లాపూర్ నవంబర్ 06 (ప్రజా కలం ప్రతినిధి) నిర్మల్ జిల్లా సోమరిపేట,బాధనకుర్తి ప్రాంతాల నుంచి జగిత్యాల జిల్లా మల్లాపూర్, ఇబ్రహింపట్నం మండలాలకు ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. దళారుల అండదండలతో వదుల సంఖ్యలో ట్రాక్టర్లు రాత్రింబవళ్లు ఇసుకను తరలిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మార్గమధ్యంలో చెక్‌పోస్టు లు ఉన్నప్పటికీ వాటిని దాటుకుంటూ అక్రమ రవాణా సాగుతుండటం అధికారుల నిఘా వైఫల్యానికి అద్దం పడుతోంది. ఇంత పెద్దఎత్తున ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్న సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ ఇసుక రవాణా వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా సంబంధిత అధికారులు మౌనం వహించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కళ్లు తెరిచి జిల్లా సరిహద్దు వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



వాల్యూ పిచ్ ఈ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను సందర్శించిన ఆసిఫాబాద్ టిఎస్ మోడల్ స్కూల్ విద్యార్థులు

బెల్లంపల్లి, నవంబర్ 6,(ప్రజాకలం)ప్రతినిధి... మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని వాల్యూ పిచ్ ఈ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను ఆసిఫాబాద్ కు చెందిన పిఎస్ మోడల్ స్కూల్ విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థ సీఈఓ వెంకట రమణ విద్యార్థులను ఉద్దేశించి ఐటీ రంగంలో ఉద్యోగ అవకాశాలు, ఉద్యోగాలు పొందాలంటే చదవాల్సిన కోర్సులు, అవసరమైన నైపుణ్యాల గురించి వివరించారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. సంస్థ డైరెక్టర్ కిరణ్ మృదుల ఐటీ రంగం అంటే ఏమిటి,సంస్థలో జరిగే పనులు, ఐటీ ఉద్యోగాల్లోని రెండు ప్రధాన విభాగాలైన ప్రొడక్ట్ మరియు డెవలప్‌మెంట్ గురించి విద్యార్థులకు స్పష్టంగా వివరించారు.మేనేజర్ ఆదర్శ్ వర్ధన్ రాజు సంస్థ వర్క్‌ఫ్లో, వివిధ విభాగాల పనితీరు మరియు వాల్యూ పిచ్ రూపొందించిన టెక్నాలజీ ప్రొడక్ట్స్ గురించి విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో మేనేజర్ జయచందర్, అడ్మిన్ సుధాకర్, టెక్నికల్ ఇంజనీర్ రామసాగర్, పాఠశాల ఉపాధ్యాయులు, 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



జిల్లా అధికార యంత్రాంగం చొరవతో దత్తత
వివాదానికి సామరస్యపూర్వక పరిష్కారం

చిన్నారి శ్రేయస్సు, ఉజ్వల భవిష్యత్తే ప్రధాన లక్ష్యంగా మానవతా దృక్పథంతో నిర్ణయం

హిందూ దత్తత మరియు నిర్వహణ చట్టం-1956 ప్రకారం దత్తత ప్రక్రియ పూర్తి

చిన్నారి చట్టపరమైన హక్కుల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు

దత్తత వివాదం పరిష్కారం కావడంతో రిట్ అప్పీల్ ఉపసంహరణకు ప్రభుత్వానికి నివేదిస్తా..





జగిత్యాల ప్రతినిధి నవంబర్ 6 (ప్రజా కలం)

చిన్నారుల సంక్షేమం, వారి భవిష్యత్తు భద్రత, చట్టపరమైన హక్కుల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని జగిత్యాల జిల్లా పరిపాలనా యంత్రాంగము స్పష్టం చేసింది.జగిత్యాల జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా జరిగిన దత్తతకు సంబంధించి తలెత్తిన వివాదాన్ని జిల్లా పరిపాలనా యంత్రాంగము ప్రత్యేక చొరవతో, మానవతా దృక్పథంతో, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా సామరస్యపూర్వకంగా పరిష్కరించారు.చిన్నారి భవిష్యత్తును ప్రభావితం చేసే సున్నితమైన అంశం కావడంతో ఈ వ్యవహారాన్ని జిల్లా పరిపాలనా యంత్రాంగము ప్రత్యేకంగా పరిగణించారు. దత్తతకు సంబంధించిన వివాదం కొనసాగడం వల్ల చిన్నారి సంక్షేమం, కుటుంబ వాతావరణం, భవిష్యత్తు భద్రతపై ప్రతికూల ప్రభావం పడకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. దత్తతకు సంబంధించిన అంశాల్లో కేవలం సాంకేతిక, పరిపాలనా పరమైన విషయాలకే పరిమితం కాకుండా, చిన్నారి శ్రేయస్సు, మానసిక ప్రశాంతత, కుటుంబ భద్రత, విద్య, ఆరోగ్యం, భవిష్యత్తు అవకాశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా పరిపాలనా యంత్రాంగము భావించింది.ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ, దత్తత వివాదానికి చట్టబద్ధమైన పరిష్కారం లభించే విధంగా చర్యలు చేపట్టారు.హిందూ దత్తత, నిర్వహణ సెక్షన్ 1956 ప్రకారం దత్తత ప్రక్రియను చట్టబద్ధంగా స్థానిక జగిత్యాల సబ్ రిజిస్టర్ ఆఫీస్ లో పూర్తి చేశారు.సంబంధిత బాలల సంక్షేమ అధికారుల సమక్షంలో దత్తతకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేయడం ద్వారా చిన్నారి భవిష్యత్తుకు చట్టపరమైన భరోసా కల్పించే దిశగా ముఖ్యమైన ముందడుగు పడింది.దత్తత ప్రక్రియలో చట్టపరమైన నిబంధనల అమలు, చిన్నారి ప్రయోజనాల పరిరక్షణ, సంబంధిత కుటుంబాల మధ్య సామరస్యపూర్వక పరిష్కారం వంటి అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు.గతంలో వివాదాస్పదంగా మారిన ఈ దత్తత వ్యవహారం జిల్లా పరిపాలనా యంత్రాంగము చొరవతో శాంతియుతంగా పరిష్కారమైంది.చిన్నారి ప్రయోజనాలను కేంద్రంగా చేసుకుని, సంబంధిత వర్గాల మధ్య నెలకొన్న వివాదానికి పరిష్కారం లభించేలా జిల్లా యంత్రాంగం వ్యవహరించింది.ఈ పరిణామంతో చిన్నారి కుటుంబ వాతావరణంలో భద్రంగా పెరిగేందుకు, విద్యాభ్యాసం కొనసాగించేందుకు, భవిష్యత్తులో చట్టపరమైన హక్కులను పొందేందుకు మార్గం సుగమమైంది.దత్తతకు సంబంధించిన సమస్య సామరస్యపూర్వకంగా పరిష్కారం కావడంతో, ఈ వ్యవహారానికి సంబంధించి గతంలో దాఖలు చేసిన రిట్ అప్పీల్ ఉపసంహరణ కొరకు ప్రభుత్వానికి నివేదిస్తామని జిల్లా పరిపాలనా యంత్రాంగం తెలిపింది.చిన్నారి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వివాదాన్ని కొనసాగించకుండా, చట్టబద్ధమైన పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడం ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశంగా నిలిచింది.ప్రభుత్వ పరిపాలనలో చట్టబద్ధతతో పాటు మానవతా విలువలకు కూడా సముచిత ప్రాధాన్యత ఉండాలనే విషయాన్ని ఈ పరిణామం ప్రతిబింబిస్తోంది.ముఖ్యంగా చిన్నారులకు సంబంధించిన సున్నితమైన సమస్యలను పరిష్కరించే సందర్భంలో వారి భవిష్యత్తు, భద్రత, సంక్షేమం అన్నింటికంటే ముఖ్యమని ఈ వ్యవహారం స్పష్టం చేస్తోంది.

మైనారిటీ యువతకు విదేశీ భాషల్లో ఉచిత శిక్షణ

-జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి జి.రవికుమార్



పెద్దపల్లి,నవంబర్ 06 (ప్రజాకలం జిల్లా ప్రతినిధి): హైదరాబాద్‌లోని తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో మైనారిటీ అభ్యర్థులకు జపనీస్,జర్మన్,ఫ్రెంచ్, కొరియన్ భాషల్లో 45 రోజుల ఉచిత ఫౌండేషన్ కోర్సులను నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి జి.రవికుమార్ తెలిపారు.విదేశాల్లో ఉన్నత విద్య,ఉద్యోగావకాశాలు లక్ష్యంగా ఈ శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పది,ఇంటర్ లేదా డిగ్రీ ఉత్తీర్ణులైన ముస్లిం, క్రైస్తవ,సిక్కు,జైన, బౌద్ధ,పార్సీ అభ్యర్థులు అర్హులని వెల్లడించారు.ఆసక్తి గలవారు ఒరిజినల్ విద్యార్హత పత్రాలు,ఆధార్ కార్డు,రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో నవంబర్ 10 లోగా హైదరాబాద్ నాంపల్లిలోని తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్ ఇందిరా ప్రియదర్శిని డిగ్రీ కళాశాల ప్రాంగణం, ఎంఏఎం క్యాంపస్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.వివరాలకు 040-23236112, 9059050062 నంబర్లలో సంప్రదించవచ్చని,జిల్లా అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి జి. రవికుమార్ కోరారు.

గోదావరి పుష్కరాలకు పక్కా ప్రణాళిక సిద్ధం చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి,నవంబర్ 06(ప్రజాకలం జిల్లా ప్రతినిధి): 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు జరిగే గోదావరి పుష్కరాలకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పక్కా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు బి. శ్రీరాములు,జె.అరుణశ్రీలతో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఘాట్ల అభివృద్ధి, తాగునీరు,పారిశుధ్యం,విద్యుత్, రహదారులు,రవాణా,పార్కింగ్ వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.పోలీసు బందోబస్తు,ట్రాఫిక్ నియంత్రణ,అత్యవసర వైద్య సేవలు,అగ్నిమాపక ఏర్పాట్లపై ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.శాఖల వారీగా అవసరమైన నిధులు,పనులు,సిబ్బంది వివరాలతో కూడిన సమగ్ర నివేదికలను సోమవారం నాటికి తప్పనిసరిగా సమర్పించాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

22 ఏ రిజిస్ట్రేషన్లకు లైన్ క్లియర్



హైదరాబాద్ : తెలంగాణలో ఓపెన్ ప్లాట్లు, ఇళ్లు కొనుగోలు చేసి ఏళ్ల తరబడి నిషేధిత జాబితా చిక్కుముడుల్లో పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్న లక్షలాది మంది సామాన్యులకు, రియల్ ఎస్టేట్ వర్గాలకు ప్రభుత్వం ఊరటనిచ్చింది. దశాబ్దాల క్రితం లేఅవుట్ అనుమతులు పొంది, నాన్-నాలా నిబంధనలు కలిగిన ఆస్తులు సాంకేతిక లోపాలు , బేస్ సర్వే నంబర్ల బ్లాకింగ్ కారణంగా 22-ఏ నిషేధిత జాబితాలో నిలిచిపోవడంతో కొనుగోలుదారులు తీవ్ర నష్టపోయారు. ఈ సమస్యపై సమగ్ర విచారణ చేపట్టిన ప్రభుత్వం, చట్టబద్ధమైన అనుమతులు ఉన్న నాన్-నాలా ప్లాట్లు, ఇళ్ల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్లకు ప్రత్యేక వెసులుబాటు కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.రెవెన్యూ శాఖ జారీ చేసిన తాజా ఆదేశాల ప్రకారం.. జీహెచ్ఎంసీ , హెచ్ఎండీఏ, డీటీసీపీ, మున్సిపాలిటీలు, నిబంధనల ప్రకారం అనుమతులు పొందిన అప్రూవ్డ్ లేఅవుట్లకు సంబంధించిన ఆస్తులు 22-ఏ జాబితాలో ఉన్నప్పటికీ వాటి రిజిస్ట్రేషన్‌కు అనుమతిస్తారు. లింక్ డాక్యుమెంట్లు, బిల్డింగ్ లేదా లేఅవుట్ అనుమతి పత్రాలు పక్కాగా ఉన్న సందర్భాల్లో నిషేధిత జాబితా ఆంక్షలు వర్తించవు. ఈ నిర్ణయంతో రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరితో పాటు రాష్ట్రవ్యాప్తంగా 264కి పైగా కాలనీలు , లేఅవుట్లలో చిక్కుకుపోయిన ప్లాట్లకు రిజిస్ట్రేషన్ స్వేచ్ఛ లభించింది. అంతేకాకుండా, సాగు భూముల్లో గతంలో చేపట్టిన నిర్మాణాలకు సంబంధించిన అర్హమైన నాలా దరఖాస్తుల పరిష్కారానికి కూడా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. న్యాయ వివాదాలు లేని ఆస్తులకు నిర్ణీత నాలా రుసుముతో పాటు పారదర్శక నిబంధనలను వర్తింపజేస్తూ క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేస్తారు. స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దరఖాస్తుదారుల డాక్యుమెంట్లను డిజిటల్ డేటాతో సరిచూసి, ఆన్‌లైన్ వెరిఫికేషన్ పూర్తయిన వెంటనే బయోమెట్రిక్ విధానంలో వేగంగా డిజిటల్ రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేసేందుకు ఏర్పాట్లు చేశారు.ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎక్కడైనా క్షేత్రస్థాయి సాంకేతిక ఇబ్బందులు లేదా శాఖల మధ్య వ్యత్యాసాలు ఎదురైతే వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కలెక్టర్ల నేతృత్వంలో ప్రత్యేక 'జిల్లా స్థాయి కమిటీల'ను కూడా బాధ్యులుగా నియమించారు.ప్రభుత్వ తీసుకున్న ఈ సాహసోపేత నిబంధనల సవరణ వల్ల ఏళ్ల తరబడి నిలిచిపోయిన స్థిరాస్తి లావాదేవీలు తిరిగి పుంజు కోవడమే కాకుండా, మధ్యతరగతి ప్లాట్ల యజమానులకు తమ సొంత ఆస్తులపై పూర్తి హక్కులు దక్కనున్నాయి

తెలంగాణపై ఎల్‌నీనో ఎఫెక్ట్.. బోర్‌వెల్స్‌కు ఎన్‌వోసీ తప్పనిసరి

హైదరాబాద్ : ఎల్‌నీనో పరిస్థితుల నేపథ్యంలో భూగర్భ జల మట్టాలు పడిపోకుండా చూడటం, లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో జల వనరులను సంరక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తాగునీటి అవసరాలు తప్ప ఇతర పనులకు శుద్ధి చేసిన మురుగు నీటిని మాత్రమే వినియోగించాలని స్పష్టం చేస్తూ ప్రభుత్వం నూతన మార్గదర్శకాలు జారీ చేసింది. 2027 జులై చివరి వరకు అమల్లో ఉండేలా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జీవో 259 ద్వారా ఈ ఉత్తర్వులను జారీ చేశారు.

జీవో 259లోని ముఖ్యమైన నిబంధనలు

అపార్ట్‌మెంట్‌లు, గ్రూప్ హౌసింగ్ ప్రాజెక్టులు, వాణిజ్య-పారిశ్రామిక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ యూనిట్లు, బల్క్ వాటర్ సప్లైయిర్లు భూగర్భ జలాల వినియోగ నిబంధనలు-2023 ప్రకారం నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ పొందిన తర్వాతే కొత్త బోర్లు తవ్వాల్సి ఉంటుంది. అనుమతులతో బోర్‌వెల్ తవ్వకం పూర్తి చేసిన 15 రోజుల్లోగా రిగ్ ఆపరేటర్ నిర్దిష్ట అధికారికి 'వెల్ కంప్లీషన్ రిపోర్ట్'ను సబ్మిట్ చేయాలి. ఆ బోర్‌వెల్‌ను సంబంధిత తహసీల్దార్ వద్ద తప్పనిసరిగా నమోదు చేయించాలి.

నిర్మాణ ప్రాజెక్టులు, తోటల పెంపకం, ల్యాండ్‌స్కేపింగ్, రోడ్ల శుభ్రత వంటి అవసరాలకు భూగర్భ జలాలను వాడకూడదు. జలమండలి అందుబాటులోకి తెచ్చిన శుద్ధి చేసిన మురుగు నీటిని మాత్రమే వినియోగించాలి.

భూగర్భ జలాలను అక్రమంగా వెలికితీసినా లేదా దుర్వినియోగం చేసినా 'వాల్టా' చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారు.

ప్రతిఒక్కరూ వాననీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణ చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.

భూగర్భజల శాఖ: నీటి కొరత తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి తగిన సంరక్షణ చర్యలు చేపట్టాలి.

మున్సిపల్ కార్పొరేషన్లు: భవన నిర్మాణ నిబంధనలకు అనుగుణంగా వర్షపు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతల నిర్మాణాలను తప్పనిసరిగా అమలు చేయించాలి.

హైడ్రా: చెరువులు, కుంటలు, నీటి రీఛార్జ్ ప్రాంతాలను ఆక్రమణలు, వ్యర్థాల డంపింగ్, కాలుష్యం నుంచి కాపాడాలి.

మంచి నీటి సరఫరా పైప్‌లైన్ నెట్‌వర్క్‌లో లీకేజీలు, వృథాను అరికట్టడంతో పాటు కంటింజెన్సీ మానిటరింగ్ కమిటీకి ఎప్పటికప్పుడు సమగ్ర నివేదిక అందించాలి.

ఆరుతడి పంటల సాగుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలి



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి నవంబర్ 6 (ప్రజాకలం) భవిష్యత్ తరాలకు ఆస్తులు కూడబెట్టడం కంటే ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించడం ముఖ్యమని మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ అన్నారు. మెట్ట చట్టాపూర్ రైతు వేదిక లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలని సూచించారు. అనంతరం డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఏటీఎంఏ) సుధాకర్ మాట్లాడుతూ.. ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాబోయే సాగులో నీటి లభ్యత ఆధారంగా పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఇతర ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఆరుతడి పంటల సాగుతో నీటి వనరులను సంరక్షించడంతో పాటు వాతావరణ మార్పుల ప్రభావంతో రైతులకు కలిగే ఆర్థిక నష్టాలను తగ్గించుకోవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో మెట్లచిట్టాపూర్ సర్పంచ్, కోరుట్ల సహాయ వ్యవసాయ సంచాలకులు రమేష్, మండల వ్యవసాయ అధికారి ఏ. దీపిక, మెట్‌పల్లి ఏపీఎం, ఏఈఓ నరేష్, ఉపసర్పంచ్, రైతులు పాల్గొన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా నరేష్

గొల్లపల్లి నవంబర్ 06 ప్రజా కలం ప్రతినిధిగొల్లపల్లి మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం (మాదిగ) నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ సంఘ భవనంలో సంఘ సభ్యులు సమావేశం నిర్వహించి, సభ్యుల సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.సంఘం అధ్యక్షుడిగా జేరిపోతుల నరేష్, ప్రధాన కార్యదర్శిగా చెవులమద్ది రమేష్, గౌరవ అధ్యక్షులుగా చెవులమద్ది హన్మండ్లు, చిర్ర దిలీప్, ఉపాధ్యక్షులుగా నక్క అశోక్, జంగిలి శ్రీనివాస్, సలహాదారుగా చెవులమద్ది గంగాధర్, కోశాధికారిగా చెవులమద్ది మల్లేష్, ప్రచార కార్యదర్శిగా చెవులమద్ది తిరుపతిని ఎన్నుకున్నారు. వీరితో పాటు పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు జేరిపోతుల నరేష్,కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు సంఘ ఐక్యత, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు సంఘ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

